# చుట్టుపక్కల చూడరా..!

## కర్లపాలెం హనుమంతరావు



శ్రీ
కౌముది
మీ ముంగిట్లో సాహితీ వెన్నెల
www.koumudi.net

ప్రచురణ సంఖ్య: 138

# చుట్టుపక్కల చూడరా

## కర్లపాలెం హనుమంతరావు

## *విషయసూచిక*


| ఏడాది | నెల | పేరు | పేజి |
|---|---|---|---|
| 2011 | 01 | కవి అంటే..! | 3 |
| | 02 | సంపూర్ణ మద్యపానం | 7 |
| | 03 | చావటానికెందుకురా తొందర! | 9 |
| | 04 | దణ్ణం దశగుణం భవేత్! | 11 |
| | 05 | -------- | - |
| | 06 | ఇది ఇండియా... అది ఇంగ్లాండూ! | 14 |
| | 07 | దేశ భాషలందు తెలుగు లెస్స! | 17 |
| | 08 | ఇంటిదేవత | 20 |
| | 09 | నువ్వు ఎక్కదలుచుకున్న రైలు ఒక జీవిత కాలం లేటు | 23 |
| | 10 | అకాలగర్జిత దోష నివారణ మంత్రం. | 26 |
| | 11 | ----- | 29 |
| | 12 | ----- | 32 |
| 2012 | 01 | పునాదిరాళ్ళ ప్రార్థన | 34 |
| | 02 | ప్రేమపార్టీ జిందాబాద్ | 38 |
| | 03 | విగ్రహ విలాపం | 41 |
| | 04 | దశావతారాలు | 44 |
| | 05 | సాహిత్యంలో చమత్కారం | 46 |
| | 06 | మరో దండి యాత్రకి | 50 |




## సమకాలీన సమస్యలపై వ్యంగ్యాస్త్రాల పరంపర!!

1

### కవి అంటే..!

**కవి అంటే కట్టేసి వినిపించేవాడు** అని ఒక చమత్కారమయిన అర్థం. ఇప్పుడంటే కవుల మీద, కవిత్వం మీద, కవిసమ్మేళనాల మీద రకరకాల జోకులు, కార్టూనులు పేలుతున్నాయి గాని ఒక జమానాలో జనాలు కవిత్వమంటే చెవి కోసుకునేవారు. పండగలకీ, పబ్బాలకి కబ్బపఠనం ఒక ప్రధానమయిన ఆకర్షణ. ఆగస్టు 15, జనవరి 26 లాంటి జండాల పండుగలకయితే దాదాపు ప్రతి ఒక వూరిలోనూ సాయంత్రాలు కవులు సభ తీరటం ఒక ఆనవాయితీగా ఉండేదంటే ఈ కాలం కుర్రకారు నమ్ముతారో నమ్మరో మరిఆ ఇప్పుడు కూడా స్వాతంత్రదినోత్సవానికి, రిపబ్లిక్ పండగకి కనీసం ఆకాశవాణి కేంద్రాలలో కవిసమ్మేళనాలు నిర్వహిస్తున్నారు. కానీ ఎందుకో వాటికి మునుపటంత కళ ఉన్నట్లు లేదు.

మేము కళాశాలలో చదువుకునే రోజుల్లో ఉగాది, సంక్రాంతి పండుగలు వచ్చాయంటే చాలు ...ముందుగా ఎదురు చూసేది ఈ కవి సమ్మేళనాల కోసమే ఆ ఇదిగో ఈ సారి శ్రీశ్రీ గారేమీ చదువుతారో ... విశ్వనాథ గారెవరి మీదెలా విరుచుకు పడతారో, వేగుంట మోహన ప్రసాదు ఎలాంటి కవిత్వం పట్టుకోస్తారో ఆరుద్ర గారేమి చమత్కారం చేయబోతున్నారో, నారాయణ రెడ్డి గారే ఆశావహ గీతమాలపించబోతున్నారో, దాశరథిగారెవరి మీద ఏ శరమెక్కు బెట్టబోతున్నారో అనే. ఇప్పడంటే కవిత్వం ఒక సొంత ఘోషలాగయిపోయినట్లుంది కానీ గత శతాబ్దపు ఏడో దశకారంభంలో అంతకు మునుపునుంచి వస్తున్న భావ, అభ్యుదయ ధోరణులలాంటి వాటి మీద తిరుగుబాటు బావుటా ఎగరేస్తూ దిగంబరకవులన్న పేరుతో సంకలనాలు తెచ్చి కవితాలోకంలో కల్లోలం సృష్టించారు కొంత మంది ఉడుకు రక్తపు యువకులు. వేడి చల్ల బడుతుండంగా అభ్యుదయ రచయితల సంఘమని, దానితో సరిపడక శ్రీశ్రీగారి సారథ్యంలో వరవరరావు లాంటి వారు విప్లవ రచయితల సంఘమనీ ఇలా ఏదో ఒక అలజడితో ఆలోచనాపరుల సమాజాన్ని ఎప్పుడూ కుదిపి పారేస్తుండేవారు.

కాలానుగుణంగా అన్నిటిలో మార్పులు వస్తున్నట్లే కవిత్వ ధోరణులలో కూడా మార్పు అనివార్యమయింది. సాంకేతిక రంగ పురోభివృద్ధి వేగవంతమయి నూతన శతాబ్ది ఆరంభంలో సాఫ్ట్‌వేర్ రంగానికి అత్యవసరంగా అందించవలసిన వై టు కె వంటి సేవల మూలకంగా ఇంతకు ముందు ఎన్నడు లేనివిధంగా కొత్త కొత్త ఉపాధి అవకాశాలు అంతర్జాతీయ స్థాయిలో మన యువతకు అంది రావటంతో ఈతరం యువత ప్రాధాన్యాలు మారి పోయిన మాట నిజం. అంతకు ముందుతరం యువకులలో వున్న నిరాశ, నిస్పృహల నిప్పుల సెగలోనుంచి అప్పటి దాకా పుట్టుకొచ్చిన భావోద్వేగాల కవిత్వం స్థానంలో వైయక్తికాభివృద్ధి, జీవనవికాసానికి అవసరమయిన మార్గాల అన్వేషణల మీద ధ్యాస పెరిగిపోయింది. యువత బాహ్య దృష్టి మారిపోయింది. ఇవాళ మొత్తంగా చూసుకుంటే మన

ఆంధ్రదేశం లోని మారుమూల పల్లెలలో కూడా బడుగు బలహీన వర్గాలని మనం భావించుకుంటున్న కుటుంబాలలోని పిల్లలు కూడా అమెరికా, దుబాయిలకు వెళ్ళే విమానాల వంకే మోరెత్తి చూస్తున్న పరిస్థితి.

ఇన్ని పరిణామాల కారణంగా సామాజిక చింతన కొరవడిన కవిత్వం యువత నుంచి అంతగా రావటం తగ్గిన మాట నిజమే కానీ, ఆసక్తి కలవారు సునిశిత దృష్టితో గనక గమనించ గలిగితే ఇప్పుడు కూడా మునుపటి కన్నా పదునయిన సాహిత్యం ప్రచురింప బడుతూనే ఉంది. పీడిత వర్గాల తిరుగుబాటు తత్త్వం ప్రధాన లక్షణంగా సామాజిక అసమానతల మీద ఎ కె 47లు, జిలెటిన్ బాక్సులు దట్టించిన బాంబులవంటి రకరకాల ప్రక్రియలు ఇంతవరకు గొంతెత్తి ఎరగని కులాల, మతాల నుంచి గ్రేనేడుల్లాగా దూసుకొస్తునే ఉన్నాయి. ముఖ్యంగా వంటింటి గోడలమధ్య బిక్కు బిక్కు మంటూ కాలం గడిపిన స్త్రీమూర్తి చైతన్యవంతమయి తన వంతు వాటా కోసం కొంగు బిగించి మరీ దబాయించి అడగటం ఇప్పుడు కొట్టవచ్చినట్లు కనిపిస్తున్న కొత్త దృశ్యం. ఇంత చైతన్యం ఒక వైపు రగులుతున్నా మొత్తం ఒక్క కవిత్వం రూపంలోనే దర్శనీయం కాక పోవటం ఒకటే గతానికీ, వర్తమానానికి మధ్య గల తేడా.

మళ్ళీ మొదటికొస్తే ...కవిత్వమన్నా, కవులన్నా, కవిసమ్మేళనాలన్నా గతంలో లాగా జనం పట్టించుకోక పోవటానికి ప్రపంచీకరణ ప్రభావంతో జన అభిరుచుల్లో వస్తున్న పరిణామాలు ఒక కారణం కాగా... సాధారణ జనాలని అలరించే పాటి చేవ గల సాహిత్యం కవిత్వంలో కూడా తగ్గటం ఇంకో కారణంగా చెప్పుకోవచ్చు. రాశి తగ్గి వుండవచ్చేమో గాని రాస్తున్న వారిలో వాసి మాత్రం మునుపటికన్నా మరింత పదును తేలిందన్న మాట వాస్తవం. ఒక వంక చైతన్య ధార అంత తీవ్రంగా ప్రవహిస్తుంటే మరో వంక పిల్లసెలయేళ్ళ గలగలలు మీద నుంచి వచ్చే గాలులతో మనసు ఉల్లాస పడటమనేది అప్పుడూ వుంది ...ఇప్పుడూవుంది. అలాంటి పిల్ల గాలులను పలకరించుకోవటమే ఇప్పుడీ వ్యాసం ప్రధాన లక్ష్యం. మడిసన్న వాడికి కూస్తంత కలాపోసన కూడా వుండద్దూఆ ...లేకపోతే మడిసికీ గొడ్డుకి తేడ ఏటుంటాది?`-అంటాడు కదా ముత్యాలముగ్గులో రావు గోపాలరావు. అదిగో సరిగ్గా ఆ ఫిలాసఫీనే వంట బట్టించుకుని ఈసారికిలా ఏదో మనమూ కూసింత కలాపోసనేదో చెయ్యాలనే వుద్దేశంతో మనకు తెలిసిన ఓ నాలుగు సరదా పద్యాలు... మరీ అరిగిపోయినవని నేననుకున్నవి మినహాయించి ఒక అరడజను తక్కువ కాకుండా చెప్పాలనే ఈ పని పెట్టుకున్నది .

ఇచ్చేవాడి చేయి పైన, పుచ్చుకోనేవాడి చెయ్యి క్రింద వుండటం సహజమే ఒక్క వక్క పొడి దానం చేసేవాడి విషయంలో మాత్రం దీనికి మినహాయింపుంది.ఈ విచిత్రాన్ని పసిగట్టిన ఆచార్య ఫణీంద్ర ఒక చక్కని పద్యంలో ఎలా సెలవిచ్చాడో చదవండి...సరదాగా వుంటుంది .

*దాత చేయినెపుడు ధరలోన పైనుండు*
*పొందు వాని చేయి క్రిందనుండు*
*వక్కపొడి యిచ్చువాని దేమి ఖర్మమో*
*చేయి క్రిందనుండు చిత్రముగాను .*

ఛందస్సులో పద్యాలు రాసే వారికి సామజిక స్పృహ వుండదు, రాజకీయాలతో వీరి సంబంధం మరీ ప్రవరాఖ్య వరూధినిల బంధంలాగ ఎడమొగం పెడమొగంగా ఉంటుందని సాధారణంగా మనమంతా అనుకుంటుంటాం గదాఆ అది తప్పభిప్రాయమని గుంటూరు శేషేంద్ర శర్మగారి వంటి మహాకవులు ఏ నాడో రుజువు చేసారు. సాంప్రదాయ కవిత్వాన్ని అభిమానించే రోజులలో కూడా వారి దృష్టి మన ఎన్నికలతంతు మీద నుంచి తప్పుకొననే లేదు. పోలింగు లేని ఎన్నికలే విధంగా వుంటాయో వారు ఈ క్రింది పద్యంలో చేసిన వివరణ చూస్తే మీరూ నా మాట ఒప్పుకోక తప్పదు.

*పోలింగు లేని ఎన్నిక*

*ఆలింగనము లేని అంగన పొందున్*

*రేలంగి లేని చిత్రము*

*ఏ లింగము లేని గుడియు నెందుకు మహిలో ?*

మొన్నమన దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన కామన్‌వెల్త్ గేముల పేరు వినంగానే ముందుగా మనకు గుర్తుకొచ్చేది మనం సాధించిన పతకాలు కాదు... సురేష్ కల్మాడి షీలాదీక్షితుల అవినీతి భాగోతం. అంతకు ముందు ఐ పీ ఎల్ లో కూడా అదే రామాయణం. ఒక్క ఆటలనేముంది.. సారాయి పాటలనేముంది ...పార్లమెంటులో ఓటింగు టైములో కూడా మంచి టైమింగ్ లో సభాపతి గారి బల్ల ముందు గాభాలుమని కనిపించిన డబ్బు మూటల వెనక కూడా ఎంత భారతం నడిచిందో మనం ఇంకా మర్చి పోలేదు. ఇంత జరిగినా ప్రపంచ దేశాలు మనల్ని చూసి నివ్వెర పోయాయే కానీ... మనకు మాత్రం చీమ కుట్టినంత కూడా బాధ కలగ లేదు. ఎందుకిలా? అని ఎప్పుడైనా ఏ పనీ పాటా లేనప్పుడు ఒక్కసారైనా కూర్చుని తీరికగా ఆలోచిస్తే గనక అసలు లోపమెక్కడుందో మరి మనకి తట్టి వుండేది. మనకంత ఓపిక, ఆసక్తి లేవంటారాఆ అదే మరి...ఛందస్సులో పద్యాలు రాసే కవులకు సామాజిక విషయాలు పట్టవని వూరికే ఆడిపోసుకుంటాం కానీ శతావధాని శ్రీ కడిమెళ్ళ వరప్రసాద్ గారు మాత్రం పాపం ఎంతో శ్రమపడి ఈ అవినీతి మూలబీజం ఎక్కడుందో కనిపెట్టేసారు. మనం నిత్యం కొలిచే దేవతామూర్తులు కూడా ముడుపుల పేరుతోనో, మొక్కుల పేరుతోనో, హుండిలో ఏదో తోచినంత ఇంత పడేయక పోతే ధర్మ దర్శనానికి కూడా నలభై ఎనిమిది గంటల పాటు ఎండలో వానలో చలికీ, చీకటికి కాచుకుంటూ నిలబడే శిక్ష వేసేస్తారు. మరి దేవుళ్ళందరూ అంతేనా అంటే ..అంతేనని కూడా అంటున్నారు శతావధానిగారు .

*మోదకమ్ముల నిచ్చి మ్రొక్కు వారికి గాని*

*విఘ్నముల్ బాపని వేల్పొకండు*

*తలనీలముల నిచ్చి దర్శించిననే గాని*

*వరమీని పెద్ద దైవమ్మొకండు*

*నూరు బిందెల నీటి ధార వోసిన గాని*

*చల్లగా చూడని శాంతుడొకడుఆ*

*సృష్టి కర్తలె ఈ రీతి జెలగునాడు*

*కానుకల కోసమై జూచు కాలమందు*

*ఔరసులైన మాకు సృష్ట్యాది నుండి*

*సంప్రదాయము మాది లంచాల జాతి!*

దేవుళ్ళను గూర్చి అలా అనుకోవటం వినటానికి బాధగా వుంది కదూ!

కాస్త సెంటిమెంట్ పక్కన పెట్టి సావధానంగా ఆలోచిస్తే అవధాని గారు చెప్పేది కూడా పూర్తిగా కొట్టి పారేసే వాదంలాగా లేదు.

సరే మాట పడింది దేవుడే కనక అది అసత్యమని రుజువు చేసుకునే పని భగవంతుడికే వదిలి పెట్టి మరి మనం ముందుకు కదులితే మంచిదేమో!

చట్ట సభల తీరుని గూర్చి మరో అవధాని శ్రీ గరికపాటి నరసింహారావు గారు తూర్పార పట్టిన తీరు కూడా మరి చూడండి!

*అది యొక అడ్డుగోల సభ సభ వేదిక మీద నెన్నియో*

*హృదయము లేని బండలు, అవే పునరుక్తులు , ఉక్తిదోషముల్*

*చదవని వేద వాక్యముల్, సంస్కరణమ్ములు, మూగ మైకులున్*

*వదలని మైకు టైసనులు, వాయస ఘోషలు, గార్ధభార్భటుల్ !*

హాహా ఆఅడ్డుగోల మైకుటైసనులు కాకిఘోష గార్ధభార్భటులు అంటూ ... లైవ్ టివి చూసినట్లు ఎంత చక్కగా వర్ణించారండి అవధాని గారు ఆ మరి సాంప్రదాయ కవులకు సామాజిక స్పృహ లేదని వాదించే వాళ్ళకు స్పృహ వుందో లేదో అని అనుమానం వస్తున్నది కదూ !

*బియ్యమొక కిలో రెండు రూపికల వెలకు*
*అమ్ము పథకమ్ము హర్షనీయమ్మె గాని*
*కప్పు మూడు రూపాయలు కాఫి యగుట*
*కేడ్వనా నవ్వనా చెప్పవే ఉగాది*

అంటూ అంత దిగాలుగా ఉగాది పండుగనాడు కూడా కవులు ఏడుస్తుంటే ఇంకా వారికి ఏ సామజిక స్పృహ లేదని ఏడిపించటం ఏమి భావ్యం? ఈ పద్యం రాసిన శ్రీ మల్లవరపు జాన్‌గారు మరి నేటి పద్య కవే కదా!

ఇలా చెప్పుకుంటూ పోతుంటే మన ప్రాచీన సాహిత్యాన్నభిమానించి రాసే అధునాతన కవోత్తముల సామాజిక స్పృహ మీద చేంతాడంత వ్యాసం రాసుకుంటూ పోవచ్చు కానీ ఎంత చేంతాడు కయినా లక్ష్యం నీటి పొర అందే వరకే గదాఆ మనమా కార్యం ఈ పాటికే సాధించాము కనక ...ఇంకొక్క పద్యం ముక్తాయింపుగా చెప్పుకుని మరింక మంగళం పాడేసుకుంటే శుభకరంగా వుంటుంది.

ఇవాళ అందర్నీ పీడించే ఏకైక సమస్య బందులు.

రాబందులకన్నా బందులకే ఎక్కువగా బెదిరి పోతున్నారు నేటి జనాలు. వేళకి ఇంటి నుంచి బయలు దేరటం వరకే మన చేతులో వుంటుంది. సమయానికి ఆఫీసుకి చేరాలంటే అంతకు ముందు రోజు బొట్టు చినుకు కూడా పడకుండా వుండాలి ...ఏ నాయకుడు మనమెళ్ళే దారిగుండా పోకుండా వుండాలి...వూళ్ళో ఈ వుత్సవాలు జరగకుండా వుండాలి...అన్నింటి కన్నా ముఖ్యం ఎవరూ ఏ బందు పిలుపు ఇవ్వకుండా వుండాలి. ముందు మూడు జరగటం ఎప్పుడయినా సంభావమేమో గాని... నాలుగోది వుందే ..బందు ..అది మాత్రం వారంలో కనీసం మూడు నాలుగు సార్లైనా జరగకుండా దేవుడే కాదు ఢిల్లీలో వుండే సోనియమ్మ కూడా చేయలేదు. వ్యవహారాన్నంతా చూస్తున్న ఓ కవిగారికి కడుపు మండి పోయినట్లుంది ...ఒక పద్యంలో నిప్పులు కక్కేసారు. మరి ఏ కవైనా పాపం అంతకు మించి ఏం చెయ్యగలడు!

*బందట మంత్రి తుమ్మిన, విపక్షపు నాయకురాలు చచ్చినన్*
*బందట, బందిపోటు మెడ బట్టిన, కొట్టిన, జైలు నెట్టినన్*
*బందట, నోరు చేయి గలవారల కడ్డు నిల్చినన్*
*బందట, ఇందులో ప్రథమ ఘట్టము భారత జాతిది ఈశ్వరా !*

ఇవన్నీ సామజిక స్పృహను తెలిపే సాంప్రదాయ సాహిత్యం కాదా!

ముందులో చెప్పినట్లు కవి అనేవాడు ఎవరో గిట్టని వాడు అన్నట్లు ఒక్క కట్టేసి వినిపించేవాడే కాదు సుమండీఆ... మహాకవి శ్రీ శ్రీ గారు చెప్పినట్లు కష్టజీవికి ముందూ వెనకా వుండేవాడు కూడా. జనాల కష్టాలని కమనీయంగా వినిపించేవాడు కూడాను ... ఇదిగో ఇలాగా!

కవుల సంసారిక స్పృహను గూర్చి మరో సందర్భంలో సరదాగా చెప్పుకుందాం. ప్రస్తుతానికి స్వస్తి.

2

# సంపూర్ణ మద్యపానం

**మద్యం వద్దని మన మహిళామతల్లులు** ఎన్నోసార్లు ఉద్యమాలు చేశారు గానీ... తాగుడు వల్ల బోలెడన్ని ప్రయోజనాలున్నాయన్న విషయం వాళ్ళు మరిచిపోయి ఉంటారనుకుంటాను.. కరువుకాలంలో మొగుడనే యములాడు వేళాపాడూ లేకుండా ఇంటికొచ్చి ఏ కోడి పలావో కొండమీద కోతో కావాలని కొప్పుపట్టుకుంటే, పాపం ఆ ఇంటిదీపం ఏం చేస్తుంది? మస్తుగా తాగి మత్తుగా పడున్న వాడికన్నా ఈ కాలంలో మంచివాడు లేడు. కట్టుకున్నవాడు కట్టేసినట్లు పడున్న కాసేపే కదా ఇల్లు శాంతినివాసంలాగా హాయిగా ఉండేది. కుచేలుడు కూడా కుబేరుడిలాగా ఫీలయే ఈ ఫీల్ గుడ్ అమృతాన్ని అమ్మలక్కలెందుకు వద్దంటున్నారో అర్థం కావడం లేదు.

బైట బోలెడంత కాలుష్యం. రోడ్డు మీద కొస్తే ఏదో ఒక ప్రమాదమే. మగాడు జేబులో డబ్బాడుతున్నంతసేపు ఎంత పెద్ద జల్సా పురుషుడో చెప్పే పని లేదు. తప్పతాగి ఇంటి పట్టునే పడుంటే ఏ గొడవా ఉండదు. పైగా ప్రత్యక్ష దైవాన్ని పొద్దస్తమానం కంటిముందే చూసుకునే అదృష్టం, ఇంటి ఇల్లాలికి ఇంతకుమించి ఏ వ్రతం, నోమూ కల్పిస్తుంది?!

తప్ప తాగినవాడు తప్పు చేయలేడు. ఆ రకంగా స్వర్గప్రాప్తికి మందు నూరు శాతం గ్యారంటీ. సగం తాగిన వాడితోనే ఆఘాలు ఎక్కువ అత్యాచారాలూ అఘాయిత్యాల్లాంటి వెధవ పనులన్నీ కడుపు నిండని వాడితోనే కదా వచ్చి పడేది! అందుకే శాంతి భద్రత అదుపులోకి రావాలంటే ముందు సందుకో మందుల షాపు రాత్రింబవళ్ళు తెరిచి ఉంచాలి. అంతగా మరీ గుళ్ళ పక్కన, బళ్ళపక్కనా బాగుండదనుకుంటే దేవుళ్ళనీ, పిల్లలనీ వేరే చోటికి తరలించుకోవచ్చు, గృహహింస, రాజ్య హింస తగ్గు ముఖం పట్టటానికి పెగ్గును మించిన మంచి సాధనం మరొకటి లేదు.

వైద్యరీత్యా కూడా దగ్గుకి పెగ్గు మంచి మందే ఆల్కహాలు రక్తాన్ని పల్చబరుస్తుంటుంది. గుండెజబ్బులు రావు. మరింత చవకైన ఔషధ మీద నిషేధం కోరటమేంటి... విడ్డూరం కాకపోతే! ప్రతిపక్షాల కేం పనీ పాటా లేదు అప్పట్లో పాటలనాపటానికి ప్రయత్నించారు. వారధికారంలో ఉన్న తొమ్మిదేళ్ళు మందు మానేసారా? మేం అపోజిషన్లో ఉన్న రోజుల్లో ఇంతకన్నా ఎక్కువే మందును వద్దాన్నాం. ఎన్ని చెప్పినా ఏ ఎన్నికా మద్యం లేకుండా విజయవంతమైన దాఖలాలు లేవు. మద్యం విషయంలో రాజకీయాలు ఎవరికీ మంచివి కావు.

సర్కారు బొక్కసం చాలాసార్లు నిండుకుంటుందనిని ఎక్కాలు రాని పిల్లాడిక్కూడా తెల్సు. ఉన్న భూములన్నీ అమ్ముడై పోయాయి. దేవుడి సొమ్ము మాయమై పోయింది. కరువులూ, వానలూ, వరదలూ మన అదుపులో లేవు. కేంద్రం చేతులెత్తెయ్యడం అలవాటే. వరల్డు బ్యాంకు అప్పు వడ్డీలకే లక్షకోట్ల బడ్జెటు సర్దుబాటవడంలేదు. చవకదుకాణాలు నడవాలన్నా మరన్ని బార్లూ బార్లా తెరిచి

ఉండకతప్పడం లేదు. బావుండదు గానీ.. బాపూజీ జయంతి వర్ధంతులనాడు కూడా బార్లు బార్లా తెరిచి ఉంచకపోతే ఆ భారాన్ని గవర్నమెంటు తట్టుకునే స్థితిలో లేదు. ఆరోగ్యశ్రీ లాంటి పథకాలు కనీసం కుంటుతూ నడవాలన్నా, పిల్లకాయల ఉపకారవేతనాల కోసమన్నా పెద్దవాళ్ళు పెద్దమనసుచేసుకుని మరింత మందు తాగడానికి ముందుకు రావాలి. అలవాటు లేనివాళ్ళు ఇప్పటినుంచే అలవాటు చేసుకోవాలి. ఊరికే పన్నులు కట్టమంటే ఎవరు ముందుకొస్తారు? మధ్యాహ్న భోజనంలో సాంబారు కాస్త చిక్కగా ఉండాలన్నా, గుండె బిక్క పట్టుకుని తలా రెండు చుక్కలు ముక్కు మూసుకునన్నా తాగకపోతే రాష్ట్రద్రోహం కిందకే వస్తుంది. ముందే హెచ్చరిస్తున్నాం. తాగనివాళ్ళ మీద పన్నులు వేసే అలోచనకూడా ఉంది. లేకపోతే పావలా వడ్డీకి వేలాది రూపాయలు ఎక్కడినుంచి వస్తాయి? లక్ష కోట్ల బడ్జెట్లు ఊరికే పెట్టడం లేదు. మరి మహిళామణులు ఇట్టే లక్షాధికారులెలా అవుతారు? కిలో రెండు రూపాయల బియ్యం పావుకిలో తగ్గినా ఊరుకోరే..మరి బార్లు, బెల్టులు వద్దంటే కుదురుతుందా?

వోక్సువేగనూ, ఫాబ్ సిటీ ఎలానూ తిరిగి తెచ్చుకోలేం. స్పిరిటు వ్యాపారన్నన్నా నిలుపుకోలేక పోతే ప్రభుత్వం ఒక్క అడుగు ముందుకు వెయ్యలేదని ప్రభువులు ఎప్పటినుంచో చెబుతున్నారు. గుజరాత్ వారికి ఆయిల్ ఉంది. మద్రాసు వారికి సాంబారు ఉంది. మరి మనకి బార్లూ, కల్లు దుకాణాలూ, సారా అంగళ్ళే కదా ప్రధాన ఆదాయ వనరులు.!

పెట్టుబడులు మరిన్ని రావాలన్నా, 'రా' కి మించిన మంచి సాధనం మరొకటి లేదు. బళ్ళూ, ఆసుపత్రులూ, పోలీసు స్టేషన్లు జనాభా కింతని పెట్టుకున్నట్లే కల్లు దుకాణాలు పెట్టుకుంటే తప్పేంటో అర్థం కావటం లేదు.

దయచేసి మద్య నిషేధ ఉద్యమాలని నిద్రలేపకండి.. ఇంటికో దేవదాసు తయారయే దిశగా ముందుకు రండి! ఉగ్గుపాలకు బదులు పెగ్గు పాలతో కలిపి మీ పిల్లలకు పోయకపోతే.. ముందు ముందు మందు తరాలు తగ్గిపోయే ప్రమాదం ఉంది. ఆడపడుచుల్లో మార్పు రాకపోతే ఎన్ని ఆర్థిక సంస్కరణలు వచ్చినా ఫలితం సున్నా.

సంపూర్ణ మద్యపాన నిషేధం కోసం కాదు. సంపూర్ణ మద్యం కోసం ఉద్యమించాల్సిన సమయం ముంచుకొచ్చిందని మన తరుణీమణులు తెలుసుకోవాల్సిన తరుణం ఇది.

# 3

## *చావటానికెందుకురా తొందర!*

**చావనేది లేకుండా ఉండటానికి** పూర్వకాలంలో రాక్షసులు కూడా ఘోర తపాలు చేస్తుండేవారు. అమృతం కోసమేగా అంతలావు వైరాన్ని కూడా పక్కన పెట్టి దేవదానవులు క్షీరసాగర మధనానికి దిగింది! మహాత్ములు కోరుకుంటే తప్ప మృత్యుదేవత దగ్గరికి రాదని మన నమ్మకం. భారతంలోని భీష్మాచార్యులవారు స్వచ్ఛంద మరణాన్ని వరంగా పొంది ఉన్నా.. తన కర్తవ్యం పూర్తయిన దాకా అంపశయ్య వదిలి పారిపోలేదు. బ్రహ్మంగారివంటి సిద్ధులు కూడ తమ పాత్ర పూర్తయిన పిదపే కదా సజీవ సమాధి కావటానికి సిద్ధపడ్డారు! -మృత్యుపాశాన్నుంచి తప్పించుకునే దానికి భక్తమార్కండేయుడు పడిన తాపత్రయమంతా తెలిసి కూడా మరి ఈనాటి యువతరం ప్రాణాలు తీసుకోటానికి అంతగా ఎందుకు ఉబలాటపడుతున్నదో అంతుబట్టకుండా ఉంది. కాటికి కాలుజాచుకున్న ముసలివాళ్ళైనా మనుమల మునిమనుమల పెళ్ళిపేరంటాలు చూసిగాని హరీ అనమని మొండికేస్తున్న రోజుల్లో పసిమొగ్గలు అలా ఊరికే ఉసూరు తీసుకోవటం ఉసూరుమనిపించే విషయం.

యాండీ రూనే అనే ఆంగ్ల రచయిత చావును గూర్చి ఓ తమాషా వ్యాసం రాసాడు 'నువ్వు ఫలానా రోజున పైకి పోబోతున్నావ'న్న సమాచారం ఉన్న కవరు మెయిల్లో గనక వస్తే ఆ కవరు తెరవడానికి కూడా ఎవరూ సాహసించర'ని ఆయనగారి థీరీ. తప్పక తెరిచి చూడాల్సి గనక వస్తే.. చావు ఘడియ దగ్గర పడిందని తెలిసిన ఆ అభాగ్యుడు చివరి క్షణాల్లో ఎంత విచిత్రంగా ప్రవర్తిస్తాడన్నదే ఆ వ్యాస సారాంశం. నవ్వు పుట్టిస్తుంది. కాని నిజానికి ప్రాణాలు పోవడం, తీసుకోవడం అంత నవ్వులాట వ్యవహారం కాదుకదా!

చావు దగ్గర పడినవాడు పెళ్ళాం బిడ్డల్ని గూర్చి తల్లిదండ్రులను గూర్చి ఆందోళన పడకుండా ఉండగలడా! తన తదనంతరం కూడా వాళ్ళ బ్రతుకులు చల్లగా సాగాలని ఎంతగా తాపత్రయపడతాడు. డబ్బున్న వాడైతే వివాదాలకు తావులేకుండా వీలునామా రాసి పడేస్తాడు. ఏఏ ఆస్తిపాస్తుల పత్రాలు ఏ ఏ బ్యాంకులాకర్లలో మూలుగుతున్నాయో అంత బాధలో కూడా ముక్కుతూ మూలుగుతూనన్నా దగ్గరివారికి చెప్పుకుంటాడు. పిల్లకాయల చదువులు, పెళ్ళిళ్ళు మంచి వాళ్ళ పిల్లలకు పేర్లు పెట్టేదాకా తామేం కావాలనుకుంటునారో ఓ టైం టేబుల్లాగా వేసి మరీ ఒప్పగింతలు పెడతారు. కుటుంబం యావ అంతగాలేని పడమటి దేశాల్లో వాడు కూడా చావు దగ్గర పడిందని తెలిస్తే ఉన్న కాడికి క్రెడిట్ కార్డు లిమిటంతా గుట్టుగా వాడేసుకుని మరీ గుటుక్కుమనాలని చూస్తాడని యాండీ భావన.

ఎలాగూ పోతున్నాం కదా అని ఇంతకాలం ఉగ్గబట్టుకున్న మందూ, సిగిరెట్లూ మళ్ళీ మొదలు పెట్టే వాళ్ళు కొందరంట జుత్తు కత్తిరించుకునే పనిమాత్రం అందరూ భయంగా మానేస్తారుట. ఇష్టమైన పబ్బులు, సినిమాలు ఎంతదూరంలో ఉన్నా వెళ్ళి చూసి తరించాలని ఉవ్విళ్ళూరే వాళ్ళుకొందరంట. తిండియావ ఉన్న వాళ్ళైతే మూడు పూటలా మేత కార్యక్రమం తప్ప మరో పనిపెట్టుకోరని యాండీ ఉద్దేశం. ఏదేమైనా ఫ్యునరల్ ఏర్పాట్లు సొంతంగా చేసుకునే అదృష్టం మాత్రం ఆ దురదృష్ట జీవుల కొక్కళ్ళకే సొంతం గదా. ఇరుగు పొరుగులు బాగా అసూయపడే విషయం మాత్రం ఇదొక్కటే అంటున్నాడు యాండీ రూనే. వృధా కారణాలకు ప్రాణాలు తీసుకునేవాళ్ళకు  కనీసం ఆ సుఖం కూడా ఉండదు. ఎంత విషాదం!

నిజానికి ప్రాణాలు తీసుకోడం ప్రాణాలు పోయినంత బాధగా ఉంటుంది. ఇంతకాలం ఎంతో శ్రద్ధగా పెంచి పోషించిన తోటను, కుక్కపిల్లను వదిలి పోవాలే అన్న బాధ తప్ప మరే జంజాటం లేని సన్నాసి కూడా తెల్లవారి ప్రాణాలు పోతాయంటే తెల్లవార్లూ కుమిలి కుమిలి ఏడవకుండా ఉండగలడా? చేతిలో చిల్లిగవ్వలేని వాడైనా, అన్నీ మంచం మీదే తప్ప చేయలేని జీవైనా చచ్చిపోయే ముందు సంతోషంతో గంతులేస్తాడంటే నమ్మలేం. ఎన్ని బాధలు పడేవాడైనా వచ్చే జన్మలో ఏ బిల్ గేట్సు కొడుగ్గా పుట్టాలనో, ఒబామా తరువాత అధ్యక్షుడు కావాలనో హాలీవుడ్ హీరోగానో బాలివుడ్ హీరోయిన్ గానో, అదీ మన ఇండియాలో అయితే ఏ గాంధీ ఫ్యామిలీతోనో, గాలి కుటుంబంలో నలుసుగానో పుట్టాలని కోరుకుంటాడేగాని అవుట్ రైట్‌గా అసలే జన్మవద్దు పొమ్మని చచ్చినా అనుకోడు. మరలాంటప్పుడు చేతిలో ఉన్న ఇప్పటి విలువైన జన్మను వదులుకోడమెందుకు.. విడ్డూరం కాకపోతే!

ఇవాళ ఏ పేపరు తిరగేసినా, టీవీ ఛానెల్ తిప్పి చూసినా చావు వార్త ఒక్కటైనా లేకుండా చల్లంగా గడుస్తున్న ఒక్క పూటైనా ఉండడం లేదు! ఓపికున్న వాళ్ళెవరైనా ఓసారి ఈ చావు లెక్కలు తీయగలిగితే భూమి పుట్టినప్పటి నుంచీ ఇప్పటిదాకా పోయిన వాళ్ళే ఉన్నవాళ్ళకన్నా ఎక్కువని  లెక్కతేలుతుంది. అంతు తెలియనిరోగాలతో, ఆహారలోపాలతో గర్భస్రావాలతో, పురిటి బాధలతో , ఫ్యాక్షనిస్టుల కార్పణ్యాలతో కాలుష్యాలతో,  వడదెబ్బలతో, పరువు హత్యలతో, హరీ హరీ ... హరమనే వారి సంఖ్య రోజు రోజుకు మరీ అలా పోతూనే ఉంది. ఇప్పుడదనంగా కొత్తగా సొంతంగా ప్రాణాలు తీసుకోవటం కూడా పెరిగిపోతుంటే ప్రకృతి సమతుల్యమే దెబ్బతిని బ్రతికి ఉన్నవారికి చచ్చే చావే!

రైతు పురుగు మందు తాగితే పంట మళ్ళీ చిగురిస్తుందా? ఆకలికి తాళలేక చెట్టుకురేసుకుంటే ఆ నేత పనివాడి కుటుంబానికి మేత మళ్ళీ దొరుకుతుందా? గొంతునులుముకున్నంతమాత్రాన అప్పుల బాధలు ?.... తీరిపోతాయా?... బ్రతికున్న వాళ్ళని పట్టి పీడించవా? ఉద్యోగం పోయిందని, వైద్యం అందటంలేదని, ప్రమోషన్ రావటం లేదని, వ్యాపారంలో లాసయిందని, పరీక్షపోయిందని, ప్రేమించిన వాళ్ళు ఛీ అన్నారని ఫ్రెండ్స్ ర్యాగింగ్ చేసారని, టీచర్లు మందలించిందని ఆరాధ్య నేత కనిపించకుండా మాయమయ్యాడని, ఇష్టమైన నాయకుడు పోలీసు కష్టడీలో కెళ్ళాడని, ప్రత్యేక రాష్ట్రం రావటంలేదనీ, ఎన్నికల్లో పొరపాటుగా ఎవరికో ఓటు వేసామని సెల్ టవర్లెక్కో, టాంకు బండమీదనుచీ దూకో, వంటికి నిప్పంటించుకునో, ఎండ్రిన్ మింగో, ఫానుకు చున్నీ బిగించుకునో కన్నవారి కడుపుకి కోత మిగల్చటం ఎంత తెలివితక్కువతనం, ఎంత విచారకరం!

రాజు ఆటకట్టటానికి బంట్లు చావడమన్నది చదరంగం ఆట రూలు మాత్రమే. నిజ జీవితంలో ఎన్ని కోట్ల బంట్లు ప్రాణాలు పోగొట్టుకున్న రాజుల ఆట ఆగదు. ఫలానా తేదీకి మనం పోతామన్న కవరు జేబులో ఉన్నా ఆ పోయే చివరి క్షణందాకా మనిషిలాగా బ్రతకటమే మనిషి చేయాల్సిన ధైర్యం. చావటానికెన్నో దారులున్నాయి. బ్రతకటానికొక్కటే దారి. చివరిదాకా ఆ దారిలో సాగిపోయే వారికే విజయం ఎదురుగా వస్తుంది. బ్రతకటానికుండాలిగాని.. చావటానికెందుకంత తొందర? ఆ సమయం ముంచుకొస్తే దానంతట అదే ఏ మున్సిపాలిటీ చెత్తకుప్పో మీద పడనే పడుతుంది. బోరుబావో, మ్యాన్ హోలో తెరుచుకుంటుంది. బస్సులు, రైళ్ళు, విమానాలు, బాంబులు, పోలీసులు ఉండనే ఉన్నాయి.

4

## దణ్ణం దశగుణం భవేత్!

'గుడ్ మార్నింగ్ ఇండియా!' అంటుంది పొద్దున్నే ఎఫేం రేడియో.

'వందేమాతరం' అని పాడుతుంది అంతకు ముందుగానే ఆకాశవాణి.

ఏ పనినైనా 'ఓనమశ్శివాయ!' అంటూ ప్రారంభించడం మన సనాతనాచారం.

సంధ్యావందనం చేయనిదే దినచర్య ఆరంభించేవాళ్ళు కాదు మన పూర్వీకులు!

'వన్దేమన్దారు మన్దారమన్దిరానన్దకన్దలమ్' అంటూ ఆది శంకరులు కనకధారాస్తవం ఆలపించగానే కనకవర్షం కురిసిందని ఓ గాథ.

సరస్వతీ నమస్తుభ్యం అన్నా, అస్సలాం లేకుం అన్నా, సత్‌శ్రీఅకాల్ అన్నా, ఆమెన్ అన్నా... అన్నీ ఆ భగవానుడికి వివిధ రూపాల్లో భక్తుడు చేసే నమస్కారాలే గదా!

ఏ పుట్టలో ఏ పాముందోనని చెట్టుకూ పుట్టకూ కూడా నమస్కారాలు చేస్తుంటాం మనం.

రోడ్డుకు నమస్కారం చేశాడో కవి.

ఈ దండాన్ని కనిపెట్టిన వాడెవడోగానీ గడుసు పిండమే... వాడికో దండం!

అణుబాంబులు, ఆ బాంబులూ, ఈ బాంబులూ అంటూ అగ్రరాజ్యాలు వూరికే హడావుడి చేసేస్తుంటాయిగానీ- నమస్కార బాణాన్ని మించిన ఆయుధం ప్రపంచం మొత్తంలో ఏదీ లేదు. ఇంగ్లీషువాడు హలో అన్నా, చైనావాడు లెయ్‌హో అన్నా, జపానువాడు ముక్కు పట్టుకుని ముందుకు వంగి ముక్కినా, జర్మనీవాడు కుడిచెయ్యి గాల్లోకెత్తి ఊపినా, కాంగోవాడు మాంబో అన్నా, ఫ్రెంచివాడు శాల్యూట్ కొట్టినా, ఇంగ్లాండ్‌వాడు టోపీ గాల్లోకెత్తి చూపెట్టినా... అవన్నీ ఎదుటివాడిని పడగొట్టడానికి ప్రయోగించే శక్తిమంతమైన ఆయుధాలే!

మన దేశంలోనే ఒక్కో ప్రాంతంలో ఒక్కో రకంగా నమస్కారాలు చేస్తుంటారు.

రాజస్థాన్‌లో 'రాం రాం' అంటే,

గుజరాత్‌లో 'కెంచె' అంటారు.

బెంగాల్లో 'నమష్కార్' అంటే

తమిళనాట 'వణక్కం' అంటారు.

చేతులు కలుపుకోవటం,

గుప్పెట్లు గుద్దుకోవటం

'హాయ్ ఫై' చెప్పుకోవటం

ఈతరం కుర్రకారు నమస్కారం.

ఈ మధ్యే ప్రసిద్ధికెక్కిన రెహమాన్ 'జయహో' కూడా ప్రపంచానికి మనదేశం పెట్టే కొత్తరకం నమస్కారమే!

నమస్కారం మన సంస్కారం.

ఉత్తరాది  వైపైతే పెద్దవాళ్ళ పాదాలకు వంగొంగి నమస్కారాలు పెట్టాలి.

నడుముకు మంచి వ్యాయామం.

ఈ దండాలు పెట్టడంలో తెలుగువాడేమీ తీసిపోలేదు.

'దండమయా విశ్వంభర, దండమయా పుండరీక దళనేత్రహరీ, దండమయా కరుణానిధి దండమయా నీకునెపుడు దండము కృష్ణా!' అంటూ ఆ దేవుడిమీద అదేపనిగా ఐదేసిసార్లు దండ ప్రయోగాలెందుకు చేశాడో తెలుసాండీ? దండమనేదాన్ని ఇలా వచ్చి అలా ఒకసారి పెట్టేసి పోయేదానికన్నా పదేపదే ప్రయోగిస్తూ ఉండాలి. అదీ పనున్నప్పుడే కాదు సుమా... ఎప్పుడూ సంధిస్తూంటేనే ఏ పనైనా సజావుగా సాగేదని ధ్వనించడానికన్నమాట.

వేడిమీదున్న వాడిని చల్లబరచేదీ,

విడిపోదామనుకునేవాళ్ళను కలపగలిగేదీ కూడా

ఈ నమస్కారమే సార్!

మొన్నటి ఎన్నికల్లో అమ్మలక్కలకు అందరికన్నా ఎక్కువగా దండాలు పెట్టాడు గనకనే మన సీయం మళ్ళీ సీయం కాగలిగాడని ఓ వర్గం అభిప్రాయం.(ఇది వై యస్సార్ సార్ వున్నప్పటి సంగతి లెండి )

అన్ని దండాలూ ఒకేలా ఉండవు.

'దండం దశ గుణం భవేత్' అని సంస్కృతంలో అన్నది ఈ దండాన్ని గురించి కాకపోయినా, దీనికీ వర్తిస్తుంది. రెండు

చేతులూ జోడించి గుండెల మీద పెట్టుకుంటే పెద్దలకు పెట్టినట్లు,

నెత్తిమీద పెట్టుకుంటే దేవుడికి పెట్టినట్లు.

నుదురు నేలను తాకినట్లు వంగితే అల్లాకు పెట్టినట్లు.

మోకాలి మీద వంగితే బుద్ధ భగవానుడికి పెట్టినట్లు.

క్రాసు చేసుకుంటే యేసుకు పెట్టినట్లు.

తలొంచుకుని మౌనంగా నిలబడితే చనిపోయినవారి ఆత్మలకు పెట్టినట్లు.

భజన చేస్తూ ఎగిరెగిరి పెడితే గిడిగీలు పెట్టినట్లు.

గోత్రనామాలు చెబుతూ పెడితే ఏటికోళ్ళు

బొక్కబోర్లా పెడితే సాష్టాంగ ప్రణామాలు,

పొర్లుతూ పెడితే పొర్లుదండాలు

ఇవికాక ఇంకా టెంకణాలు, జాగిలీలు, గొబ్బిళ్ళు - అబ్బో... సూర్య నమస్కారాలకన్నా ఎక్కువే లెక్క తేలతాయి ఈ నమస్కారాలు!

ఇన్ని దండాలుండంగా ఎందుకో మనిషి మరి 'దండా'నే ఎక్కువ నమ్ముకుంటున్నాడు?!

దండాలు పెడితే లాభమా... లేదా అనే మీమాంస మాట అటుంచి, అసలు పెట్టకపోతే అసలుకే మోసం వచ్చే సందర్భాలు మనబోటి మామూలు మనుషుల జీవితాల్లో మాటిమాటికీ వస్తుంటాయి.

పనిలో మనమెంత తలమునకలుగాఉన్నా పైఅధికారి కనపడగానే లేచి విష్ చేయకపోతే మనపని ఫినిష్!

అందుకే అనేది-

ఉద్యోగులకు నమస్కారం అనేది తప్పనిసరిగా అభ్యాసం చేయాల్సిన యోగం. ఈ హస్తకళలో ప్రావీణ్యం సంపాదించినవాడిని దండకారణ్యంలో పారేసినా 'దండు'కుని మరీ తిరిగి రాగలడు.

"దండాలు స్వామీ అంటే, ముందు నీ తండ్రి బాకీ తీర్చు" అనేవాళ్ళూ ఉంటారు. తస్మాత్ జాగ్రత్త!

ఈ గజిబిజీ కాలంలో ఎవరూ మనవంక తిరిగి చేతులు జోడించకపోతుంటే చేతులు ముడుచుకు కూర్చో కూడదు. తగిన భక్తులు సమకూరిందాకా మనకాళ్ళకు మనమే మొక్కుకుంటూ ఉండాలి. దాన్నే రాజకీయం అంటారు. మన వీపు వైపు మనమే నమస్కారం చేసుకోలేం గనక. మీరు ఎదుటివాడికి 'నమామి' చెబితే ఎదుటివాడు మీకు 'ప్రణమామ్యహం' అనాలనే ఏర్పాటూ చేసుకోవచ్చు. దీన్నే రాజకీయాల్లో పొత్తులంటారు.

మంత్రాలకు చింతకాయలకు రాలకపోవచ్చేమోగానీ- నమస్కారాలకు పురస్కారాలు దక్కే ఆస్కారాలు పుష్కలంగా ఉన్నాయని చరిత్ర చెబుతోంది.

ఒక దండం వంద దండల పెట్టు.

అతి వినయం ధూర్త లక్షణమనే మాట ఈ కాలానికి అతికే సామెత కాదు.

నమ్మకంగా నమస్కారాలు పెట్టుకుంటూ పోతే ఏనాటికైనా ప్రధానమైన ఏ మంత్రిపదవో, మళ్ళీ మాట్లాడితే... మరోసారీ అదే పదవీ దక్కే అవకాశాలు... ఉన్నాయిగదా!

అందుకేనేమో ఆ త్యాగరాజస్వామి 'ఎందరో మహానుభావులు... అందరికీ వందనాలు' అని ముందుగానే దండాల మీదే ఎత్తుకున్నాడు.

నిద్రలేచినప్పటినుంచీ నిద్రపోయేదాకా మనం ఎదుటివాడివంక వేలెత్తి చూపించటానికి ఉపయోగించే శక్తిని దండాలు పెట్టటం వైపు మళ్ళించగలిగితే- దేశంలో ఇంత అశాంతి, అరాచకం ప్రబలి ఉండేవి కాదు. సైనికులు, పోలీసులు- తుపాకులకూ తూటాలకూ పెట్టే ఖర్చును ప్రజాసంక్షేమ కార్యక్రమాలకు ఎంచక్కా ఉపయోగించుకోవచ్చు అన్నాడు ఓ సంస్కర్త.

ఇన్ని తెలిసీ మరీ చిన్న చిన్న వాటికి కూడా తన్నుకునే వాళ్ళనేమి చేయగలము? ...ఒక దణ్ణం పెట్టి వూరుకోవటం తప్ప.

5

## ఇది ఇండియా... అది ఇంగ్లాండూ!

**దుబాయ్ లోని కొడుకు ఉద్యోగం** ఊడినందుకు దిగాలు పడ్డ అమరయ్యగారు మంచం పట్టి ఇవాళ్టికి మూడు వారాలు.

మందిచ్చే ఆచారిగారు పెదవి విరిచి "అయినవాళ్ళని పిలుపించుకోవచ్చు!" అని చెప్పి పోయారు.

షేక్‌ల రుణాల షేక్‌లో షేపులు పోయిన అమరయ్య కొడుకు కామేశ్వర్రావు తండ్రి చివరి చూపులకని దిగబడిపోయాడు. కొడుకును చూసిన ఉత్సాహంలో తండ్రి తెప్పరిల్లినట్లున్నాడు.. గానీ.. కొడుకే లోడు లేని లారీలాగా కళలేకుండా ఉన్నాడు. "ఇక్కడే ఏదైనా పనుంటే చూపించు బాబాయ్! ఎటొచ్చి ఎటుపోతుందో.. నాయన కర్మకాండలకు కూడా నా దగ్గర ప్రస్తుతానికి చిల్లి నయాపైసా లేదు" అని బయటపడ్డాడు కామేశ్వరం పినతండ్రి దగ్గర. నయాపైసా రోజుల్లోనే ఆగిపోయిన కామేశ్వరం అమాయకత్వానికి జాలిపడ్డాడు బాబాయి. "ఇక్కడి పరిస్థితులు అంతకన్నా దారుణంగా ఉన్నాయిరా బంగారూ! పెద్ద పెద్ద సాఫ్టువేర్లే వేర్లు తెగిన మొక్కల్లాగా వాలిపోతున్నారు నిన్నటిదాకా! ఇప్పుడేదో పుంజుకోబోతుందంటున్నారు గానీ.. నాకు నమ్మకంలా! ఇంక గవర్నమెంటు ఉద్యోగాలంటావా.. భారీగా ప్రకటనలు గుప్పించేసి, పరీక్షలు పెట్టి, ఇంటర్వ్యూలంటూ మిగులున్నదంతా నిరుద్యోగులనుంచీ ఊడిపించి ఇప్పుడు న్యాయస్థానాల ఆదేశాలంటూ మీన మేషాలు లెక్కబెడుతున్నారు సర్కారువారు. మన మాట వినే మంత్రెవరన్నా దొరుకుతాడేమోగానీ మంత్రిమాట వినే అధికారి దొరకద్దూ! సీయంగారు ఆదేశించినా చేద్దామా.. వద్దా అని మంచీ చెడ్డా ఆలోచించే అధికారులే ఎక్కువయారు. ఇంకాస్త ముందుగా వచ్చుంటే ఏ బై ఎలక్షన్ ప్రచారకమిటీలోనన్నా జిల్లా బాధ్యుడి కింద తాలాకా బాధ్యుడిని చేయించే అవకాశం ఉండేది"

"పోనీ.. కాంట్రాక్ట్ పనులేమన్నా ఖాళీగా ఉన్నాయేమో.. అవన్నా చూడు బాబాయ్!" అనడిగాడు కామేశ్వర్రా`వు మధ్యలోనే అందుకుని.

"చేసిన పనుల బిల్లులకే చిల్లులు పెడుతున్నార్రా ఇప్పుడు! ఒక్క గనులు తవ్వుకోవడం తప్ప ప్రస్తుతానికి ఏదీ గిట్టుబాటయ్యే వ్యవహారంలాగా కనిపించడంలేదు. ఆ పన్లూ.. ఆగాలి.. ఆగాలి అంటూ ఓ కొత్తగాలి మొదలయింది. మధ్యలో నువ్విప్పుడెళ్ళి చేసేది మాత్రం ఏముంటుంది?"

"ఏదడిగినా మన ఆర్థిక మంత్రుల్లాగా ఏదేదో చెబుతున్నావ్. ఇంకిక్కడుండి నేను మాత్రం ఊడబొడిచేదేముంది? నాన్నెట్లాగూ పిడిరాయి మల్లేనే ఉన్నాడుగా!" అంటూ వచ్చిన దారినే విమాన మెక్కి చెక్కేశాడు కామేశ్వర్రావు.

నెలన్నర తరువాత..

ఓ రోజు మిట్ట మధ్యాహ్నం పూట చిన్నాయన భోజనం లాంటిది చేసి భుక్తాయాసం తీర్చుకునే వేళ కామేశ్వరం ఫోన్ చేసాడు. కామా, ఫుల్‌స్టాప్ లేకుండా గడగడా ఏదేదో మాట్లాడుతున్నాడు "రేపు సాయంత్రం నాలుగ్గంటలకల్లా నువ్వు ఎయిర్ పోర్టులోకొచ్చి ఉండాలి బాబాయ్! నీతో పాటు ఓ టాపులేని జీప్సీ టైపు జీపు, బేండ్ మేళం సెట్టు, తాజా గజమాలలు ఓ డజను, మంత్రాలు చదివే పంతులుగారు, ఓ వెయ్యికి చిల్లర.. అన్నీ ఐదు.. పది..పైసల బిళ్ళలే ఉండాలి బాబాయ్! మంచి కేటరింగు వాళ్ళెక్కడున్నారో విచారించి బుక్ చేసుంచు! సుమారు రెండొందల మందికి రోజంతా కాఫీ టిఫిన్లూ, మధ్యాహ్నం బఫే, రాత్రికి డిన్నర్. మన పేరడైజ్ బిర్యానీ మాదిరి స్పెషలయిటమ్స్ డజను తక్కువకాకుండా బ్రహ్మాండంగా చేసేవాళ్ళుండాలి అన్నట్లు.. ఇది.. ఫుల్ మిడ్ సమ్మర్ సీజన్ గదా.. మూసీలో నీళ్ళు నిల్ అయివుండాలి. నువ్వేం చేస్తావో తెలీదు.. ఒక్క రోజుకు వాటర్ వర్క్సు వాళ్ళతో డీల్ చేసుకునైనా సరే మూసీ ఫుల్ వాటరు అరేంజ్ చేయాలి. మనీ ఎంతైనా ఫరవాలేదు. డోన్ట్ వరీ ఎబౌట్ దట్ డర్టీ మనీ. మనకు పని ప్రధానం రిజిస్ట్రేషను వాళ్ళను కలిసి ఎల్లుండి ఉదయానికల్లా.. బిఫోర్ బెర్లిన్ ఫ్లైట్ డిపార్చర్.. ఒక డెత్ సర్టిఫికెట్ ఏర్పాటు చేయించాలి బాబాయ్! లాస్ట్.. బట్ నాట్ ది లీస్ట్.. మనకు కనీసం ఒక మూడు గంటలపాటు అలుపూ సొలుపూ లేకుండా గుక్క తిప్పుకోకుండా గుండెలు బాదుకుంటూ శోకన్నాలు పెట్టేవాళ్ళు.. అన్ని వయస్సులవాళ్ళు ఒక రెండు మూడు డజన్లకు తక్కువ కాకుండా కావాలి. గంట కింతకని మాట్లాడుకుని నేరుగా ఎయిర్ పోర్టుకే తీసుకు రావాలి. దొరుకుతారంటావా?"

అప్పటికయినా మాట్లాడే అవకాశం ఇచ్చినందుకు ఆనందం కలిగింది బాబాయికి "దేనికయినా కరువుండచ్చేమోగానీ.. ఏడ్చేవాళ్ళకి ఇక్కడ కరువేందిరా? ఆడామగా తేడా లేకుండా పిల్లా, పాపా, ముసలీ, ముతకా, అంతా చేసే పని.. చేస్తున్న పనీ.. ఇదేగదా! నల్లాల్లో నీళ్ళు వేళకి రావడం లేదని ఒకళ్ళేడిస్తే వస్తున్న ఆ కాసిని నల్లగా ఉంటున్నాయని ఇంకొళ్ళు ఏడుస్తున్నారు. కందిపప్పు నుంచి ఉప్పుకల్లు దాకా దేనిమీద చెయ్యేసినా నిప్పుకణికల్లాగా గుప్పుమంటున్నాయని గుండె మండి సంసారులు ఘొల్లుమంటుంటే, సెన్సారనేది లేకుండా సినిమాలు, టీవీ సీరియళ్ళు నట్టింట్లో కొచ్చి ఛండాలం చేస్తున్నాయని బుద్ధిజీవులు భోరుమంటున్నారు. ఆడపిల్లలకు మృగాళ్ళతో ఏడుపు, ఆఫీసు లేడీసుకి బాసులతో మొత్తుకోళ్ళు. ఆసుపత్రి వైద్యం పూర్తికాలం వ్యాపారమయిందని బీదా బిక్కీ గగ్గోలు పెడుతుంటే.. పెరిగే పెట్రోలు రేట్లతో ఫుల్ ఇండియా ఇప్పుడు శోక సముద్రంలోనే మునిగి ఉందిరా బాబూ ఇక్కడ. అదలా ఉంచూ.. ఇంతకీ ముందు నీ ఏడుపేందో చెప్పు! ఈ టాపులేని జీపులూ, బేండు మేళాలూ, పూలదండలూ, విందు భోజనాలూ, పురోహితులూ, చిల్లరా వగైరా.. వరకూ ఓ విధంగా అర్థం చేసుకోవచ్చు. ఏదో నారీ సన్మాన కార్యక్రమంలాంటిదేదో పెట్టుకుని వస్తున్నావని అర్థం చేసుకోవచ్చు. కానీ ఈ మూసీ పానీకా మామ్‌లాక్యా? ఎల్లుండికల్లా రిజిస్ట్రారాఫీసులో అంతర్జంటుగా 'చావు ధ్రువీకరణ పత్రాలు' సృష్టించవలసింది ఏ శివైక్యం చెందినవాడికి? "

బాబాయ్ ఆవేశాన్ని అర్థం చేసుకున్న కామేశ్వరం నింపాదిగా వివరించాడు. "మొన్న ఇండియా నుండి తిరిగొచ్చిన్నాటి నుంచీ పనేమైనా దొరుకుతుందేమోనని దేశాలు పట్టుకు తిరుగుతున్నా బాబాయ్! లండన్‌లో దొరికింది ఒక కంట్రాక్టు. షా అండ్ షా కంపెనీట.. వాళ్ళది తమాషా బిజినెస్ తరాల కిందట మనదేశం నుండి తరలి పోయి అక్కడ స్థిరపడిపోయిన బిలియనీర్లకి ఇప్పుడు కొత్త మోజు పట్టుకుందట. పుట్టటం ఎట్లాగూ మన కంట్రోలులో ఉండదుకదా! కనీసం పోయేటప్పుడన్నా ఘనంగా పోకపోతే జీవితాంతం ఇట్లా కడుపు కట్టుకుని కూడబెట్టుకుని సంపాదించిన దానికి అర్థమేముంది? అన్న కొత్త ఆలోచన మన కుబేరులలో మొదలయింది. షా అండ్ షా కమోనీ ఆ కాన్సెప్టుని కేష్ చేసుకునే ఆకర్షణీయమైన స్కీములు ప్రారంభించింది. పోయిన తరువాత ఎంత గ్రాండ్‌గా సెర్మనీ చేస్తామో బ్రతికున్నప్పుడే చేసి చూపిస్తే - నచ్చినవాళ్ళు.. ఎఫర్డబుల్ ప్లాటులు బుక్ చేసుకుంటారట. ఇండియా చాలు యాత్రని ఎంత

గ్రాండ్‌గా కలర్ ఫుల్‌గా మనం ప్రాజెక్టు చేయగలిగితే.. అంత బిజినెస్ మనకు సొంతమవుతుంది. షా అండ్ షా కంపెనీకి నేనిప్పుడు ఇండియన్ ఫ్రాంఛైసీని.. అర్థమయిందా?" అని ఫోన్ పెట్టేశాడు కామేశ్వరావు.

"ఇక్కడి బీదా బిక్కీ బ్రతకలేక చస్తుంటే.. అక్కడి బిలియనీర్లకి చావుకూడా గ్రాండ్ సెర్మనీగా జరుపుకోవాలని కోరికా! ఔరా! కాలం ఎంత ఘోరంగా మారిపోతుంది!" అని నోరు తెరవడం బాబాయ్ వంతయింది.

6

## *దేశ భాషలందు తెలుగు లెస్స!*

**తెలుగువాళ్ళం మనం 'ఆఁ.. తెలుగేకదా!'** అని మన అమ్మ భాషను మనం తేలిక చేసి మాట్లాడతాం గానీ తెలుగువాడు కాకపోయినా శ్రీకృష్ణ దేవరాయలు మన తెలుగుకి 'దేశభాషలందు లెస్స' అని ఏనాడో ఒక సర్టిఫికెట్ ఇచ్చి పారేశాడు. పలుభాషలు తెలిసిన ఉద్దండులు తన భువన విజయంలో ఉన్నా రాయలువారు తెలుగు పలుకు వైపుకే ఎందుకు తూగు చూపారో.. తెలుసా?!

తెలుగు మాట అందచందాలు అటువంటివి మరి. సందేహంగా ఉందా? అయితే మచ్చుకకి ఐదారు ఉదాహరణలు నాకు తోచినవి విన్నవించుకుంటాను. చదివి చివరలో తమరూ తమ అభిప్రాయం నాకు చెప్పండి! నాతో ఏకీభవిస్తారనే నా నమ్మకం.

పఠాభి అని మనకొక కవి ఉన్నాడు. ఆయనో పంచాంగం రాసి పారేశాడు. అందులో ఆయన తెలుగు పదాలతో బంతాట ఆడుకున్నాడు. వేనోళ్ళ కొనియాడబడేది 'బబుల్ గం' - అట! ఎంత చక్కని నిర్వచనం. నిజమేగా, కొన్న తరువాత నోటిలో అలా ఆడించేది బబుల్ గమ్మేకదా! ఆశుకవిత్వం అలవోకగా నోట పలికే ఉద్దండ పండితులు తిరుపతి వేంకట కవులు. వారి అష్టావధానాలలోని విశిష్ట పద్యాలను అలా చెప్పుకుంటూ పోతే అదే ఒక ఉద్గ్రంథ రాజమవుతుంది. పకోడీల మీద వారు వేయించిన కరకరపదాల పోహళింపు తిని చూడటం కాదు.. విని తలవంచవాల్సిందే!

*శనగపిండి, ఉల్లిపాయ, చిన్ని మిర్పకాయలన్*
*జునిపి అందు అల్లమంతదొనిపి ముద్ద చేసినన్*
*అనల తప్తమైన నేతి యందు వైచి వేచినన్*
*జను పకోడి అనెడు పేర చక్కనైన ఖాద్యమౌ!*

పకోడి ఎంత రుచిగా ఉంటుందో.. ఈ జంట కవుల వంటకం అంత రుచిగా ఉందంటే.. కాదనగలమా!

బేతవోలు రామబ్రహ్మం గారు ఆధునిక వేమన శతకం పేరుతో నేటి మార్కుల విధానాన్ని ఎలా తూర్పార పట్టారో అవధరించండి.

*మార్కులిచ్చు వాడు మా మంచి మాస్టారు*
*చదువు చెప్పువాడు చవటగాడు*
*మాదు శిష్యులెల్ల 'మార్కిస్టు'లైనారు*
*విశ్వదాభిరామ వినురవేమ*

అని ఆచార్యులవారు చదువులమీద వేసిన చురకలకి వేమనయినా జీవించి ఉంటే నోరు వెళ్ళబెట్టి ఉండేవాడే! అవునా.. కాదా! అర్థం పర్థం లేకుండా వాక్యాలను నడుందాకా తెగకొట్టి కట్టెల మోపును తెలిపి పుల్లలను వరసగా పేర్చినట్లు అక్షరాలను పేర్చుకుంటూ పోతే అదే ఆధునిక కవిత్వమయిపోతుంది - అనుకునే మహానుభావులు చాలామందే నేడు కనపడుతున్నారు. ఈనాడే కాదు భావకవిత్వం మంచి జోరుమీదున్న రోజులలో కూడా ఈ విమర్శ ఉంది.

*రెండు కాకులు కూర్చుండె బండమీద*
*ఒండెగిరిపోయె నంతనందొండు మిగిలె*
*రెండవది పోయె పిదపనందొండు లేదు*
*బండ మాత్రము పాపమందుండి పోయె!*

ఈ పద్యం విన్న వాడికెవరికైనా మతిపోకుండా ఉంటుందా?

అర్థం పర్థం లేకుండా పద్యం చెప్పాలని మరీ కంకణం కట్టుకుని పంతం బట్టి ఒక కవి రాసిన పద్యం ఇది అయినా, పాపం ఆయన ఆశ నెరవేరలేదు. ఇందులో బోలెడంత అర్థం బాగుందని ఒక విమర్శక శిఖామణి సోదాహరణంగా వివరించడానికి పూనుకున్నాడు. "రెండు కాకులు అంటే జీవాత్మ పరమాత్మలంట. బండ అంటే దేహం. ముందు జీవాత్మ, తరువాత పరమాత్మ అనంతంలో కలిసిపోయాయనీ.. అలా వెళ్ళిపోయినా దేహం మాత్రం బండరాయిలాగే నిర్జనంగా అలా ఉండిపోయింద"ని వ్యాఖ్యానం చేసేసాడు ఆ విమర్శకుడు. పద్యం చెప్పిన కవే అవాక్కయిపోయిన విచిత్ర పరిస్థితి. తెలుగా... మజాకా.. మరి!

తెనాలి రామకృష్ణుని పేర చాలా చాటువులు ప్రచారంలో ఉన్నాయి. అవి చాలా సరదాగా కూడా ఉంటాయి. అసలు రచనలు మాత్రం యమ సీరియస్. పాండురంగ మహత్యమే దానికి పెద్ద తార్కాణం. అందులోని నిగమశర్మ అక్క పాత్రను ఈ కవి చిత్రించిన విధానం అపూర్వం. అలాంటి ఉదాత్త స్రష్ట పేరున చలామణి అయే ఈ చాటువు విచిత్రం చూడండి!

అల్లసాని పెద్దనగారు తన మనుచరిత్రలో 'అమవస నిసి' అని ఛందస్సు కోసం ఒక చోట కక్కుర్తి పడ్డారని వెక్కిరిస్తూ అదే పంథాలో చెప్పిన పద్యం:

*ఎమిటినిసెపితివి కపితము*
*భ్రమ పడి వెరిపుచ్చకాయ వడిదిని సెపితో*
*ఉమెతకయను తిని సెపితో*
*అమవసనిసి అన్నమాట అలసనిపెదనా!*

అదే అల్లసానివారిని మరో పద్యంలో తనతో కలుపుకుని కాకమాని మూర్తి కవి అనే పెద్దమనిషి

*అల్లసాని వాని యల్లిక జిగిబిగి*
*ముక్కు తిమ్మనార్య ముద్దుపలుకు*
*పాండురంగ విభుని పదగుంఫనంబును*
*కాక - మాని (కి) రాయ (టం).. నీకె తగురా!*

అని చివరి పాదాన్ని విరిచి "అవి కాక దురదతో వీపు చెట్టు మానుకు రాయడం మాత్రం నీకే తగింది" అది విరిచి పెడర్థం తీసి అభాసుపాలు చేశాడని ఒక సరదా కథ. మునగ చెట్టు ఎక్కించడానికైనా, పడేసి వెక్కిరించడానికైనా తగిన సరంజామా అందించే మన భాష మరి సామాన్యమైనది అంటే ఒప్పుకుందామా?! రాసారు మన తెలుగువారు. నమ్మశక్యం కావటం లేదా? అయితే అవధరించండి.

*ఎంచగ చతుర్ధ జాతుడు*

*పంచమ మార్గమున నేగి ప్రథం తనూజం*

*గాంచి తృతీయం బచ్చట*

*నుంచి ద్వితీయంబు దాటి యొప్పుగ వచ్చెన్.*

ఈ పద్యం అర్ధం కావాలంటే ముందు మనం పంచభూతాల ఫార్ములా పక్కన రాసి పెట్టుకోవాలి

భూమి =1

నీరు = 2

నిప్పు = 3

గాలి = 4

ఆకాశం = 5

చతుర్ధ జాతుడు = వాయుపుత్రుడు

పంచమ మార్గం = ఆకాశ మార్గం

ప్రధమ తనూజ = సీతాదేవి

తృతీయం = నిప్పు

ద్వితీయం = సముద్రం

వాయుపుత్రుడైన ఆంజనేయుడు ఆకాశ మార్గాన ప్రయాణం చేసి భూమి పుత్రిక అయిన సీతమ్మ వారిని చూసి, లంకలో (తృతీయాన్ని) నిప్పుని పెట్టి. (ద్వితీయం) సముద్రాన్ని దాటి వచ్చేసాడని చమత్కారమన్నమాట.

బాపూగారినొకాయన కలవడానికని వచ్చి కలిసి మూడుగంటలు గడిచినా అచ్చట్లు ముచ్చట్లు ఆపకుండా చెపుతూనే కూర్చోనున్నాడట. చివరికి తన తప్పు తెలుసుకుని లేచిపోబోతూ "నేను బైలుదేరుతున్నాను. ఏమన్నా కావాలా?" అని అడిగితే బాపు మొహమాటంగా నవ్వుతూ "అంతకన్నా ఇంకేం కావాలి?" అన్నారట.

ఇన్ని తెలుగు అందాలు కష్టపడి సేకరించి ఇచ్చాను.. మన తెలుగు భాష గొప్పతనాన్ని చెప్పటానికని. ఇవి చాలా ఇంకేమన్నా కావాలా? ముగిస్తున్నాను అని నేను గనక అంటే మీ చేత "అంతకంటే ఏం కావాలి?" అని అనిపించుకోక ముందే ఇంతటితో ముంగిచేస్తే నాకూ, మన భాషకూ మంచిదంటారా?...

సరే.. అలాగే కానీయండి.. వచ్చే నెల మరో ముచ్చటతో మళ్ళీ ఎలాగో కలుస్తూనే ఉంటాంగా!

టా..టా!

<u>కొసమెరుపు:</u>

లక్ష్మణ యతీంద్రులుగా పేరు పడ్డ సంప్రదాయ కవి ముత్తేవి లక్ష్మణ దాసుగారు ఒకసారి కర్ణాటక సంగీత కచేరీకని వెళ్ళి "గాయకుని గానానికి అలా తల ఊగిస్తూనే ఉన్నారంట కార్యక్రమం జరుగుతున్నంతసేపూ" పక్కనే ఉన్న లాయరు మిత్రుడు సభ ముగిసి బయటికి వస్తూన్నప్పుడు ఛలోక్తిగా అడిగాడట "ఏం దాసుగారూ! తల తెగ ఊగింది ఇవాళ!"

"అవునండి. ఉంది. ఊగింది" అని దాసుగారి సమాధానం

మరి మీరూ స్వారస్యం ఆఘ్రాణించడంలో ఆ దాసుగారికన్నా తీసిపోలేదు తెలుగు అందచందాలను బాగానే ఆస్వాదించి ఉంటారు అవునా?!

7

# ఇంటిదేవత

'దేవుడున్నాడా - లేడా' అనే డిబేట్ ఈ ట్వంటీ ఫస్టు సెంచరీలో బొత్తిగా ఔట్ డేటెడ్ గా ఉంటుంది గానీ.. అసలు ఆ గాడ్ అనే వాడే గనక ఉండుంటే అతగాడు మగవాడే అయి ఉండాలనే రూలు మాత్రం ఎక్కడుందండీ?! ఆడాళ్ళంతా ఇంటిపనిలో, వంటపనిలో క్షణం తీరిక లేకుండా పడికొట్టుకుంటుంటే తీరి కూర్చుని మగాడు 'దేవుడు మగాడే' అని రాసిపారేస్తే ఆ మగరాతల్ని మూగ మొద్దుల్లా మనం ఎందుకు వప్పుకోవాలండీ?! క్రియేట్ చేయగల పవర్ ఒక్క ఆడజీవికే ఉందన్న జీవసిద్ధాంతం నిజమే అయుంటే ఈ చరాచర సృష్టి మొత్తానికి మూలం మరి ఒక 'స్త్రీ శక్తే' అయుండాలి గదండీ! ఎన్ని ముఖాలు, చేతులూ కాళ్ళూ ఉన్నాయని చెప్పుకున్నా.. బీడీలూ, సిగిరెట్లూ, బుడ్లు బుడ్లు బ్రాందీ సీసాలు తాగిపడేసే మగ పురుషుడి కెక్కడుందండీ?! పురాణాలూ, ఉపనిషత్తులూ, హిస్టరీలూ జాగ్రఫీలు చదివితే తెలుస్తుందని బుకాయిస్తే ఇంక లాభం లేదండీ! అవన్నీ ఏ మగమహారాజులో పనిగట్టుకుని గిలికి పారేసిన పసలేని రాతలేనని.. తలా తోకాలేని తలతిక్క సిద్ధాంతాలని తలకెక్కించుకోవాల్సిన అవసరం మనకింకే మాత్రం లేదని నిరూపించుకోవాల్సిన క్షణాలు ముంచు కొచ్చేసాయండీ! పదండి.. కొప్పులు బిగించి!!

'అమ్మలగన్నయమ్మ ముగ్గురమ్మల మూలపుటమ్మ బాల బెద్దమ్మ సురారులమ్మ కడుపారడి పుచ్చినయమ్మ' అంటూ మగవాడై ఉండీ ఆ పోతనామాత్యుడు అంత పారవశ్యంతో తన భాగవతాన్ని మహత్వ కవిత్వపరంగా ఢంకా బజాయించి చెప్పి ఆరు శతాబ్దాలు దాటిపోయినా మన మగాళ్ళు మాత్రం ఈ సృష్టి మొత్తానికి తామే పెద్ద అధినాయకులయినట్లు ఆ అమెరికా ఒబామా టైపులో కలిగిస్తూంటే కట్ చేయకుండా సహించి ఊరుకోడు ఇంకే మాత్రం తగదండీ! తగదుగాక తగదండీ!

ఆడదంటే వంటింటి కుందేలో, కొప్పులో మల్లెపూలు పెట్టుకుని నాయుడు బావకోసం ఎప్పుడూ ఎదురు చూస్తూ కూర్చునుండో ఏ ఎంకీనో, పండగలకీ పబ్బాలకీ పిల్లలు పిండివంటలు చేసుకుని మురిసిపోయే పిచ్చి ఇల్లాలో, మొగుళ్ళు కలకాలం చల్లంగా ఉండాలని కడుపు మాడ్చుకుని గుళ్ళ చుట్టూ ప్రదక్షిణాలు చేసుకునే పతివ్రతా శిరోమణనో అని మగవాడు ఇంకా ఈ కలి చివరి పాదంలో కూడా భ్రమపడుతుంటే ఎలా? డ్రాయింగ్ రూంలో సోఫా మీద దర్జాగా కాలుమీద కాలేసుకుని ఆదివారం పూటైనా సరే మొగుడు కలిపిచ్చిన ఫిల్టర్ కాఫీ 'సిప్' చేస్తూ స్టార్‌డస్ట్ పేజీలు నంజుకుంటూ టీవీలో వచ్చే ఎఫ్ ఛానెల్ ఎంజాయ్ చేసే కాలం.. ఏం..ఎంజాయ్‌చేసే కాలం

ఆడదానికి మాత్రం ఏనాటికీ రాకూడదాండీ? కుమారి శతకం బట్టీ పెట్టించే కాలంతోనే ఇంకా మనమున్నామా?! అప్పుడెప్పుడో అమ్మకు అమ్మమ్మ అప్పగింతలప్పుడు చెప్పిన 'నారీ ధర్మాలన్నీ' పాటించితేగానీ పతివ్రతలమనిపించుకోని యుగంలోనే మనమింకా ఉన్నామా?! మన మగాళ్ళు మాత్రం ఆ ఆదిత్య హృదయంలో చెప్పినట్లు శిరోముండనాలు, శిఖలు, నుదుటన దిద్దుకున్న తిరుచూర్ణాలలో సంధ్యావందనం చేసిన తరువాత మాత్రమే బ్రేక్ ఫాస్ట్ చేస్తున్నారా?! పంచెలూ ధోవతుల దాకా ఎందుకూ.. ప్యాంటూ చొక్కాలు కూడా వదిలేసి అమెరికా కొడుకులు వాడి వదిలేసిన వదులు వదులు బర్మడాలు, బుష్ షర్టూ, బూట్లూ వేసుకుని బూచాళ్ళలాగా పార్కుల్లో పడి ఏదో బడాయిగా మార్నింగు వాకులు చేయటంలా?! ఎన్ని యుగాలు మారినా ఆడదాని మెడకు మాత్రం అన్ని పలుపుతాళ్ళు లెక్క తప్పకుండా ఉండాల్సిందేనా?! అవన్నీ అవాకులూ చెవాకులూ అనిపించటం లేదటండీ?!

ఇంటి ఆడది ఈ మగాడికి కల్పనారాయ్, పక్కింటావిడ మాత్రం పాతికేళ్ళ దగ్గర ఆగిపోయిన ఐశ్వర్యారాయ్! పిలవకుండానే పక్కలోకి వస్తుందిగదా.. అడుక్కోకుండానే అన్నీ వేళకి అమర్చి పెట్టే పిచ్చిది కదా. పిల్లల్ని కనిపెట్టి.. తాను ఏ షికారుకో, సెకండ్ షో సినిమాకో, క్యాంపు పేరుతో పొరుగూరు హోటల్‌కో వెళ్ళి జల్సా చేస్తుంటే ఆ పిల్లల్ని కనిపెట్టుకుని ఉండే పైసా పేమెంటులేని కాపలా మనిషిగదా! ఆదివారం, పండగ పూటని కూడా చూడకుండా సెలవు లేకుండా ఇంటిపని, పెంటపని ఠంచనుగా టైము తప్పకుండా చేసిపెట్టే పనిమనిషిగదా! అందుకే.. ఎంత అందమున్నా.. అంది వచ్చినందుకే మగాడి ముందు తలొంచుకుని తాళికట్టించుకున్నందుకే ఆడది అంటే అంత ఎగతాళి! ఎలాగండి?!

ఆడదాని బ్రతుకు 'అడవిగాచిన వెన్నెల' అని ఎవరన్నారో గానీ.. అక్షరలక్షలిచ్చి ఘనసన్మానం చేయాలామహానుభావులకు! 'సంసారం' నిజంగా అడవే. ఆడది అందులో మగాడు చెండుకు తినే లేడి. అడగకుండానే కాచే వెన్నెలంటే ఎవరికైనా చులకనే కదా మరి! సూరీడు వేడి కిరణాలను భరించి అమృతం లాంటి వెన్నల సోనలను కురిపించే చందమామను - సంసారం తాపాన్ని తాను భరిస్తూ ఇంటిల్లిపాదికీ చల్లని సుఖాన్నిచ్చే అందాల భామతో పోల్చినందుకు మరోసారి ఆ మహానుభావుడి కాలికి గండపెండేరం కూడా తొడగాలండీ!

పప్పులో ఉప్పెక్కువైందని చిందులేసే మగమహారాజుకి పప్పులూ ఉప్పులూ భోజనంగా మారటానికి ఇంటి ఇల్లాలు ఎంత సుఖాన్ని ప్రేమతో రంగరించి పోస్తుందో ఎన్నడైనా ఆలోచించగలడా! ఆఫీసు నుంచి ఇంటికొచ్చీ రాగానే గుమ్మంలోనే కమ్మటి కాఫీని అందించే ఆ పిచ్చి తల్లి ఇంటిపట్టునే ఉండి ఎంత గ్రౌండ్ ప్రిపేర్ చేయకబోతే ఇంటిల్లిపాదీ అంత 'సౌండ్'గా రాత్రుళ్ళు నిద్రపోగలుతున్నారూ... ఎప్పుడైనా ఒక్క క్షణం తీరిగ్గా ఆలోచించాలని అనిపించలేదా?! ఆమె ఒక్క గంట పాటు చూస్తే టీవీ సీరియల్స్, మీదో చీరల షాపింగ్ మీదో, ఇరుగు పొరుగమ్మలతో చేసే గప్పా గోష్టి మీదో జోకులు కట్ చేయటమే గొప్ప సెన్సాఫ్ హ్యూమర్‌గా భావించే నిజంగా ముద్దొచ్చే మగాడు సంసారమనే 'సైన్సు'కి సరయిన ఫార్ములా నిజంగా కనిపెట్టింది ఆమే అని అందుకే తెలుసుకోలేకుండా ఉన్నాడు! తెచ్చి పడేస్తే వండి పడెయ్యటం కూడా ఓ పెద్ద ఘనకార్యమేనా? అని వెటకారం చేసే మగాడి చేతిలో ఓ ఆదివారం పూట వంట గరిటె పడేస్తే ఆ వేడి ఎంతో అనుభవంలోకొస్తుంది. సంసారాన్ని నడపటం - చట్టసభను నడపటం కన్నా కష్టతరం. ఒక్క గృహపతి వందమంది సభాపతుల పెట్టు. తెల్లారుఝామునే పేపరూ, పాలపేకెట్లూ, కళ్ళుతెరవగానే బెడ్ పక్కన పొగలు కక్కే కాఫీ, బిస్కెట్లు... బాత్ రూములో వేడినీళ్ళు, షేవ్ చేసుకునే రేజర్, స్నానమాడి బైటకు రాగానే చలువ దుస్తులూ, కొబ్బరి చట్నీ, సాంబారులతో బ్రేక్ ఫాస్టులూ, .. కాళ్ళకు వేసుకునే జోళ్ళ దగ్గర్నుంచీ. కళ్ళకు పెట్టుకునే జోళ్ళుదాకా అన్నీ అమర్చి.. బండెక్కి ఆఫీసుకు పోయేటప్పుడు పట్టించుకున్నా పట్టించుకోకపోయినా ప్రేమతో 'టాటా' చెప్పే ఆ పిచ్చి ఇల్లాలు.. ఆడదైనప్పుడు దేవుడు మాత్రం ఆడది గాక మగవాడు ఎలాగవుతాడు చెప్పండి?! మరీ చోద్యంకాకపోతే! కష్టమొచ్చినప్పుడు మనిషి తలుచుకునే ఆ దేవుడు మరి ఆడదే అయినప్పుడు మరి మగాడు 'ఆడదానిని' అంత చులకనగా చూడటం దేవుడిని అవమాన పరిచినట్లేకదండీ! మనం నిత్యం కొలిచే దేవుడి శంఖు చక్రాలను గదా అభయహస్తాలను అంత

భక్తిగా గౌరవిస్తున్నప్పుడు మరి మన భూలోక దేవుడితో ప్రేమగా చేతులకు ధరించే గాజులను, పసుపూ కుంకుమలను ఒక చేతగాని వారు ధరించే వస్తువులుగా మగవాడు చూడటం ఎంత అవమానకరమండీ?! స్త్రీలింగ వాచకాన్ని ఒక నీచార్థంలో వాడటం నిజంగా చూస్తే పెద్ద దైవదూషణ క్రిందకే వస్తుంది కదండీ! ఇకనైనా మగాళ్ళు గాజులూ, పసుపు కుంకుమలను అవమానకరమైన వస్తువులుగా చూసే అవలక్షణం మానుకోవాలండీ - ముఖ్యంగా ఉద్యమాలు చేసేవాళ్ళు.

## 8

## "నువ్వు ఎక్కదలుచుకున్న రైలు ఒక జీవిత కాలం లేటు"

**ఇది ఆరుద్రగారి గ్రేటు క్వోటు.** ఏదో లేటుగా అయినా సరే వచ్చిన బండిని ఎక్కడానికి బద్దకించే బడుద్దాయితనం మన తెలుగు వాళ్ళది. తెలుగు భాష విషయంలో ఈ పద్దతి మరీ అచ్చుగుద్దినట్లు సరిపోతుంది.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత భాషా ప్రాతిపదిక మీద ప్రత్యేక రాష్ట్రం కావాలని పోరాటం లాంటిది చేసి మరీ విజయం సాధించుకున్న మొదటి జాతి మన తెలుగుజాతే.

పరిపాలన, విద్యాబోధన అమ్మ భాషలోనే సాగాలని తపించి 1919 సంవత్సరంలోనే దేశభక్తి కొండా వెంకటప్పయ్యగారి అధ్యక్షతలో బాపట్లలో సాగిన ఆంధ్ర మహా సభలో మనం ఒక తీర్మానం చేసుకున్నాము. దాదాపు వందేళ్ళ కిందట. ఆ కోరిక ఇంకా మనకు ఒక తీరని కోరికలాగే మిగిలిపోయి ఉంది.

ఆంధ్రభాష అనగానే 'దేశభాషలందు తెలుగు లెస్స' అని ఆనాటి శ్రీనాధుడు నుంచీ శ్రీకృష్ణదేవరాయలు వారి దాకా మెచ్చుకున్నారని తెగ చంకలు గుద్దుకుంటాం. దేశభాషలంటే ఇప్పటిలాగా ఇండియా మొత్తంలో మాట్లాడటం పూర్వ జన్మ సుకృతం - అని ప్రఖ్యాత పండితుడు అప్పయ్య దీక్షితులు తెలుగువారి మీద అసూయపడ్డాడని మనం చెప్పిందే పదిసార్లు ఇప్పటికీ చెప్పుకుంటున్నాం. అప్పటి సంగతి ఏమోగానీ ఇప్పుడు మాత్రం తెలుగునేల మీద తెలుగువాడిగా పుట్టి తెలుగు నేర్చుకోవాల్సి వచ్చిందే - అని కుమిలి పోయే తెలుగు వాళ్ళే ఎక్కువగా ఉన్నట్లు అనిపిస్తుంది.

తెలుగు చెప్పే బళ్ళల్లో తల్లిదండ్రులు పిల్లల్ని చేర్చడానికి ఇష్టపడరు. చేర్పించిన ఇంగ్లీషు బడిలో పిల్లలు ఏదో అలవాటులో పొరపాటుగా కాస్త వాళ్ళలో వాళ్ళు తెలుగు మాట్లాడుకుంటే పెద్ద శిక్షే అనుభవించాల్సి వస్తుంది. మెడలో పలకవేలాడదీసి ఎండలో నిలబెట్టినా.. ఏదో తెలుగు భాష మీద అభిమానం ఉన్న ఏ కొద్ది మందో మధన పడాలిగానీ.. ఆ పిల్లలు తల్లిదండ్రులు కూడా అభ్యంతర పెట్టరు. అమ్మలు మమ్మీలు నాన్నలు' డాడీలు మామయ్యలు, బాబాయిలు అంకుళ్ళు, అత్తయ్యలు, 'ఆంటీ'లుగా రూపాంతరం చెంది చాలా ఏళ్ళే అయింది తెలుగు నేలమీద.

సాక్షాత్తు సర్కారు వారే స్వయంగా కల్పించుకుని చిన్న బడుల్లో కూడా తెలుగుకి బదులుగా ప్రాధమిక దశ నుంచే ఇంగ్లీషుని బోధించే విద్యా విధానాన్ని ప్రోత్సహిస్తున్నారు. అటు తెలుగూ రాక - ఇటు పరాయి భాషయిన ఇంగ్లీషూ వంటబట్టక.. పసివాళ్ళు రెండింటికీ చెడ్డ రేవళ్ళుగా తయారవుతున్నారు.

ఆంగ్లం అంతర్జాతీయ భాషగనక.. దానిమీద పట్టు సాధిస్తేగానీ అంతర్జాతీయంగా ఉపాధి అవకాశాలను చేజిక్కించుకోలేము - అనే వారి వాదనను కొట్టిపారేయాల్సిన అవసరం లేదుగానీ ఒక్క విషయం ఆలోచించాలి. ఏ జ్ఞానమైనా ప్రాథమిక దశలో మాతృ భాష ద్వారానే అందించటం సహజంగా సరళంగా ఉంటుంది అన్నది మనోవైజ్ఞానిక శాస్త్రవేత్తలు నిర్ధారించిన సత్యం. మాతృభాష మీద పట్టు సాధించగలిగితే మిగతా ఎన్ని భాషలనైనా అభ్యసించడం తేలిక. మన చిన్న బళ్ళల్లో ఇంగ్లీషు పేరుతో చేసే బోధనంతా నాణ్యమైనది కాదు. ఇంగ్లీషు మీద సాధికారత లేని వేరే భాషలవారు చెప్పే చదువు బిడ్డ పెద్దయిన తరువాత విదేశాలలో వ్యవహరించే దానికి సరిపోయేది కాదు. విదేశాలలో అవకాశం కోసం మళ్ళా వేరే విధంగా శిక్షణ పొందవలసిందే మరి బాల్యం నుండీ విదేశీ ఉపాధి అవకాశాల మిషతో పసిబిడ్డను సొంత భాష సొంత సంస్కృతి మాధుర్యం నుంచీ దూరం చేయడం తెలివైన పనేనా?

బిడ్డకు నోరులేదు కనక, తమ హక్కులేవో తమకు తెలియవు కనక, తల్లిదండ్రులు బలవంతంగా వారి బాల్యాన్ని దారి మళ్ళించడం సబబు కాదు.

తెలుగు నేర్చుకోమంటే ఇంగ్లీషు నేర్చుకోవద్దని అర్థం కాదు. అంత శ్రద్ధ ఉంటే రెండూ నేర్చుకోవచ్చు. కాదంటే ఒక దశదాకా ముందు మాతృభాష మీదే శ్రద్ధపెట్టవలసి ఉంటుంది. ప్రాథమిక విద్యాదశ దాటిన తరువాత నుంచీ క్రమక్రమంగా ఇంగ్లీషు భాష స్థాయిల ప్రకారం పెంచుకుంటూ అభ్యాసన చేయించడం ఉత్తమ విధానం.

ఆ మాట కొస్తే ప్రపంచీకరణ అత్యంత వేగంగా విస్తరిస్తున్న ఈ కాలంలో కొత్త కొత్త సాంకేతిక నైపుణ్యాలు అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో భాషల మధ్య హద్దులే చెదిరిపోతున్నాయి. ఒక భాషలోని విజ్ఞానం మరొక భాషలోకి క్షణాలలో తర్జుమా చేసుకోగల సౌకర్యాలు అభివృద్ధి చెందుతున్నాయి. ఏ భాషనుండైనా మన భాషలోకి ఆ జ్ఞానాన్ని సమగ్రంగా దింపుకోవాలంటే.. ముందుగా చేయవలసింది మన భాషను దానికి తగిన విధంగా ఆధునికరించు కోవడం. పరిపుష్టంగా మార్చుకోవడం.

పొరుగున ఉన్న తమిళనాడు, కర్నాటక, మహారాష్ట్ర రాష్ట్రాలలోలాగా, పంజాబు హర్యాన వంటి ఉత్తరాది రాష్ట్రాలలోగా జనం నాలిక మీద ఆడే భాష మీద శ్రద్ధ పెట్టాలిగాని. ఇదేందీ.. బిడ్డ పుట్టీపుట్టక ముందే కోళ్ళ ఫారాల్లాంటి కాన్వెంట్ల పేరుతో నడిచే సోకాల్డ్ ఆంగ్ల పాఠశాలలకు తోలేయడం! ఆ విధానాన్ని సర్కారు వారూ ప్రోత్సహించడం?!

తెలుగు చట్ట సభను నడిపే సభాపతిగారితో సహా మన ప్రజా ప్రతినిధులు అటు పార్లమెంటుతో గానీ ఇటు అసెంబ్లీలో లాగానే జనం భాషను మాట్లాడుతున్నది ఎంతమంది?

తెలుగుకి బదులుగా సంస్కృతం ద్వితీయ భాషగా ఎంచుకుంటే మంచి మార్కులు ఇచ్చే విద్యావిధానం మన రాష్ట్రంలో ఉంది ఇరుగు పొరుగు నవ్వుకోరా?

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిన తరువాత దాదాపు పది సంవత్సరాలు గడిచిన తరువాత గానీ తెలుగుని అధికార భాషగా బీసీ అధికారిక తీర్మానం పాసు కాలేదు! అయినా నేటికీ 'గవర్నమెంటు ఆర్డర్స్'ని ఇంగ్లీషులో చదువుకుంటే తప్ప వ్యాఖ్యానించలేని పరిస్థితులున్నాయి. రాష్ట్రంలో న్యాయస్థానాల నుంచీ, ప్రభుత్వ కార్యాలయాలలో దాకా.. కేవలం తెలుగు మాత్రమే చదవడం రాయడం వచ్చిన వాడి పరిస్థితి 'వేలు ముద్రవాడి' కన్నా మెరుగు కాదు.

పొరుగు ఒడిసాలోని తెలుగు వాళ్ళందరూ వాళ్ళ భాష సాధక బాధకాలు చర్చించుకునేటందుకు ఒక సభ పెట్టుకుని మన మంత్రులని పిలిస్తే.. వెళ్ళే తీరిక, ఓపిక, ఆసక్తి ఒక్క ప్రజాప్రతినిధికి కూడా లేకపోయింది.

అందాకా ఎందుకు .. మొన్న విజయవాడలో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభలలో సర్కారు వైపు నుంచి వచ్చి కూర్చున్న పురుగు ఒక్కటి కూడా లేదు. తెలుగు చిత్రాలలో ఒక్క కథానాయకులు, రచయితలు మాత్రమే తెలుగు వచ్చిన వారుగా ఉండే పరిస్థితి. ప్రతినాయకులు కథానాయికలు చివరికి దర్శకత్వం బీసీ వారికి కూడా తెలుగు తెలిసి ఉండాలని నిబంధన లేదు. తమిళ చిత్రసీమలో

కథానాయకలు పొరుగు ప్రాంతాల నుంచీ వస్తే రావచ్చుగానీ.. డబ్బింగు మాత్రం వారు స్వంత గొంతుకతో చెప్పాలనే నిబంధన అమలులో ఉంది. కర్నాటకలో కొంతకాలం క్రిందట వేరే భాషా చిత్రాలకు థియేటర్లు ఇవ్వరాదనే ఆందోళన రేగింది. మహారాష్ట్ర ముంబయిలో టాక్సీ నడిపే డ్రైవర్లక్కూడా కనీసం మరాఠీ వచ్చి ఉండాలనే నియమం పెట్టించే ప్రయత్నం ఒక రాజకీయ పార్టీ చేసింది.

విపరీత భాషా ధురభిమానాన్ని ఎవరూ హర్షించనట్లే.. విడ్డూరమైన బాషావ్యామోహాన్ని కూడా ఎవరూ హర్షించరాదు.

తెలుగు పదాలు తేలికగా దొరికే చోటకూడా పనికట్టుకుని భేషజాల కోసం ఆంగ్ల పదాలను వాడేలాంటి వారివల్లే మన తెలుగుకి తెలుగు సంస్కృతికి మొదటి ముప్పు.

మాతృభాషను గురించి మరీ ఇంత వెర్రివ్యామోహం తగదనే వారందరికీ ఇచ్చే సమాధానం ఒకటే.

వంటికి దెబ్బ తగిలినప్పుడు తమరు 'మమ్మీ' అంటే బాధ ఉపశమిస్తుందా? 'అమ్మా' అని అరిస్తే హాయి అనిపిస్తుందా? ఒకటి నుంచి వందదాకా తమరు తెలుగులో తొందరగా లెక్కపెడతారా.. ఇంగ్లీషులోనా? తల్లిభాష అవసరం తర్కానికి అందేది కాదు. అది మనిషి భావోద్వేగాలతో గాఢంగా అల్లుకుపోయి ఉన్న బంధం. అమ్మలాగే అమ్మ భాష కూడా! అమ్మ పాలలాగే అమ్మ భాష పలుకుబడిలాగా! తరువాత తరువాత పిజ్జాలు, బర్గర్లూ అని హరాయించుకోగలిగినా పేగు తెగి భూమి మీద పడిన మరుక్షణంలో ఏ బిడ్డ అయినా తడుముకునేది తల్లి రొమ్ముకోసమే. పసివాడిని అమ్మ భాషనుంచీ విడదీయడం.. అమ్మ ఒడినుంచీ వేరుచేయడం కన్నా దారుణం.. ప్రమాదకరం. ఇది ఒకరు వచ్చి చెప్పే విషయం కాదు. ఎవరికి వారు అనుభవంలోకి తెచ్చుకోవలసిన అత్యవసరమైన విషయం.

*(సెప్టెంబరు 8 అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవం. ఆ సందర్భంగా)*

9

# అకాలగర్జిత దోష నివారణ మంత్రం.

**"ఏంటి బాబాయ్... ఇంటికి మరమ్మత్తులా?** అన్ని లక్షలు పోసి మొన్ననేగా కట్టించావ్?! అప్పుడే ఇట్లా మెయిన్ గేటే మూయించేస్తున్నావేంటి?! నీకూ టైం బాగోలేదా ఏంటీ?"

"వెటకారమొద్దు! పడేవాడికి తెలుస్తుందిరా దెబ్బ బాధ. నిన్నటిదాకా నేనూ ఏదో తమాషాగా తీసుకున్నా గానీ.. బొప్పికట్టింతరువాత గానీ ఇప్పుడు నొప్పి తెలీటంలేదు. టైం బాగోలేకపోతే ఎంతలావు సింహమైనా సింహద్వారం నుంచీ రాలేదురా అబ్బాయ్! వెనకాల ఏ కలుగో చేయించుకుని ఎలుకలాగా వచ్చిపోతుండాల్సిందే.. వాస్తు అంటే ఇప్పుడు తెలిసొచ్చిందిరా బాబూ!"

"ఫో బాబాయ్.. నువ్వు కూడా మరీ ఇలా తయారయ్యావ్ ఏంటి? అప్పుడన్నీ వాస్తు చూసుకునే కదా కట్టించుకున్నావ్?! ఈశాన్యంలో పూజగదీ.. దక్షిణంలో పడగ్గదీ.. పడమర భోజనాలగదీ.."

"నిజమేరా నాయనా! అన్నీ చూసుకున్నాగానీ.. 'ఆ డబ్బూ దస్కం' ఏ మూల కుక్కాలో ఏ వాస్తుపండితుడూ చెప్పలేదప్పుడు. ఇప్పుడు దానితోనే ముప్పొచ్చి చచ్చింది. ఏ క్షణంలో ఏ సిబిఐ వాడో ఈడీవాడో ఎటునుంచొచ్చి పడతాడోనని గుండెలు దడదడలాడిపోతున్నాయి. దినదినగండం నూరేళ్ళాయుష్షులాగా ఇట్లా క్షణం క్షణం వణికి చచ్చేకన్నా. అయితే అయింది. ఖర్చులో ఖర్చని.. ఇట్లా మరమత్తులకు దిగానులే! ఇంకింతకన్నా ఇప్పట్లో విడమరిచి చెప్పడం నావల్ల కాదు. గోడవతలనుండీ ఏ మీడియావాడో వింటే మొదటికే మోసం వస్తుంది. అసలే నా టైం బాగోలేదు"

"నీకనే ఏంటిలే బాబాయ్.. లోకానికే రోజులు బాగాలేవు. అంతంత గొప్పలు పోయే అమెరికావాడికి తప్పాయా తిప్పలు? ఎప్పుడో ఎవరో చేసి పేరబెట్టిన అప్పులు ఇప్పుడు కాలికింద నిప్పుల్లా కథాకళి చేయించటంలా!. నువ్వే ఇలా అంటే మరా ఒబామా గారు పాపం ఏమనుకోవాలి! అంత సాహసం చేసి బిన్ లాడెన్ని సఫాచేసిన సంతోషం నెలరోజులు కూడా మిగలలేదు. నెత్తిమీద మరో మాంద్యం పిడుగొచ్చి పడింది. మరాయనా నీకు లాగా ఆ వైట్ హౌసు గోడలకి వేరే రంగులేయిస్తూ కూర్చోవాలా! లీకయిపోతున్నాయని అణురియాక్టర్ల ప్లాంట్లకు జపానువాడు శాంతులూ హోమాలూ చేయించాలంటావా ఏంటి కొంపతీసి? నీ లెక్కన ఆ ఈజిప్టు ముబారక్ లూ, పాకిస్తాను ముషారఫ్‌లూ మన ఇండియా వచ్చి చండీయాగాలు గట్రా చేయించకపోబట్టే మృత్యుగండం ముంచుకొచ్చిందనేట్లున్నావే!"

"తప్పేముందిరా! ఎక్కడెక్కడి వాళ్ళ గోలో ఎందుగ్గాని. దుబాయ్‌లో మహారాజాలాగా వెలిగిపోయే ఆ ఎమ్మార్ కంపెనీ వాళ్ళు ప్రపంచంలోనే ఎత్తైన 'బుర్జ్ అల్ ఖలీఫా' కట్టినప్పుడు రాని తిప్పలు.. ఇప్పుడు.. ఇండియాలో మన రాష్ట్రంలో నాలుగెకరాల భూమిలో పదివిల్లాలు కట్టిపెట్టే పనికే ఎంతగా విలవిల్లాడిపోతున్నారో చూడు. ఆ అల్ ఖైమారస్ వాళ్ళకు పోర్టులు కట్టటమేమన్నా కొత్తవిద్యా? మన 'వాడరేవు – నిజాం పట్నం' రొంపిలో పడి గిలగిలలాడిపోతున్నారు! అసలు మన దక్షిణాదికే ఏదో శని పట్టుకున్నట్లుందిరా! కర్నాటకలో ఏవో ముష్టి 'పదికోట్లు ముడుపులుగా పుచ్చుకున్నందుకే.. పాపం ఆ యడ్యూరప్పకు ఎంత ఏడుపు మిగిలిందో నీ కళ్ళతోనే నువ్వు చూడు! అన్నేళ్ళ బట్టీ మద్దతిస్తున్నాడని కూడా కరుణ చూపకుండా కరుణానిధిగారినీ ముదివయసులో కేంద్రం ఎలా క్షోభపెడుతుందో తలుచుకుంటేనే గుండె ఒక వంక తరుక్కుపోతూ ఉంది.. మరొవంక గుడగుడలాడుతూ ఉంది. అంత అనంత పద్మనాభస్వామి వారి సంపదకే కాళ్ళొచ్చే ప్రమాదమేర్పడగా లేనిది మానవ మాత్రులం మనబోటివాళ్ళు కడుపుకొట్టో, కాళ్ళు పట్టో పోగేసుకున్న ముష్టి నాలుగు రాళ్ళకు కాళ్ళు మొలిస్తే.. ముందు మీ పిన్నే తట్టుకోలేదురా! ఉద్యోగం చివరిరోజులు గదా!.. అని.. ఎంతవేగంగా చురుగ్గా..... ఈ ఆస్తులు సంపాదించానూ! అంతకన్నా వేగంగా ఈ నిందలూ, నేరారోపణలూ, విచారణలూ దాడులూ.. ఇదంతా ఏదో నా కర్మ ప్రారబ్ధమే!"

"బాబాయ్! నాలుగురోజుల బట్టి అన్ని పత్రికల్లో టీవీల్లో ఆ సిబిఐ వాళ్ళ ప్రాథమిక సమాచార నివేదిక వస్తూనే ఉంది. ఆ పాతిక తక్కువ కౌరవుల గుంపులో నీ పేరు నాకెక్కడా కనిపించలేదే! నువ్వెందుకింత ఆందోళన పడుతున్నావో అర్థంకాకుండా ఉంది! నీ వాలకం చూస్తుంటే అన్నం నీళ్ళూ మానేసిన ఆ అన్నాహజారే గారికన్నా నువ్వే రెండో మూడో కిలోల బరువు తగ్గినట్లున్నావ్. ఎవరి ఖాతాలో స్థంభిస్తే.. నీకెందుకింత కంగారూ?! ఒక వంక ఎన్ని ఆరోపణలొచ్చి పడుతున్నా చెక్కుచెదరకుండా ఓదార్పు యాత్రలంటూ ఊళ్ళ వెంటబడి తిరుగుతున్నాడు నెంబర్ వన్. లక్షలూ కోట్లూ లడ్డూల్లాగా పంచుకుని దాచుకున్న పెద్ద పెద్దవాళ్ళే అంత ధైర్యంగా ఎదురు దాడులూ, చేస్తుంటే.. నువ్వేంటి బాబాయ్.. స్వైన్ ఫ్లూ తగులుకున్న రోగిమాదిరిగా.. మొహం కూడా కనిపించకుండా ముసుగేసుకుని.. చీకట్లో ఇట్లా. ఇంటిగోడలు పగలకొట్టిస్తున్నావ్? అన్నన్ని కోట్లు మింగిన ఆ టూజీ రాజాను చూసైనా ధైర్యం తెచ్చుకోరాదా? అంత నిజంగానే ఏదన్నా కొంపమీదకొచ్చి పడితే అప్పటికేదో ఉపాయం తట్టకుండా ఉంటుందా? ఆ కల్మాడీ లాగా ఏదన్నా మతిమరుపులాంటి కొత్త చిట్కానో పుట్టుకొస్తుందిలే బాబాయ్! ఇప్పటి నుంచే ఇలా చడీ చప్పుడు కాకుండా రాత్రిళ్ళు ఇలా పలుగులూ పారలూ పట్టుకుని తిరుగుతుంటే... చుట్టుపక్కల వాళ్ళకి నీ అంతట నువ్వే ఉప్పందించినట్లవదూ! ముందీ వాస్తుమార్పులు మానెయ్!"

"అలాక్కాదురా బాబూ! ముందు నేనూ నీకులాగే బిగువుగానే ఉందామనుకున్నానుగానీ... కుదిరేట్లు లేదు. పూజాది మీదపెట్టిన శ్రద్ధ పడగ్గదిమీద పెట్టుకోకబట్టేగదా.. స్వామి నిత్యానందకు అన్ని తిప్పలొచ్చాయి. తీహార్ జైల్లో కూతుర్ని కనీసం ఉత్తరం వైపు సెల్లో పెట్టించే ఏర్పాటైనా కరుణానిధి చేయకపోబట్టే బెయిలు దొరకడం కూడా కష్టంగా ఉందంటున్నారు వాస్తు పండితులు. చాదస్తం అని మనం ఊరికే వెక్కిరించుకుని సరదా పడతాంగానీ. లక్షలూ.. కోట్లూ కుమ్మరించి తీసిన చిత్రానికి కూడా అక్షరం విషయంలో సినిమా వాళ్ళూరికే ఎందుకు అంత పట్టు పడతావు? మొన్న బాబాయి, నిన్న మంత్రులు, పొద్దున సోనియా సలహాదారు, మధ్యాహ్నం సిబిఐ, సాయంత్రం చివరికి న్యాయస్థానం పేరు కూడా లాగుతున్నారుగదా రొంపిలోకి! రేప్పొద్దున్నే ఎవరి పేరు కొత్తగా బైటపడుతుందోనని నాకు బెంగగా ఉందిరా!"

"ఊరికే కంగారు పడి ఈ మరమ్మత్తులు చేయద్దులే బాబాయ్! మీ నేత చెప్పనే చెప్పాడుగా.. పైనుంచీ దేవుడు అంతా చూస్తున్నాడని అధర్మానికి తప్పకుండా శిక్షపడుతీరుతుంది. బాధపడద్దు!"

"అదే కదురా బాబూ మొదటి నుంచీ నాగోల! పైన చల్లంగా కళ్ళుమూసుక్కూర్చున్న దేవుణ్ణి కూడా ఈ రొంపిలోకి దింపారు – చివరికి అంతా కలిసి. సిబిఐ వాళ్ళ జాబితా చివర్లో 'ఆ'గుర్తు తెలియని వ్యక్తుల పేర్లలో నాపేరు కూడా కనిపించకుండా ఉండాలంటే తెల్లారేలోపల ఈ ఇంటికి మరమంత్తులు జరిగిపోవాల్సిందే! డబ్బుపోతే మళ్ళీ సంపాదించుకోవచ్చు. ఖాతా పుస్తకాలు, కంప్యూటర్ హార్డ్

డిస్క్‌ల్లో ఎంత తొలిగించినా తిరిగి సమాచారం రాబట్టే సౌకర్యం ఉందంటగా! అందుకే ఈ గోడల్లో పెట్టించి.. భారతి సిమెంట్‌తో గట్టిగా దిమ్మిశ చేయించాలనే నిర్ధమానేసి మరీ మరమ్మత్తులు చేయిస్తుంది. వాస్తు శర్మగారు చెప్పిన 'అకాలగర్జిత దోషాని'కి ఇదొక్కటే ఏకైక నివారణ మంత్రం.

## 10

## 1 పురందరోపనిషత్

పురందర దాసు పూర్వనామం శ్రీనివాస నాయకుడు. వజ్రాలు, రత్నాల, గుర్రాల పెద్దవ్యాపారి. తన భార్య తన వజ్రాల ముక్కుపుడకను దానమిచ్చిన సందర్భంలో దైవభక్తుడుగా మారిపోయిన వాడు పురందరదాసు. విజయనగర సామ్రాజ్య రాజధాని హంపిని చేరి సర్వదాస్తులూ దానధర్మాలు చేసి, పురందరదాసు అనే వ్యవహారనామం పేరుతో వ్యాసతీర్థుల నుంచి హరిదాసు దీక్షను పొంది.. మధుకర వృత్తిద్వారా కుటుంబాన్ని పోషించిన మహానుభావుడు శ్రీనివాస నాయకుడు. దేశంలోని ప్రధాన దేవాలయాలన్నింటిని సందర్శించుకుని వాటిలో కొలువై ఉన్న దైవాలను కొలుస్తూ కీర్తిస్తూ ఆసువుగా పదాలను అల్లిన వాగ్గేయకారులు పురందరదాసు. ఈయనా వేమనలాగా, తాళ్ళపాక అన్నమాచార్యుల వారి లాగా సంఘం మీదా ఒక దృష్టి ఉంచి మూఢాచారాలను, చెడుగులను వ్యంగ్యవైభవంతో చెండాడిన మానవతావాదే. అందుకు ఈ క్రింది పదాల వంటివి ఎన్నెన్నో ఉదాహరణలు:

***మధ్యమావతి రాగంలో అటతాళ గతిలో సాగిన గేయం ఇది.***

అంతా నా కెరుకేనంటారేమి
అవగుణం వీడరేమి ||ప||
ఎప్పుడూ శరణుల కథలను చెబుతూ
తప్పుడు మాటలు ఆడుదరేమి ||అప||
కావిని కట్టి తిరుగుదురేమి.. కామము వీడరేమి
నియమనిష్ఠలు పాటంతురేమి... తామసం వీడరేమి.
తమనే ఎరుగక పరులను తెలియక
శ్వాసపు గుంతలో పడుతారేమి (1)
గురువుల సేవ చేయుదరేమి గురి నిలపరేమి
పరిపరిదేశాల్ తిరుగిననేమి కాపాడువారేరి
ఎరుకువ నొందక ఆగమమెరుగక
నరక కూపములో పడుతారేమి (2)
బ్రహ్మజ్ఞానులు అంటారేమి స్వార్థం వీడరేమి

ఒమ్మికగా యాగం చేయుదురేమి అన్నతం వీడరేమి
గమ్మున పురందర విఠలుని ముందర అ
హము వీడి మ్రొక్కలేదేమి (3)

***(2) పారిస్ పతివ్రత***

డాక్టర్ కరుణశ్రీగా ప్రసిద్ధి చెందిన జంధ్యాల పాపయ్యశాస్త్రిగారిని గురించి తెలియని తెలుగువారుండరు. అమరగాయకులు ఘంటసాల ఆలపించిన ప్రయివేట్ పాటలలోని పుష్పవిలాపము, కుంతీ కుమారి వంటి పాటలకు పదకర్త ఈయనే. కరుణశ్రీ కవితామ తల్లి - లలిత లలితంగా సన్నజాజులు మరువంతో అల్లిన పూలదండను ధరించిన నిండు లలనామణి సౌందర్య శోభను మృదువు మధుర స్మృతులలోకి తీసుకుంటుంది. ఈ కవిగారి మరో వ్యంగ్య కోణాన్ని తెలిపే 'ప్యారిస్ పతివ్రత'నూ మరి చిత్తోల్లాసంగా చిత్తగించదగిందే! విశ్వసంస్కృతులను వీక్షించు కాంక్షతో దేశదేశములను తిరుగాడుతున్న ఓ గొప్పస్వామికి - పరమరమ్యమైన ప్యారిసు నగరంలో ఒక మహాద్భుతం కనిపించిందట.' మగువ మిన్న యొకతె మగని సమాధికి విసనకఱ్ఱ తోడ విసరడమే' ఆ విచిత్ర దృశ్యం!

సంచిలో మంచి మంచి గంధపు పొడి ఇంత తీసి సమాధి చుట్టూ చల్లి చేతిరుమాలుతో మెత్తమెత్తగా ఒత్తుతుండే ఆ నిండు జవ్వనిని చూసి స్వామివారికి పరవశం కలిగిందట "బ్రతికినంతవరకు పతిని సేవించుమా|భారతీయ మహిళ పరమభక్తి|చచ్చి 'గోరి' నడుమ శయనించు మగనికి| సేవచేయుచున్నదేవి వీవు' 'ఇంత భక్తి మాకు విరుగొల్పె. భరతసాధ్వి కంటే పై చెయి నీ చెయి! ఓ పతివ్రతా నీకు నమోస్తు" అని ప్రశంసలకు పూనుకున్నాడు స్వామీజీ.

***అప్పుడు ఆ ప్యారిస్ మోహనాంగి ఏమని బదులిచ్చిందో తెలుసాండీ!***

"గౌరవమ్ముకాదు, కుతూహలము కాదు| భక్తి కాదు, ప్రణయ రక్తికాదు|
మరణ శయ్యమీద మగడు రమ్మని నన్ను |చేతిలోన చేయి చేర్చి పలికె|
'ఏను పోయినంత ఇంకొక్క మగవాని| నీవు పెండ్లి యౌట నిశ్చయంబు|
పడతి! నా సమాధి తడియారు వరకైన | ఆగు మీవు పెండ్లియాడకుండ|
అంచు కనుల నీరు నించు భర్తకు 'సరే|లే' వంటంచు మాట ఇచ్చినాను|
అతడు చచ్చిపోయె |నార్మములిట పూడ్చి పెటినారు, గోరికట్టినారు|
ఈ సమాధి కష్ట ఏ పాళ్ళు కలిపిరో| ఎట్టి అడుసు పోసి ఏడ్చినారో|
పాడు బేలుదార్లు | ఏది పదిజాములకు కూడ| ఈ సమాధి ఆరదేమి? స్వామి!

ప్రియుడు ఫోను చేసి, ప్రేమ లగ్నము దానె| వేచి వేచి కనులు వాచిపోయె| మగని కౌసగి నట్టి మాట పట్టింపుకై|విసనకర్ర తెచ్చి విసురుచుంటి' - అంచు చేతిగుడ్డ అంచుతో చెక్కిళ్ళు తుడుచుకుంటూ బెంగ పడ్డదిట, పాపం, ఆ ప్యారిస్ పతివ్రత! - స్వామీజీ షాక్!

***(3) ఆగతాంబూలం***

చమత్కారాలు చెప్పుకునేటప్పుడు చరిత్ర పట్టించుకోకూడదు. దండీ, కాళిదాసు సమకాలీనులు కాకపోయినా వారిద్దరిని కలిపి చెప్పిన ఒక తమాషా కథ ఈ మధ్య నేను చదివాను మల్లాది హనుమంతరావుగారి 'చమత్కార శ్లోక మంజరి'లో. దాని సంక్షిప్త నకలు రూపమే ఇది పాఠకుల మనోహ్లాదం కోసం అందిస్తున్నాను.

కాళిదాసూ, దండీ ఓ రోజు సాహిత్య గోష్ఠి నిర్వహించుకుంటూ అలా వీధిలోకి నడిచి వెళుతున్నారుట. ఒక దుకాణం ముందు తాంబూల సేవనం కోసం ఆగారు. దండిగారికి సున్నం కావాలి. కాళిదాసుగారికి ఆకులు కావాలి. దుకాణంలోని పడుచుపిల్లతో దండే

ముందు మాట కలిపారు. తూర్ణమానీయతాం చూర్ణం పూర్ణ చంద్ర నిభాననే' - త్వరగా సున్నం ఇప్పించమ్మా .. ఓ పూర్ణ చంద్రుడివంటి మోముగల చిన్నదానా!'

కాళిదాసు కూడా తమలపాకులు కోరుతూ పద్యం పూర్తిచేశారు.

'పర్ణాని స్వర్ణ వర్ణాని, కర్ణాంత కర్ణలోచనే' - చెవులవరకూ వ్యాపించిన విశాలనేత్రాలు గల సుందరీ! బంగారు వన్నెగల తమలపాకులు కూడా ఆ చేత్తో ఇప్పించు'-

ఆ చిన్నది ముందు కాళిదాసుకే ఆకులు అందించడంతో దండి మొగం చిన్నబోయింది. 'ముందు అడిగింది నేను. నీవూ ఈ ధారానగరాధీశ్వరుడు బోడిరాజులాగా కాళిదాసు పక్షపాతిలాగా ఉన్నావే? ఆయనే మిన్నా నాకన్నా ఎక్కువ ప్రతిభావంతుడనుకున్నావా?' అని నిలదీసిన మహాకవికి ఆ చిన్నది అంత దీటుగా ఇచ్చిన సమాధానంలోనే ఉన్నది చమత్కారమంతా వినండి! 'అయ్యా! దుకాణంలో సరుకులు అమ్ముకునే దాన్ని.. నాకు కవిత్వాలూ, ప్రతిభలు ఎలా అర్థమవుతాయి.. చెప్పండి! నా చిన్ని బుర్రకి కాళిదాసుగారు శ్లోకంలోని 'పర్ణాని, స్వర్ణ వర్ణాని, కర్ణాంతకీర్ణ లోచన్ 'లోని అయిదు 'ణ'లే వినిపించాయి. మీ శ్లోకం, తూర్ణం అనీయతాం చూర్ణం పూర్ణ చంద్ర నిభాననే'లో మూడు 'ణ'లే ఉన్నాయి. మూడణాలకన్నా అయిదణాలు ఎక్కువ కాబట్టి పెద్దబేరం ముందు ముగించాను స్వామీ!

నిజానికి ఆ సరుకులమ్ముకునే అమ్మాయీ మంచి సరసురాలే.

కాళిదాసు మీదున్న విశేషాభిమానాన్ని తన జాణతనంతో ఎలా సర్దిచెప్పిందో.. చూసారా! చమత్కారానికి ఎంతవారలైనా దాసులవాల్సిందేకదా!

***(4)కవిబ్రహ్మలు***

బ్రహ్మసృష్టికంటె కవి బ్రహ్మ సృష్టి విశిష్టమైనది కాకపోయినా విఖ్యాతమైనదే. మేనక మహాతల్లి ఎంతమందిని కన్నదో. ఎంతమందిని పారవేసిందో.. వారి పేర్లైనా మనకు తెలియవు కానీ శకుంతల శాశ్వత కీర్తికి కాళిదాసు సృజన శక్తే కారణం కదా!

శకుంతల కనీసం ఒక అమ్మ కన్న బిడ్డ. కవిబ్రహ్మలైన వాళ్ళు తల్లిగర్భంతో నిమిత్తంలేకుండా.. తమ మస్తిష్కంలో నుంచి పుట్టిన వారికి సయితం శకుంతలను మించి పేరు ప్రఖ్యాతలు తెప్పించి పెడుతుంటారు.

కానన్ డాయిల్ బుర్రలో నుంచి పుట్టిన పత్తేదార్ (డిటెక్టివ్) షెర్లాక్ ఉన్న పేరు నిజమైన ఏ పత్తేదారుకూ లేవు. లండన్ బేకర్ స్ట్రీట్‌లో షెర్లాక్ హోమ్స్ నివాసమని డాయిల్ వ్రాశాడు. షెర్లాక్ అభిమానులు తమ ఆరాధ్య దేవుడి సందర్శనం కోసం తీర్థయాత్రికులకు మల్లే రావడం పెరిగిపోవటంతో లండన్ ప్రభుత్వం వారు వారికి ఆశాభంగం కలిగించకుండా ఒక హోమ్స్ క్లబ్‌ని భారీ ఎత్తున ప్రారంభించాల్సి వచ్చింది.

అలాంటి క్లబ్ తరహాలోనే జనీవా దగ్గరా ఇంకో షెర్లాక్ హోమ్స్ స్మారక చిహ్నం వెలిసిందిట కానీ ఎందుకో దానికి తగినంత ప్రచారం లభించలేదు. ఒక అర్థరాత్రి ఒక దొంగ దూరి అందులోని ఖరీదైన వస్తువులను దొంగిలించే ప్రయత్నంలో పట్టుబడి వార్తలకెక్కడంతో షెర్లాక్ హోమ్స్ ఉనికి మళ్ళీ లోకానికి గుర్తుచేసినట్లయిందట.

దొంగలను తెలివిగా పట్టుకునే షెర్లాక్ హోమ్స్‌ని చివరికి ఒక దొంగ వెధవ తిరిగి ప్రాభవంలోకి తీసుకురావడం.. విధి రాసే సృష్టినాటకంలోని ఒక సెటైరికల్ ఎలిమెంట్‌ని ఎలివేట్ చేయటంలేదూ!

వ్యంగ్యమా.. మజాకా! నాటి వాల్మీకి రామాయణం నుంచీ .. నేటి కన్యాశుల్కం దాకా.. వ్యంగ్యవైభవం కల్పించిన శాశ్వతత్వానికి ఎన్నో ఉదాహరణలు చెప్పుకోవచ్చు. సమయం సందర్భం వచ్చినప్పుడల్లా వాటిని తలచుకుంటూనే ఉందాం. ప్రస్తుతానికి స్వస్తి.

## *11*

***1.గ్రహాంతరవాసి శవం:*** ఓ అంతరిక్ష నౌకలాంటిది తన ఇంటిముందు కూలిపోయిందని, ఆ దుర్ఘటనలో ప్రాణాలు పోయిన ఓ గ్రహాంతర వాసి మృతదేహం తనకు లభ్యమయిందని రష్యాకు చెందిన ఒక మహిళ (పేరు - మార్తాయె గొరోవ్నమ్) నేరుగా శాస్త్రవేత్తలకే సమాచారం అందించింది, రెండేళ్ళ క్రిందట. తన ఇంటికి కొద్ది దూరంలో పేద్ద పిలుడు శబ్దం వినిపించిందని.. దగ్గరకు వెళ్ళి చూసేసరికి మంటల్లో కాలిపోతున్న శిథిలాలు ... లోహపు ముక్కలు.. పక్కనే అంతరిక్ష దుస్తులు ధరించిన గ్రహాంతర వాసి మృతదేహం కనిపించాయని ఆమె నమ్మశక్యంగా చెబుతున్నారు. అప్పుడు ఇంటికి తీసుకువెళ్ళి ప్లాస్టిక్ కవర్లో భద్రంగా చుట్టి రిఫ్రిజిరేటర్ - డీప్ ఫ్రీజర్‌లో దాచిపెట్టిన ఆ మృతశరీరాన్ని ఇప్పుడు చూపిస్తోంది.

నమ్మాలా? వద్దా?

***2. దేవుడు చేసిన సాయం:*** సకలాధీశ పట్టభద్రుడవు, భిక్షగామి, వత్యంత శాం
త కలాత్ముండవు, రౌద్రమూర్తి, సతి సౌందర్యాంబికా సంగమా
ధిక లోలుండవు, దివ్యయోగివి, మదిందెల్లంబుగా నెట్టివా
రికి దాశక్యమై నీ నిజంబెరిగి వర్ణంపంగ సర్వేశ్వరా!

ఇది సర్వేశ్వర శతకంలోని ఒక పద్యం. కర్త యథావాక్కుల అన్నమయ్య శైవకవి - 13 వ శతాబ్దం ప్రాంతంలో రాయబడిందీ స్తోత్రం. ఆరాధ్య సోమేశ్వరుడు ఆయన గురువు. స్వగ్రామం గోదావరి తీరంలోని 'పట్టిస'. శ్రీశైలం తీర్థయాత్రకని వెళ్ళి తిరుగు ప్రయాణంలో పల్నాడు తాలూకా జెట్టిపాలెం దాపున ఉన్న 'సత్రశాల' అనే చోట స్థిరపడ్డాడని ఆరుద్రగారి సమగ్రాంధ్ర సాహిత్యం (మొదటి సంపుటి పుట 281) ఆధారంగా చెప్పుకోవచ్చు. ఈయన గారిని గురించి ఒక చిత్రమైన కథ ప్రచారంలో ఉంది. అందుకే ఇక్కడ చెప్పుకోవడం.

కృష్ణాతీరంలో స్థిరపడినాక తన మెడకొక గండకత్తెర తగిలించుకుని ఒక్కొక్క తాటాకు మీద ఒక్కొక్క పద్యం చొప్పున సర్వేశర శతకం వ్రాయడానికి పూనుకున్నాడుట. వ్రాసిన ప్రతి పద్యం 'కృష్ణార్పణం' చేసేవాడుట. ఏటికి ఎదురీది ఆ తాటాకు తిరిగి తన దగ్గరకు చేరుకుంటేనే దాన్ని అందుకుని తాటికి గుచ్చేవాడుట. ఏ ఒక్క పద్యమైనా తిరిగిరాకపోతే మెడకు తగిలించుకున్న గండ కత్తెరతో శిరస్సు ఛేదించుకుంటానని శపథం. ఒక పద్యం ఎదురీత మర్చిపోయింది కాబోలు దారి తప్పి ఎటో కొట్టుకుపోయింది. తన పద్యం దారి తప్పినా.. తాను మాటతప్పని వాడు కాబట్టి కంఠం కత్తిరించుకుంటానని కూర్చున్నాడు. సమయానికి ఒక పశువుల కాపరి అటుగా వచ్చి 'ఏట్లో కొట్టుకు పోతూ ఈ తాటాకు దొరికింది' అంటూ ఆ పద్యం ఉన్న తాళ పత్రం ఇచ్చిపోయాడుట. తీరా చూస్తే అది అన్నమయ్య

కూర్చిన కూర్పులో మార్పులు చేర్పులు చేస్తున్న పద్యం దానిచివర సర్వేశ్వరా! అని ముక్కుటం ఉండడంతో అది సాక్షాత్తు అన్నమయ్య ఆరాధించే సర్వేశ్వరుడే పశువుల కాపరి రూపంలో వచ్చి ఇచ్చి భక్తుడి ప్రాణాలని కాపాడాడని ఒక కథ ప్రచారంలోకి వచ్చేసింది.

కథ బాగుంది కానీ. నమ్మాలా?.. వద్దా?

***3. ఇనుపకచ్చడం:*** ఆస్ట్రియా ఉత్తర భాగంలోని ఒక చర్చికి మరమ్మత్తులు చేస్తున్నారు, 1889వ సంవత్సరంలో. అప్పటి తవ్వకాలాలో బయటపడింది ఒక విచిత్రమైన వస్తువు. కొన్ని రాతి పలకలలు ఎత్తుతుండగా భూగర్భంలో ఒక గొయ్యి కనిపించింది. చచ్చిన కళేబరాన్ని పాతిపెట్టిన పెట్టె అందులో ఉంది. సత్తు రేకుపెట్టె. పైకప్పు పగలకొట్టగానే లోపల చివికి పోయిన చెక్కపలకలు. వాటిని తొలగించి చూస్తే అప్పుడు కనిపించింది మనుష్య శరీర అస్థిపంజరం. అది ఒక స్త్రీది. తల వెంట్రుకలు చక్కగాజడ వేసినట్లు ఉన్నాయి. చక్కని పలువరుస. మంచి యవ్వనంలో ఉండగానే చనిపోయినట్లుంది. ఆ స్త్రీ వంటిమీది బట్టలు తొలిగించి చూడగా, లోపల బోర ఎముకలు, కడుపు, డొక్క కనిపించాయి. నడుము చుట్టూ ఇనుప పట్కా. ఇది నాలుగయిదు ఇనుప ముక్కలు అతికినట్లున్న బెల్టు. ముందు భాగంలో కాలిజోడు సోల్ ఆకారంలో ఒక రేకు ముక్క. తలుపు మూతకు లాగా వేసి తీసుకునే ఏర్పాటు.. దానికి తాళం వేసి ఉన్న వైనం కనిపించాయి.

ఇది చూసి చర్చి అధికారి 'ఇనుప కచ్చడం' అని నిర్ధారణ చేశాడు. తవ్వకాల పని అజమాయిషీ చేస్తున్న 'పాచింజెర్'గారు దానిని ఊడదీయించి భద్రంగా బసకు తెచ్చాడు.

అది ఇప్పటికీ మ్యూనిచ్ నగరంలోని మ్యూజియంలో ఉంది!

తన సొంతమని భావించిన ఆడదానిని వేరేమగవాడు అనుభవించకుండా మరోమగవాడు ఆమె శీలానికి తాళం వేసి చెవిని తన దగ్గరే భద్రంగా ఉంచుకునే దుర్మార్గపు రోజులట అవి.

నమ్మాలా?.. వద్దా?

***ముక్తాయింపు:***

పైన చెప్పిన మూడు కథలు వింతగొలిపేవే.. నమ్మాలా ... వద్దా... అనే సంశయం కలిగించేవి. మొదటి కథలోని రష్యన్ మహిళని మానసిక రోగిగా భావించకపోతే..

రెండో కథలోని వింతను సాహిత్య కల్పన అని తెలిసీ ఆస్వాదించలేకపోతే..

మూడో కథలోని సమాచారం నమ్మదగ్గదే అని తెలిసిన తరువాత మగవాడి దుర్మార్గం మీద జుగుప్స కలగకపోతే.. నిజంగా మనలోనే ఏదో లోపం ఉన్నట్లు లెక్క. అందుకే ఇవిక్కడ ఇచ్చింది.

12

# పునాదిరాళ్ళ ప్రార్థన

**క్రీ.శ 3011**

హాట్ జూపిటర్ నుండి అరగంట క్రిందట బైలుదేరిన సూపర్‌సానిక్ రాంజెట్ "గో ఇండా" (గోవిందాకి గో ఇండియాకి సరిసమానమైన పదం) భూ కక్ష్యలోకి ప్రవేశించి అదే పనిగా గిరిటీలు కొడుతోంది. చిన్నపిల్లలు ఆడుకునే టాయ్ వెరో ప్లేన్ రిమోట్ కంట్రోలుతో తిరుగుతున్నట్లుంది ఆ దృశ్యం.

గోఇండా నుండి చూస్తుంటే భూమండలం మొత్తం ఒక మండే పెద్ద బంతిలాగా ఉంది.

స్పేస్ సెంటర్నుంచీ గ్రీన్ సిగ్నల్ రాగానే రాంజెట్‌లోని యువశాస్త్రవేత్తలిద్దరూ మాస్కులని మరోసారి సర్దుకుని, స్కామ్ జెట్ సాయంతో సూటిగా భూమి వైపుకు దూసుకు రావడం మొదలు పెట్టారు.

పొట్టిగా, పాత సినిమాల్లో రామచంద్రరావు లాగా ఉన్న వాడిపేరు మొగానో, పొడుగ్గా రమణారెడ్డి లాగా పొట్లకాయ బొమ్మను గ్రాఫిక్సులో సాగతీసినట్లున్న వాడిపేరు తనకో. వాళ్ళిద్దరు ఇంటర్ యూనివర్సల్ స్పేస్ యూనివర్సిటీలో రీసెర్చి సూడెంట్లు.

స్కాంజెట్‌నీ, రాంజెట్‌నీ రిమోట్ ద్వారా కంట్రోల్ చేస్తూ హాట్ జూపిటర్ స్పేస్ సెంటర్‌లో కూర్చుని ఆపరేషన్ డిస్కవర్ ఇండియా సూపర్‌వైజ్ చేస్తున్నాయన పేరు కబిల్. అతను ఆ ప్రాజెక్టు గైడ్ ప్రకాష్ రాజ్‌లా ఉన్నాడు.

కబిల్ ముత్తాతలు కొన్ని వేల ఏళ్ళ క్రిందట భూమ్మీద జీవించినవారు. ఐదొందల ఏళ్ళ క్రిందట భూమ్మీద జనాభా పట్టనంతగా ఎక్కువై పోయి, వనరులు హరించుకుపోయి జీవం మనుగడకే ముప్పు ముంచుకొచ్చిన వేళ గగనాంతర రోదసిలోని వేరే గ్రహాలకు వలసపోయింది మెజారిటీ మానవజాతి. కబిల్ ముత్తాతలు అలా సూర్యకుంటుంబంలోని గురు గ్రహానికి చేరినవారే.

ప్రకృతి వికృతిగా మారి, దారుణ దుష్పరిమాణాల కారణంగా – మిగిలిన జీవజాతులన్నీ క్రమక్రమంగా నశిస్తూ పోగా, ప్రస్తుతం భూమి ఒక మరుభూమిని తలపిస్తోంది. అడవులు అదృశ్యమయాయి. నీరు పాతాళంలోకి ఇంకిపోయింది. ఆక్సిజన్ కరువై బొగ్గుపులుసు వాయువుతో పూర్తిగా నిండిపోయిన భూమి మీదకు మొగానో, తనాకో ఎందుకొస్తున్నట్లు?!

తమ సౌరవ్యవస్థను బోలిన మరెన్నో గ్రహకుటుంబాలను వెదికి పట్టుకుని, పరిశోధించి, థీసిస్ సబ్‌మిట్ చేయడం 'ఆపరేషన్ డిస్కవర్ ఇండియా' లక్ష్యం. ప్రాజెక్టులో భాగంగా కబిల్ గైడెన్స్‌లో గగనాంతర రోదసీలో ప్రయాణిస్తూ ఇప్పటికే ఎన్నో పాలపుంతలను,

నక్షత్రాలను, గ్రహాలను, పరిశీలిస్తూ, గెలాక్సీలను గాలిస్తూ చివరి అంచెగా భూగ్రహం మీదకి దిగుతున్నారు ఇప్పుడు ఆ యువ శాస్త్రవేత్తలిద్దరూ.

భూతలమ్మీది వాతావరణం మాత్రం భయానకంగా ఉంది. సెగలు కక్కే పెను తుఫాను గాలులు ఎడాపెడా గొడుతున్నాయి. కనుచూపు మేరంతా ఇసుక ఎడారుల్లాగా ఇసుక దిబ్బలే.

ఓజోన్ పొర చిరిగిపోయి సూర్యకిరణాలు నేరుగా భూమిని తాకుతుండటం వల్ల జీవజాతులన్నీ ఏనాడో నశించాయి.

ఇంత జీర్ణావస్థలో ఉన్న భూమి మీదకు బాసు ఎందుకు దిగమంటున్నాడో యువకులిద్దరికీ అంతుపట్టడం లేదు.

స్కామ్ జెట్ నేలమీదకు లాండయిన తరువాత విద్యార్థులిద్దరికీ గైడ్ కబిల్ కమాండ్స్ స్పేస్ విండో నుండి వినబడుతున్నాయి.

"కంగ్రాట్స్! వేలాది ఏళ్ళ క్రిందట రోదసీ మండలం మొత్తంలో మహా నాగరికతలు వెల్లి విరిసిన పుణ్యభూమి మీద మీరు ఇప్పుడు పాదం పెట్టారు"

కబిల్ హృదయంలో మాతృ గ్రహం మీది భక్తి ఎంతలా పొంగిపొర్లుతోందో అతని గొంతులోని ఉద్వేగాన్ని బట్టే గమనించారు శిష్యులిద్దరూ. గురుదక్షిణగా ఇక్కడి నుంచీ ఏదైనా తీసుకెళ్ళి సమర్పిస్తే డాక్టరేట్ ఖాయమని ఇట్టే అర్థమయిపోయింది.

కబిల్ గొంతు గంభీరంగా వినపడుతోంది. "ఆ రోజుల్లో అమెరికా అగ్రరాజ్యంగా ఉండేది. అన్నింటిలో అదే ముందుండేది. వాళ్ళు గర్వంగా కట్టుకున్న స్టాట్యూ ఆఫ్ లిబర్టీని ఫోటో తియ్యండి!"

కెమేరాని బాస్ చెప్పిన డైరక్షన్ వైపు ఫోకస్ చేసి చూసాడు తనాకో. అక్కడ మట్టి దిబ్బలు తప్ప ఏమీ కనిపించలేదు. 'అల్‌ఖైదా వాళ్ళు ఆ అమెరికా నెప్పుడో సర్వనాశనం చేసేసారు. దాని నామరూపాలు కూడా మీకు కనిపించవిప్పుడు" అన్నారెవరో. ఆగొంతు వినిపించిన వైపు చూస్తే అక్కడెవరూ కనిపించలేదు! అదే విషయం తిరిగి బాస్‌కి చేరవేశాడు తనాకో.

" పోనీ సోవియట్ సోషలిష్ట్ రిపబ్లిక్ పేరుతో ఒక వెలుగు వెలిగి.. చివరికి రష్యాలాగా మిగిలిపోయిన దేశాల గుంపు వంక ఒకసారి మీ కెమేరా తిప్పండి! అట్టడుగు మనిషి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు నిర్మాణ రూపం రెడ్ స్క్వేర్. షంటిట్!" కబిల్ కమాండ్

కెమేరా పొజిషన్ మారింది. సేమసీన్. మట్టి దిబ్బలే మట్టి దిబ్బలు. "వాళ్ళ ప్రభుత్వాలను వాళ్ళే కూల్చుకున్నారు. ముక్కలు చెక్కలయినా చివరికి ఒక చెక్కా మిగల్లేదు" అంది మళ్ళీ ఇందాకటి గొంతే. జీవి మాత్రం కనిపించలేదు!

శిష్యులద్వారా సమాచారం విన్న కబిల్ అన్నాడు లండన్ టెన్‌డౌన్‌లో ఉద్దండ పిండాలుండే వాళ్ళారోజుల్లో. వాళ్ళ పాలనలో ప్రపంచం మొత్తంలో సూర్యుడు అస్తమించడానికే చోటుండేది కాదంటారు. ఆ సామ్రాజ్యపు మహారాజులు రాణులు నివాసమున్న ఆ వీధిని కెమేరాకి ఎక్కించండి!" తనాకో కెమేరా అటు తిరక్కముందే అందుకుంది ఇందాకటి గొంతే "నోయూజ్! ఆ సూర్యడస్తమించని మహా సామ్రాజ్యం తరువాత్తరువాత - అమెరికా వారి తోక దేశంలాగా తయారైంది. ఆల్‌ఖైదా దెబ్బకి అదీ మాడి మసైపోయింది!"

ఓన్లీ వాయిస్. నో జీవి!

"బొట్టు పెట్టుకునేటంత చిన్నిదేశమైనా అమెరికాని గడగడలాడించిన జపాను దేశం నాగరికత మహా ఘనమైనది. నాటి మానవుడు సాంకేతికంగా ఎంత అభివృద్ధి పథాన్నందుకున్నాడో ఒక్క జపాన్ హిస్టరీ తెలుసుకుంటే చాలు. వాళ్ళ విసిన కర్ర ఈక కనపడినా చాలు. ఒక ఫోటో పట్టుకోండి" అన్నాడు కబిల్ నిరాశను గొంతులో కనిపించనీయకుండా.

"అణుధార్మిక శక్తితో దానికదే మసయిపోయింది" అంది ఆకాశవాణి ఒక్క ముక్కలో.

"ఫ్యాషన్ ప్రపంచానికి నేర్పించిన ఫ్రాన్స్.." - కబిల్ గొంతు.

"ఎయిడ్స్ మహమ్మారి ఎప్పుడో ఆ శృంగార దేశాన్ని కబళింపచేసింది" అశరీరవాణి గొంతు.

"క్యూబా.." - కబిల్ గొంతులో వణుకు.

"ప్లేగు వ్యాధికి ఫినిష్" అశరీర వాణి వంతు.

"ఆఫ్ఘనిస్తాన్. పాకిస్తాన్. ఉజ్ బెకిస్తాన్." కబిల్ పాఠంలా దేశాల పేర్లు వప్పచెప్పేస్తున్నాడు.

"అవన్నీ తాలిబన్లకి స్థావరాల్లాగా మారిపోయిన పిదప చరిత్రలో స్థానం లేకుండా పోయాయి. ఆఫ్రికన్ జంగిల్సుని కార్చిచ్చు, ఆస్ట్రేలియా ఖండాన్ని ఎల్లో ఫీవరు. ఒక్క ముక్కలో మీకు అర్థమయేట్లు చెప్పాలంటే తుఫాన్లూ, భూకంపాలూ, సునామీలు, కరువులూ, వరదలూ, యుద్ధాలూ రోగాలూ.. అన్నీ అన్నింటినీ నామరూపాల్లే కుండా సర్వనాశనం చేసి పారేసాయి. అడుగూ బొడుగూ ఏమన్నా మింగిలి ఉన్నా రాజకీయాలు వాటినీ కాజేసాయి. చివరికి ఇప్పుడు మిగిలింది. ఇదిగో మీరు చూస్తున్నారే ఈ మట్టి దిబ్బలే!" - అశరీర వాణి ఆపకుండా చేసే ఆ అనవసర ప్రసంగానికి యువశాస్త్రవేత్తలిద్దరికీ తెగ వళ్ళు మండిపోయింది.

గురువుగారికి దక్షిణగా ఏదన్నా పట్టుకుని పోదామంటే.. వీడెవడు.. ప్రతిదానికీ పిలవా పెట్టకుండా కల్పించుకుని.. 'అంతా బూడిదయింది. మసయింది. నాశనమయింది. మునిగిపోయింది' - 'అంటూ అపశకునాలు తప్ప పలకడంలేదు. 'రెండు వాయిద్దామంటే వాయిస్సేగాని మనిషి ఎదురుగా కనిపించటం లేదాయ! తమకు డాక్టరేట్ రాకుండా తోటి విద్యార్థులు చేస్తున్న కుట్ర కాదుగదా ఇది!" కడుపులోని మంటను కడుపులోనే ఉంచుకుని ఏం ప్రయోజనం! కనపడ్డా.. కనపడకపోయినా ముందు కడిగిపారేయడం ఉత్తమం. తనాకో ఇంక తమాయించుకోలేక పెద్ద గొంతుకతో అరిచాడు" ఇందాకట్నుంచీ చూస్తున్నాం. ఏది చూద్దామన్నా లేదు పొమ్మంటున్నావు. ప్రకృతి భీభత్సానికి అంతా బూడిదయిపోతే మరి నువ్వెలా ఉన్నావు మహానుభావా!"

"ఇంతకీ నువ్వెవరివి? మొనగాడివైతే మాముందుకురా!" అని వంతపాటందుకున్నాడు మొగానో.

బిగ్గరగా నవ్వు వినిపించింది. ఆ నవ్వుకు భూమి కనిపించింది. "మీరు నిలబడ్డ చోటులోనే క్రిందవున్నాను. గొయ్యి తీసి చూడండి. నా దివ్య దర్శనం అవుతుంది" అందా గొంతు వింతగా మరోసారి విరగబడి నవ్వుతూ.

మొగానో గబగబా గొయ్యి తీయడం మొదలుపెట్టాడు. రెండడుగులు కూడా తవ్వకుండానే బైటపడిందా గొంతు తాలూకు వింత ఆకారం.

నిట్టనిలువుగా ఉంది నల్లగా నిగనిగ మెరిసిపోతుంది. వంటిమీదంతా ఏవో గాట్లు.. పైనుంచీ క్రింద దాకా..! ఇలాంటి ఆకారాన్ని ఆ గ్రహాంతరవాసులు ఇంతవరకూ రోదసీ మొత్తంలో ఎక్కడా చూసి ఉండలేదు. ప్రళయం మొచ్చి భూమ్మీదున్న సర్వజీవాలు దుంపనాశనమయినా చెక్కు చెదరకుండా నిట్టనిలువుగా తాజాగా కళకళలాడుతూ కనిపిస్తున్న ఆ ఆకారాన్ని చూడగానే నిజం చెప్పద్దూ. యువశాస్త్రవేత్తలిద్దరికి ఒకింత గౌరవం కూడా కలిగింది. సాధ్యమైనంత వినయంగా తమ మనస్సులోని సందేహాన్ని బైటపెట్టేరు కూడా.

"ఇంతకీ తమరెవరో సెలవిచ్చారు కాదు సార్!" అనడిగాడు తనాకో. ఆ ఆకారం చెప్పడం మొదలు పెట్టింది" పునాది రాయి అంటారు నన్ను. వెయ్యేళ్ళ క్రిందట ఇక్కడ ప్రజాస్వామ్యమనే పరిపాలనా విధానం ఒకటి వర్థిల్లింది. ప్రజాస్వామ్య మంటే ప్రజలే రాజులు. ప్రజల కొరకు, ప్రజల వలన, ప్రజలచేత నడిచే పాలన. మరీ లోతుగా వెళ్ళద్దులే. మీరొచ్చిన పనికూడా ఏంటో మర్చిపోయి తిరిగి వెళ్ళటానికి తిప్పలు పడతారు. అంత తికమకగా ఉంటుందా ఆ రాజకీయ వ్యవహారం. ప్రజాస్వామ్యమంటే ప్రజలూ.. వారెన్నుకునే నాయకులు వాళ్ళు పాలించే ప్రజలు.. ఈ మాత్రం అర్థం చేసుకోండి చాలు ప్రస్తుతానికి ఇంకనేనెవరో చెబుతాను. వినండి!. ఎన్నికల్లో నిలబడి గెలవడానికి నాయకులు కావాలనుకునేవాళ్ళు ఎన్నికల ముందు కొన్ని వాగ్దానాలు చేస్తారు. ప్రాజెక్టు కట్టిస్తామని, బళ్ళు పెట్టిస్తామని ఫ్యాక్టరీలు నిర్మిస్తామని .. ఇట్లా! వాళ్ళు వాగ్దానం చేసినంత మాత్రాన జనం నమ్మాలని ఏముంది? వాళ్ళకి నమ్మకం కలిగించడానికి నాయకులు 'ఇదిగో.. ఇవాళే.. ఇక్కడ. మీరు భవిష్యత్తులో కట్టబోయే భారీ నిర్మాణానికి నాందిగా పునాదిలో రాయివేస్తున్నాం' అంటూ బ్రహ్మాండంగా ఊరేగింపు గట్రా జరిపి పటాటోపంగా మమ్మల్ని పాతేస్తారన్నమాట. మమ్మల్ని చూసి నమ్మిన జనం వాళ్ళకు ఎన్నికల్లో ఓటేస్తే.. గెలిచి నాయకులు అయిపోయి. వాళ్ళు చేయాలనుకున్న పనులన్నీ మళ్ళీ ఎన్నికలొచ్చేలోగా సుబ్బరంగా చేసుకుంటారన్నమాట"

"ఒక్క నిమిషం పునాది రాయీ! చిన్న సందేహం. మరి వాగ్దానం చేసినట్లు నాయకులు నిర్మాణాలు ఎన్నికలయిన తరువాత పూర్తి చేస్తారుగదా! అయినా మీరింకా ఇలాగే పునాదిలో శిలావిగ్రహాల్లా అల్లాడుతున్నారే!"

పకపకా నవ్వింది పునాది రాయి. "మరదే ప్రజాస్వామ్యమంటే సరే ఇందాకట్నుంచీ ఏదీ కనిపించటం లేదని అల్లడుతున్నారు కదా! అమెరికా, రష్యా, చైనా జవానంటూ ఎన్నడో అంతరించి పోయినవాటిని గురించి వెదుక్కుంటున్నారు కదా! వృధాగా వాటికోసం మీ సమయం పాడు చేసుకోకుండా.. నన్నూ, నా సోదురలనూ.. ఫోటో తీసి పట్టుకుపోండి! అంత దూరం నుండి వచ్చినందుకు ఈ మాత్రమన్నా దక్కినందుకు సంతోషించండి"

"నువ్వేకాక నీకు సోదరులు ఇంకా ఉన్నారా! సజీవంగా నీలాగే ఉన్నారా?" అనడిగాడు తనాకో నోరెళ్ళబెట్టి.

"ఎందుకు లేరు! వందలొందలు. మీ కెమేరాలు ఆన్ చేయండి. వరసగా పరిచయం చేస్తాను. ఫ్లాష్ చేసుకోండి! అదిగో అది బ్రహ్మణి సిమెంటు ఫ్యాక్టరీ తాలుకు పునాది రాయి. ఇదిగో ఇది పోలవరం అనే నీటి ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి వేసిన పునాది రాయి. అల్లదిగో ఆ మూల ఉన్నది హంద్రు-నీవా సుజల స్రవంతి పునాది రాయి. ఇల్లిదిగో ఈ మూల ఉన్నది అప్పట్లో హైదరాబాదనే ఆంధ్రప్రదేశ్ రాజధాని. ట్రాఫిక్ సమస్యకు పరిష్కారంగా ప్రారంభించిన మెట్రో రైలు ప్రాజెక్టు పునాదిరాయి. ఇది సిద్ధిపేట స్పోర్ట్స్ స్టేడియం పునాది రాయి. ఇది పటాన్ చెరువులో వెయ్యి పడకులాసుపత్రికి అప్పటి ముఖ్యమంత్రి వేసిన పునాది రాయి. ఇది బడాయి గడ్డలో లోకాజ్ వంతెన తాలుకు పునాదిరాయి. ఇదిగో పుణ్యవరంలో బ్రిడ్జి నిర్మాణానికి వేసిన రాయి. ఇలా మీరు ఎక్కడ తవ్వి తీసినా చక్కని పునాదిరాళ్ళు అనాదిగా అనాధల్లా పడివుండి కనిపిస్తాయి. ఎన్ని ప్రభుత్వాలు మారినా ప్రగతి లేదు. మాగతి మారలేదు. మరి ఫోటోలను తీసి మీరు ప్రాజెక్టు పూర్తి చేస్తే మీరు కోరుకున్న పట్టా గ్యారంటీ!"

కెమేరాలో తళతళలాడుతున్న ఆ పునాదిరాళ్ళన్నింటినీ గబగబా ఫోటోలు తీసుకుని ఆనందంగా మళ్ళీ అంతరిక్షంలోకి ఎగిరే ముందు మొగానా, తనాకో కృతజ్ఞతా పూర్వకంగా అన్నారు "మీ రుణం ఎన్ని జన్మలెత్తినా తీర్చుకోలేం"

"తీర్చుకోవచ్చు ఈ జన్మలోనే. మమ్మల్నిలా నిలువునా పాతేసి వెళ్ళిపోయిన పెద్ద మనుషులు మీరు వెళ్ళేదారిలో ఏ నరకంలోనో, పాతాళలోకంలోనో కనిపిస్తారు. పెద్ద మనసు చేసుకుని వచ్చి కనీసం ఒక్క ప్రాజెక్టునైనా ప్రారంభించి మాకు ముక్తి కలిగించమని మా తరుపున విన్నవించండి" అంది ఆ పునాదిరాళ్ళ సంఘం ప్రధాన కార్యదర్శి.

**( ఇదీ ఇవాల్టి ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న పథకాల హామీల దుస్థితి )**

*13*

## ప్రేమపార్టీ జిందాబాద్

**"ప్రేమే దైవం.. యువతే లక్ష్యం!"**

"ఇదివరకు సేవే లక్ష్యం అన్నట్లు గుర్తు. "

"అది ముగిసిపోయిన పార్టీ పొట్టికేక్షను బాబాయ్! ఇది ముందుకు దూసుకొస్తోన్న కొత్త పార్టీ నినాదం. ఇది ఆంధ్రప్రదేశ్ 'మార్చు' మాజీ పార్టీ. అది ఉత్తర ప్రదేశ్ మార్కు ప్రేమ పార్టీ. మాథుర్ నాథ్ చౌదరి సాబ్ గుర్తున్నాడా?"

"మర్చిపోదగ్గ మానవుడా! పాఠాలు చెప్పమని ఉద్యోగమిస్తే ప్రేమపాఠాలు చెప్పి ఓ శిష్యురాలిని ఏకంగా పెళ్ళిపీటల మీదకే ఎక్కించేసాడు. అప్పట్లో చాలా ఘన సన్మానాలూ అవీ జరిగినట్లు గుర్తు.. చెప్పుల దండలతో!"

"చెప్పు పడ్డంత మాత్రాన గొప్పతనమేమన్నా తగ్గిపోతుందా? ఆ మాటకొస్తే ఇప్పుడున్న నాయకుల్లో చెప్పుదెబ్బలు తినని వాళ్ళెవరున్నారో!"

"సర్సరే ఇప్పుడా చెప్పుల పురాణమెందుగ్గాని నువ్వు చెప్పాలనుకున్నదేంటో చప్పున చెప్పెయ్యరా నాయనా!"

"మా మాథుర్ చౌదరీ ప్రేమ గురూజీ ప్రేమ పార్టీ పెట్టి 'హృదయం' గుర్తుతో ఎన్నికల బరిలోకి దిగాడిప్పుడు. దడదడలాడించేస్తున్నాడు అలహాబాదు నియోజక వర్గాల్లో తెగతిరుగుతూ.. తెలుసా?"

"ఆహా.. ఎన్నికల జాతర మొదలవగానే ఇట్లాంటి గారడీలు ఎన్నో జరుగుతుంటాయిలే. గారడీలా? ఇన్నాళ్ళ బట్టీ జనాల్ని పట్టించుకోకుండా ఇప్పుడొచ్చి పెద్ద 'ఆహారభద్రత, ఉపాధి హామీ పథకాలంటూ' గారడీలు చేస్తున్న దెవ్వరంట? అవినీతి అంటే మాకొళ్ళు మంటంటూ గంగ వెర్రులెత్తే వాళ్ళు పక్క పార్టీ తిని పారేసిన పళ్ళ తొక్కల్ని కడిగినోట్లో వేసుకోబోవడం 'గారడీ'కాదా బాబాయ్?"

"బాబోయ్! టీవీ చర్చా కార్యక్రమంలో లాగా ఈ భాషేంటిరా బాబూ? సరే. నీ ప్రేమ పార్టీ చేసే ప్రజాసేవేంటో చెప్పుకోనాయనా అదీ వింటాం"

"దేశాన్నిప్పుడు పట్టి పీడిస్తున్న ప్రధాన సమస్యలేంటీ?"

"కూడూ, నీడా.."

"ఒక్క ఓటుతో అన్ని సమస్యల్నీ చిటికెలో మాయం చేస్తుంది మా ప్రేమ పార్టీ. ప్రేమకు ఆకలిదప్పులుండవుగదా! ఇంక ఆహార సమస్యేముంది? రూపాయికి కిలోబియ్యాల్లోంచీ గారడీలు చెయ్యాల్సిన పనే ఉండదు. తాగునీటి కోసం తమిళనాడు, కేరళ తరహాలో తన్నుకుచావడాలసలే ఉండవు. ప్రేమలో పడ్డోళ్ళకి ఎదుటివాడి గుండెల్లో కాస్తంత చోటుంటే చాలనుకుంటారు. ఇందిరమ్మ ఇళ్ళూ.. ఎమ్మార్ కుంభకోణాల్లాంటి వాటికింక చోటేముంది బాబాయ్!

ప్రేమికులకు మన మామూలు భాషతో పనేలేదు బాబాయ్! వాళ్ళదంతా ఒక మూగభాష. భాషల పేరుతో మరాఠీ, కన్నడం వాళ్ళు బెల్గాంలాంటి చోట చేసుకునే ఆగడాలకింక ఆస్కారమే ఉండదు. ప్రేమ త్యాగాన్ని తప్ప మరేదీ కోరుకోదు. కొడుకులకీ, కూతుళ్ళకీ కూడబెట్టి ఇవ్వాలనీ, తాము పోయిన తర్వాత తమ సంతానమే దేశాన్నంతా ఏలుకోవాలని తాపత్రయాలు పడటం వల్లనే కదా ఇప్పుడీ జరుగుతున్న కుంభకోణాలు, కుమ్మలాటలూ, వెన్నుపోట్లూ, వెన్న రాయడాలూ. ప్రేమికుల సంఖ్యను పెంచి పారేస్తే 'కావాలి..కావాలి' అనే గోల మానేసి 'ఇవ్వాలి..ఇవాలి' అనే కొత్త నినాదం మొదలవుతుంది. ఇప్పుడు జరుగుతున్న ఈ హక్కుల పోరాటాలన్నీ అప్పుడు చప్పున మూతబడతాయి."

"కన్యాశుల్కం గిరీశంగాడి ఉపన్యాసంలాగుందిరా నీ వాగుడు. ఇన్నిన్ని వార్తాపత్రికలు చదువుతుంటానూ.. నన్నే గందరగోళంలో పడేసేటట్లుందే నీ తర్కం. ఇంక మామూలు ఓటరు మాయలో పడితే ఏంకాను? మాయావతి, రాహుల్ గతి, అఖిలేష్ బాబు, కమలనాబుల డాబు.. అందరి పనీ అధోగతేనా.. మీ మాధుర్ నాథ్ ప్రేమపార్టీ పెద్ద మాయలమరాఠీ ముఠాలాగుందే! ప్రేమతో పార్టీ ఏందిరా!"

"ఏళ్ళబట్టి బూర్జువా పార్టీల తత్వం వంటబట్టిన నీ బోటి వాళ్ళకి ప్రేమంటే మందులో కాస్త చేదుమందులాగే ఉంటుంది కానీ.. బాబాయ్. నిజానికి జనాలకి కలిగే ప్రయోజనాలు మా పార్టీవల్ల ఇంక చాలా చాలా చాలా ఉన్నాయ్"

"అదెలా బాబూ?"

"ఇప్పుడు నడుస్తున్నవన్నీ కులరాజకీయాలేనా కాదా? మతప్రాతిపదిక మీద మంత్రాంగం నడిపించటం మన నేతలు ఎప్పుడో మర్చిపోయారు. ప్రేమజీవులకి కులమతాలతో అసలు సంబంధమే ఉండదు. దేశ పురోగతికి అందుకే మా ప్రేమ పార్టీని మించిన దిక్కులేదు ఏమంటావ్?"

"ఏమనమంటావ్? నీ దూకుడుకి నా మైండ్ బ్లాకయిపోయినట్లుందిరా భడవా.. ముందు కాస్త నన్ను తేరుకోనీయరా.. పుణ్యముంటుంది."

"ఆ దూకుడు లేకే అన్నాహజారే జీ అన్ని తిప్పలు పడుతున్నాడు. లోక్‌పాల్ బిల్లుని పట్టుకుని పార్లమెంటు వెంటబడేకన్నా.. అదీ మా మాధుర్ నాథ్ కన్నా ముందే ఏ ప్రేమ పంథానో పట్టుకుని యువతలోకెళ్ళి ఉంటే ఈ పాటికి ఢిల్లీ పీఠం అల్లల్లాడిపోయుండేది కాదా! రామ్‌దేవ్ బాబా ఆ యోగాని పట్టుకుని వేళ్ళాడేకన్నా.. ఇలా ఏ ప్రేమాసనాల వంకతోనో సభలు గనక పెట్టుంటే హస్తిన నుంచీ తరిమెయ్యడానికి సర్కారు తాతలు దిగొచ్చేవాళ్ళు. ఇప్పటికయినా మించిపోయింది లేదు. మా ప్రేమ పార్టీతో పొత్తులు పెట్టుకుంటే ఎవరికైనా ఎన్నికల్లో విజయం తథ్యం. మా లక్ష్యాలు నెరవేరడానికి మేం బొంత పురుగులనూ ముద్దు పెట్టుకోడానికెప్పుడూ సిద్ధం"

"ఏంటి బాబూ అంత మీ లక్ష్యాలు?"

"ప్రేమకోసం జీవితాలని అర్పించిన అమరజీవులు దేవదాసు, పార్వతి, లైలామజ్ను, ఏంటోనీ - క్లియోపాత్ర, రాజకపూర్ - నర్గీస్ లాంటి వాళ్ళ విగ్రహాలను పార్లమెంటు ప్రాంగణంలో ప్రతిష్టించాలి. ప్రాథమిక దశనుంచే పసిపిల్లలకు ప్రేమ మహిమను గురించిన కథలను పాఠ్యపుస్తకాలద్వారా బోధించాలి. ప్రేమను ప్రధానంగా బోధించే కళాశాలలను గుర్తించి ప్రోత్సహించాలి. ప్రేమ విరోధులకు విధించే శిక్షలను మరింత కఠినతరం చేయాల్సుంది. ప్రేమ వివాహాలను ప్రభుత్వమే తన స్వంత ఖర్చుతో ప్రేమికుల దినం రోజున జరిపించాలి. ప్రేమపక్షుల

విహారానికి అనువైన స్థలాలను ప్రభుత్వమే సేకరించి అభివృద్ధి చేయాల్సింది. విఫల ప్రేమికులకు సరికొత్త ప్రేమికులు దొరికేదాకా నెలవారీ ఖర్చుల కింద ప్రేమ భత్యం చెల్లించాలి. ఫ్లాపైన ప్రేమ చిత్రాలకు ఉద్దీపన పథకాలు, ప్రేమచిత్రాలు టీవీ సీరియల్సు నిర్మించేవారికి భారీ సబ్సిడీలు తక్షణావసరాలు. విఫల ప్రేమికులు సర్వప్రయత్నాలు దెబ్బతిని విరక్తితో ఆత్మాహుతి చేసుకోదలిస్తే దూకేందుకు వీలుగా కాలువలు, ప్రత్యేక రైలుమార్గాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. ప్రారంభంలో ప్రేమికుల చేత పళ్ళురాలగొట్టించుకునే ఔత్సాహికులకి ఉచిత చికిత్సా సౌకర్యాలు.. దంత వైద్యశాలలు ఏర్పాటు చేయించాలి. అన్నట్లు ప్రేమికులకు పరిమితిలేని - ఉచిత సెల్ ఫోన్ కాల్సు సౌకర్యం విధిగా కల్పించాలి.."

"అసల్ది మర్చిపోయావురా అబ్బాయ్! మీ మాధుర్ నాథ్ చౌదరి సాబ్‌కి చెప్పించి 'ప్రేమ పార్టీ' మేనిఫెస్టోలో చేర్పించాల్సిన ముఖ్యమైనవి ఇంకా రెండున్నాయి. ప్రేమికులందరికీ వికలాంగుల కోటాలో ప్రభుత్వోద్యోగాలు ఇవ్వాలి. ప్రేమగుడ్డిది కదా! మీది గుడ్డివాళ్ళ పార్టీ కదా! పిచ్చాసుపత్రుల సంఖ్య మరిన్ని పెంచాలి. "

*14*

## విగ్రహ విలాపం

**'గ్రహం కాని గ్రహం' ఏంటని** అడిగితే బడికెళ్ళని బుడతడు కూడా 'విగ్రహం' అని ఠక్కున చెప్పేస్తున్నాడు ఇప్పుడు. పొడుపు కథగా విప్పుకోడానికి బాగానే ఉండచ్చుగానీ.... విగ్రహాల కథ చెప్పుకుంటేనే బాధగా ఉంటుంది. దేవుడనేవాడున్నాడో లేదో తెలీదు గానీ దేవుడి విగ్రహాలు మాత్రం లేవని ఎవరం చెప్పలేం. కష్టమొచ్చినప్పుడల్లా ముందు పడీపడీ పొర్లు దండాలు పెట్టేది.. ఫెడీ ఫెడీమని రెండు చెంపలూ వాయించుకునేదీ దేవుడి విగ్రహాల ముందే! ఇప్పుడా విగ్రహాలకే కష్టమొచ్చి పడింది. ఎవడి ముందు అవి పాపం పొర్లుదండాలు పెట్టాలి? ఎవడికి చెప్పుకుని చెంపలు రెండు టపటపా వాయించుకోవాలి?

విగ్రహాలకి పట్టుకున్న శనిగ్రహాన్ని ఎవరొచ్చి తరిమికొట్టాలి?

బతికున్న భార్యను అడవులకు వెళ్ళగొట్టి బంగారు విగ్రహంతో యాగం అయిందనిపించాడు మర్యాద పురుషోత్తముడు శ్రీరామచంద్రుడు. ఆరాధన వద్దన్న బుద్ధుడికే భారీ విగ్రహాలు నిర్మించేసి ఆనక తాలిబన్ల బాంబులకు బలిచేయించిన బుద్ధిమంతులం మనం.

రష్యాలో లెనిన్ విగ్రహం ఏం చేసిందని పాపం. వీపు బొక్కపడేటట్లు విధ్వంసం చేసారు? కలకత్తా గాంధీజీ, అమలాపురం అంబేద్కర్.. అందరి విగ్రహాలవీ ఒకే విషాదాంతం! అత్తమీద కోపం దుత్తమీద చూపించడం తెలుసుగానీ. ఇలా గిట్టని వాళ్ళమీద కసిని ఉత్తపుణ్యానికి విగ్రహాలమీద చూపించడం...కొత్త మూర్ఖత్వం.

విగ్రహాల వల్ల మనకెన్నెన్ని ఉపయోగాలూ!

చూపులకు వట్టి బండరాళ్ళే గానీ.. దారి తెలుసుకునే బాటసారులకి అవే కొండగుర్తులు. 'శాసనసభ ఎక్కడుందని?' కొత్తవాడెవడైన అడిగితే 'గాంధీ బొమ్మ' ఆవరణలో అంటేనే ఇట్టే గుర్తుపట్టేది. వందనోట్లు అందరి జేబుల్లో ఉంటాయని గ్యారంటీ ఏంటి? 'బాపూజీ' ఎవరని పిల్లలెవరన్నా అడిగితే గభాలుమని చూపించగలిగేది నాలుగురోడ్ల కూడల్లో నిలబడున్న బోసినవ్వుల తాత బొమ్మనే గదా! జాతి ఇంకా జాతిపితను మర్చిపోకుండా ఉందంటే... ఆ పుణ్యం గజ గజానికి దర్శనమిచ్చే గాంధీ విగ్రహాలదే! జయంతులకు, వర్ధంతులకు దండలేసి దండాలు పెట్టి సొంతడబ్బా దంచుకునే ఉచిత వేదికలు విగ్రహాల స్థూపాలేగదా!

సుస్వాగతం బేనర్లు, సులభవాయిదా పద్ధతుల్లో కార్లు, కొత్త సినిమా జోర్లూ... నలుగురి దృష్టిలో పడాలన్నా.. విగ్రహాల మెడలకు బిగించి కట్టే తోరణాలకు మించిన సౌకర్యం ఇంకేముంటుంది? వాటి భుజాల మీద మైకులు బిగిస్తే చాలు. మనం ఊకదంపుడుని నాలుగు దిక్కులా యథాశక్తి వెదజల్లేయచ్చు! ఎవరికీ జంకని రోడ్డు విస్తరణ శాఖవాళ్ళనీ, ఎన్నికల సంఘం వాళ్ళనీ బెదరగొట్టగలిగేది నడిరోడ్డుకడ్డంగా దిట్టంగా నిలబడున్న విగ్రహాలే!

నేతలకన్నా నేతల విగ్రహాలే నయం ఎదురుబడ్డప్పుడు ఇష్టమున్నా లేకపోయినా వంగి వంగి సలాములు చేయమనే డిమాండు ఉండదు. మేజోళ్ళను దులిపి కాళ్ళకు వేయమని రుబాబు చేయవు. వెన్నుపోట్లు, వెటకారపు మాటలు విగ్రహాలకు తెలిని విద్య. పూటకో పార్టీ మార్చవు. రాస్తాల మీద ప్రెస్ మీట్లు పెట్టి రవాణాకి ఇబ్బంది కలిగించవు. భూముల్ని కబ్జా చేయవు. (ఆ వంకతో నేతలు ఆక్రమించే స్థలాల్లో వాటికి వాటా ఉండదు.)

వీధి వీధికీ వెలిసే విగ్రహాల సంఖ్య రోజురోజుకీ పెరిగిపోతుందనే విమర్శ సమంజసంగా లేదు. ఒక నేత పోతే వందమంది పుట్టుకొస్తారని సీతారామరాజంతటి వీరుడే సినిమాలో లూథర్ ఫర్ట్‌నిని హెచ్చరించాడు. నిజమైన నేతలు పుట్టుకుని రావాలంటే బోలెడంత తతంగముంటుంది. తాత్సారం తాళలేని వారసులు అందుకే అడుగుకొక విగ్రహాన్ని ఓదార్పు యాత్ర వంకతో అరగంటలో నిలబెట్టేస్తున్నారు. నేతాశ్రీలు పెరిగితే వసూళ్ళు పెరుగుతాయికానీ.. విగ్రహాలు వెలుస్తుంటే జనాలకి ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి. సిమెంటు, మట్టి - లాంటి వనరులకు మంచి డిమాండు పెరుగుతుంది. భవన నిర్మాణ రంగం డీలా పడుండటంతో పస్తులుంటున్న బేల్దారులకు ఇంత ముద్ద పెడుతున్నది తామరతంపరగా పెరిగిపోతున్న విగ్రహాలే! జనగణన గొడవలా పక్కకు పెట్టి అత్యవసరంగా విగ్రహాల లెక్కకు ప్రభుత్వం ఊరికే వ్రాసుకోదుకదా! మనిషి ప్రాణానికన్నా.. మట్టితో కట్టిన విగ్రహాలకే విలువెక్కువన్న జ్ఞాననేత్రం ఏదో తెరుచుకునుండాలి! యానాం పరిశ్రమ గొడవల్లో రెండు ప్రాణాలు పోయినా పట్టించుకోని సర్కారు - విగ్రహాలకు ముప్పొచ్చిందని పసిగట్టగానే నలుగురు మంత్రుల్ని ఎందుకు ఆదరాబాదరాగా పరామర్శలకని పంపుతుంది! నిన్నటి నేతనేటి విగ్రహం. నేటి నేత రేపు నాలుగు రోడ్ల కూడలిలో నిలబడాల్సిన విగ్రహం. నేతలక్కు, విగ్రహాలకీ మధ్యున్నది జన్మజన్మాంతరాల బంధం! కాలం కలిసిరానప్పుడు ఏవో ముసుగులూ అదీ పడినా.. సమయం వచ్చినప్పుడు అవే కాసులు, సెంటిమెంట్లు పండించే టూ-ఇన్-వన్‌లు.

విగ్రహం అంటే - పోయిన నేతను హాయిగా పోనీయకుండా నడిబజారులో నిలబెట్టడం. మావో నుంచీ మాయావతి దాకా, 'స్టాలిన్' నుంచి 'సద్దాం' దాకా మనసుపడింది ఈ విగ్రహాల మీదే సుమా!

అలాంటి విగ్రహాలకు ఇప్పుడు విధ్వంస భయం ముంచుకొచ్చేసింది. ప్రతిష్ఠకోసం విగ్రహ ప్రతిష్ఠాపనలకు పాలుబడుతున్న వాళ్ళు అవి విధ్వంసమయితే ఎంత అప్రతిష్ఠో అర్థం చేసుకోవద్దూ! మనమూ ఒకరకంగా దేవుడు చేసిన విగ్రహాలమే సుమా! నోరులేని రాయిమీదా వీరత్వం!?

విగ్రహాలు పాలుతాగుతాయని విన్నాం గానీ.. ఇలా కన్నీళ్ళు పెట్టుకుంటాయని తెలీదు!

వాటికే నోరుంటే ఏముంటాయో తెలుసా!?

"మనుషుల్ని గాలికొదిలేసి విగ్రహాలకు కాపలా కాయాలనుకునే తుగ్లక్ వారసులారా! జనం పన్ను సొమ్ముని ఇలా బండరాళ్ళ పరం చేయడం నేరం. భారీ నిర్మాణాలు చేయడమెందుకు? పాలాభిషేకాలు చేస్తే పాపాలు తొలిగిపోతాయా!? పసిపాపలు, రోగుల ఆహారాన్ని ఇలా రాళ్ళ పాలు చేయడం ఘోరం కాదా? కంచుతో చేసినా, కంచెలు వేసి తుపాకులతో కాపలాలు కాసినా.. అందరి మేలుకోరే మాకు అది మాత్రం అవమానం కాదా? నేతలుండాల్సింది జనం గుండెలో.. బండలో కాదు! మీరు చేయాల్సింది జనానికి మేలు జరిగే పనులు. అలా ఉండాలంటే ముందు ఇన్ని చెప్పినా తలకెక్కించుకోనంటారా.. చివరికి విగ్రహాలకు మిగులున్నది ఒకటేదారి. ప్రజాకంటకులందర్నీ

బాలనాగమ్మ సినిమాలో మాయలఫకీరు బాలవర్ధన రాజు సోదరులందరినీ చేసినట్లు విగ్రహాలుగా మార్చి నడిరోడ్డులో ఎండకూ, వానకూ, చలికీ, పిట్టలకీ, రెట్టలకీ జనం కోపానికి వదిలేయడమే. అప్పుడైనా మనకు అర్థమవుతుందేమో విగ్రహాల విలాపానికి వెనుకున్న విషాదం.

*15*

# దశావతారాలు

**ఇప్పుడు ఐ.యేఎస్‌ల వ్యవహారశైలి చూస్తుంటే** ఒకటి నమాల్ రామచంద్ర సార్ గుర్తుకొస్తున్నాడు. అప్పట్లో ఆయన అధికారుల అవినీతి మీద ఇచ్చిన నివేదిక పెద్ద చర్చకు.. తరువాత 'రచ్చ'కు..దారితీసింది. అంతా కలిసి ఆ సారుని 'పిచ్చోడి'గా ముద్రవేసి కథకు ముగింపు పలికిన దాకా నిద్రపోలేదు. ఇప్పుడు నడుస్తున్న అధికారుల ముడుపుల నేపథ్యంలో మరోసారి అవినీతి అధికారుల దశావతారాలను సరదాగా అనుకుంటే పోయేదేముంది.

నాలిక చివర నేతి బొట్టేసి నాకవద్దంటే సాధ్యమవుతుందా! నీళ్ళలో తిరిగే చేప తాగే నీరు ఎంతో తెలుసుకోవడం అంత సులభం కాదంటాడు అర్థశాస్త్ర కర్త చాణుక్యుడు. నమాల్ సార్ తన నివేదికలో పదేపదే ఉదహరించిన అవినీతి అధికారుల అవతారాలకూ పురాణాల్లోని దశావతారాలకూ చాలా దగ్గర పోలికలున్నాయి. కాకపోతే దేవుడు ధర్మ సంస్థాపనార్థం ఆ అవతారాలన్నీ ఎత్తితే.. మన అధికారులు స్వంత సంపాదనార్థం ఈ అవతారాలెత్తుతుంటారు. అదొక్కటే తేడా.

ఏసీబీ దాడులప్పుడు దొరికినప్పుడు సిబిఐ విచారణకు పిలిచి నివేదికలో ఇరికించినప్పుడు అధికారిని మనం ఒక చేపగా వర్ణించుకుంటుంటాం. అది మత్స్యావతారం అన్నమాట. 'చిన్న చేపలే దొరికాయా!' అని ఈ మధ్య ఐఏయస్‌లు ఒక చర్చకూడా లేవదీసారు గదా! చిన్న చేపలే ఎప్పుడైనా వలలకు చిక్కుతుండేది. మింగే తిమింగిలాలకు తప్పించుకునేటందుకు బోలెడంత నెట్‌వర్క్ ఉంది!' అన్నాడు అప్పట్లో నమాల్ సాబ్ కూడా గుర్తుందా!

ప్రభుత్వ పథకాలను నడిపించాల్సి వచ్చినప్పుడు చాలామంది అధికారులు కూర్మావతారాలెత్తుతుంటారు. సర్కారు పనంటే మంథర పర్వతం కన్నా భారీగా ఉంటుంది కదా! మరి నడక మందంగానే ఉంటుంది కదా! అదే ఇంధనం పడిందనుకోండి. కుందేలు కన్నా ముందు గమ్యం చేరే తాబేలు మాదిరి పనిచేసే అవతారాలు ఎత్తేది అధికారులే. శ్రీ లక్ష్మి వంటి చురుకైన అధికారులే దానికి ప్రత్యక్ష ప్రస్తుత ఉదాహరణ.

మంత్రుల ప్రమేయం ఏమీ లేకుండా అంతా మేమే చేసామా! అని ఈ మధ్య మరో కొత్త వాదన లేవదీసారు కదా అధికారుల సంఘంవాళ్ళు. ఇలా వేలెత్తి చూపేవాళ్ళమీద బురదజల్లే కార్యక్రమం పెట్టుకున్నప్పుడు ఆ అధికారులు వరహావతారాలు ఎత్తినట్లు అనిపిస్తుంటారు.

ఇట్లాంటి వాళ్ళ 'నోట్'లో 'నోట్' పెట్టబోయినందుకే నమాల్ పిచ్చాడుగా ముద్రవేయబడ్డాడు.

అధికారులందరిలో ఒక సామాన్య గుణం కామన్‌గా ఉంటుంది. పైవాడి ముందు నంగి నంగిగా నిలబడ్డ వాళ్ళే .. క్రింది వాళ్ళమీద సివంగులలాగా లేస్తుంటారు. వైయస్స్ ముందు ముంగిలా నిలబడి చెప్పిన పనులు నోర్మూసుకుని చకచకా చేసుకుని పోయినవాళ్ళు.. ఇప్పుడు కిరణ్ జమానాలో సింహాల్లా గర్జిస్తున్నారు.. గమనించండి. ఇవి నరసింహావతార లక్షణాలు. తనకు సరిపడినంత పడకపోతే రూళ్ళ గోళ్ళతో ఫైళ్ళను చీరిపారేసే నరసింహావతారులూ తక్కువగా ఏం లేరు.

పొట్టి సంతకం చేసేవాళ్ళు వామనావతారులు. సంతకం పొట్టిదైనా సంభావన గట్టిగా లేకపోతే గనుల వ్యవహారంలో శశికుమార్ .. కొండారెడ్ల లాంటి వాళ్ళకు పట్టిన గతే అవుతుంది. సర్కారీ మార్కు ఉక్కుపాదంతో సరిపడని వాళ్ళను పాతాళం అడుగుదాకా తొక్కి పారేసే అధికారులు వామనావతారులు.

ఒకే నోట్. ఒకే పార్టీ. 'ఒకే బాణం.. ఒకే భార్య' గుణంగల రామావతారులకు వీళ్ళు ప్రతిరూపాలే కానీ - రాములవారు న్యాయం పక్షాన యుద్ధం చేస్తే ఈ రాములోర్లు 'అస్మదీయు'ల పక్షాన కథ నడిపిస్తారు.

నీతికోసం పనిచేసే రామావతారాలూ లేరని చెప్పలేం గానీ.. మెజారిటీ అధికారులు 'పరసు'రాములే అని జన సామాన్యంలో అనాదిగా ఒక విశ్వాసం ఉంది. ప్రస్తుతం సాగే సి.బి.ఐ వారి విచారణ దానికి వత్తాసు పలుకుతోంది.

ఆయుధం పట్టకుండా సమరం సాగించే కృష్ణావతారులూ అధికారుల్లో కోకొల్లలు. 'చెలుల చీరెలు దోచి|చెల్లి చీరెను కాచి| చేసినే లాలూచీ' అని ఆరుద్రగారు కూనలమ్మ పదాల్లో ప్రస్తావించినది ఈ బాపతు కృష్ణావతారుల్ని కూడా. గిట్టుబాటుగా రాయబారాలు నడిపించడం, అవసరార్ధం చక్రాలని అడ్డుపెట్టడం ఈ అవతార పురుషుల లక్షణాలు. వీళ్ళ నోళ్ళు తెరిపించి 'భువన భాండాలు' లెక్కలు బైటకు తీస్తున్నదనేగా ఇప్పుడు సిబిఐ మీదా, ఏసిబీ మీద అంత అక్కసు.

రిటైరయిన తరువాత సలహాదారుల రూపంలో ప్రభుసేవను కొనసాగించేవారు బుద్ధావతారులు. సర్కారు పేటికలు వీరికి కంఠోపాఠం. నేతల జాతకాలు వీరికి కరతాలమలకాలు. జ్ఞాపకశక్తి అధికంగా గల జ్ఞానప్రబుద్ధులని సర్కారు సలహాదారులుగా చేరదీసి 'బుద్దులు'గా మార్చకపోతే సర్కారు మనుగడకే ప్రమాదం. వీరి ఉచిత సలహాలు చాలా 'విలు'వయినవిగా ఉన్నాయనే సిబిఐ ప్రస్తుతం కూపీలాగుతున్నది మరి. బుద్ధావతారాల్లాగా మొద్దుల్లా చూస్తున్నారనేగా బీపి ఆచార్యమీద అభియోగం.

ఏ అవతారం కలిసి రాకపోతే అధికారి అనేవాడు చివరికి ఎత్తేది కల్క్యావతారం. నమాల్ సార్ ఎత్తిన అవతారం అదేనంటారు ఆయనంటే గిట్టని.. గిట్టుబాటుకాని కొందరు అధికార్లు, నేతలు. ఇప్పుడూ అధికారులందరూ ఎత్తి ఉన్న అవతారం ఇదే. రూల్సు కత్తులు పట్టుకుని అధికారం అశ్వాలమీద కదం తొక్కుతూ నేరుగా సర్కారు మీదకే సమరానికి సిద్ధమయిపోయారు.

చూడాలి. చివరికి.. ధర్మసంస్థాపన సంభవమవుతుందో... ఎప్పటిలాగా టీ కప్పులో తుఫానుకు మల్లే చల్లబడి చప్పబడుతుందో. ఏ అవతారం పరమార్ధమయినా దుష్టశిక్షణ...శిష్ట రక్షణే కదా. కాకపోతే దుష్టులెవరో.. శిష్టులెవరో.. తేలకే సగటు జీవికి అంతా అయోమయంగా ఉంది.

## 16

## సాహిత్యంలో చమత్కారం

**ఒక రోజు కాళిదాసు కాశీక్షేత్రంలోని వ్యాస** భగవానుడి విగ్రహం చూసి బొడ్డులో వేలుపెట్టి ఏదో వెదకసాగాడుట. "ఏంటి వెతుకుతున్నావు? " అని అడిగారు మిత్రులు.

"మా 'మా ముత్తాత వ్యాసులవారు తరచుగా శ్లోకాల్లో 'చ'కారం తెగవాడుతుంటారుగదా! గీతలో దుర్యోధనుడు తన పక్షం వాళ్ళ పేర్లు చెబుతూ 'భగవాన్, భీష్మశ్చ, కర్ణశ్చ, కృపశ్చ, సమితింజయః' అంటూ ఒక్క వరసలోనే మూడు 'చ'కారాలు వాడేశారు. మిగతా పురాణాలు, ఇతిహాసాలలోనూ ఇదే వరస. వ్యాసులవారు 'చ'కార కుక్షి. బోలెడన్ని 'చ'కారాలు పొట్టలో అట్టేపెట్టుకున్న మహానుభావుడు. కొన్నైనా నాకు దొరికితే నా రచనల్లో ఉపయోగించుకుందామని ఇలా వేలుపెట్టి వెదుకుతున్నాను" అన్నాడుట కాళిదాసు.

మిత్రులకు సరదా అనిపించి కానీ. వ్యాసులవారికి మాత్రం ఆగ్రహం తెప్పించింది. మునిమనవడి వేళాకోళం. ఆయన కోపం వల్ల కాళిదాసు వేలు వ్యాసుడి బొడ్డులో ఇరుక్కుపోయింది.

"నేను రాసింది లక్షల్లో శ్లోకాలు. వేలపాత్రలతో, వందలకొద్దీ చారిత్రిక వర్ణనలతో రచన సాగించాల్సి వచ్చినప్పుడు 'చ'కారాల్లాంటివి సంధి, ఛందస్సుల సౌలభ్యం కోసం వాడుకోవాల్సి వస్తుంది. నీలాగా ఏ పురాణ మూలాల్లోనుంచో తీసుకున్న చిన్న ఘట్టాన్ని ఎడాపెడా సాగతీసి కావ్యాల్లాగా రాసిన వాణ్ణికాదు. అహంకారంతో నువ్వు చేసిన హేళనకు ఇది నీకు శిక్ష. ఇంక నీ వేలు బైటకి రాదు" అన్నాడు వ్యాసుడు.

కాళిదాసుకి చేసిన తప్పు తెలిసి వచ్చింది. "తాతగారన్న చనువుతో చేసిన విమర్శే స్వామీ అది. తప్పనుకుంటే క్షమించండి. ఇంక మీ జోలికి రాను" అని చెంపలేసుకున్నాడు.

"ఊరికే వదిలే ప్రశ్నేలేదు. నీ సామర్థ్యం నిరూపించుకో! ద్రౌపదికి పాండవులు ఐదుగురూ భర్తలేకదా! ఐనా ధర్మరాజు, సహదేవుళ్ళలో ఒక ప్రత్యేకత ఉంది. అదేంటో వివరిస్తూ శ్లోకం చెప్పు. ఒక్క 'చ'కారం వాడినా నీవేలు ఊడి రాదు. గుర్తుంచుకో!" అని పరీక్ష పెట్టాడు వ్యాసులవారు.

కాళిదాసు ఒక్క క్షణం కూడా ఆలోచించకుండా శ్లోకం చెప్పాడు

"ద్రౌపద్యాః పాండు తనయాః పతి, దేవర, భావుకాః
న దేవరో ధర్మరాజః సహదేవో న భావుకః"

ద్రౌపదికి పాండు పుత్రులు భర్తలు. మరిదీ, బావ వరసలు కూడా. కానీ ధర్మరాజు మరిది కాదు. సహదేవుడు బావకాదు - అని ఈ శ్లోకం అర్థం.

ఈ శ్లోకంలో ఒక్క 'చ'కారం కూడా లేదు. కాళిదాసు వేలు ఊడి వచ్చింది. ఆ వేలుతోనే ఆ కవికుల గురువు ఎన్నో మహాకావ్యాలు రాసాడన్న విషయం మనందరికీ తెలిసిదే కదా!

పరిహాసానిక్కూడా పెద్దలతో చతుర్లాడకూడదని కాళిదాసు పాఠం నేర్చుకున్నాడు.

ప్రపంచ సాహిత్యం నిండా ఇలాంటి చమత్కారాలు చాలా ఉన్నాయి. వ్యంగ్యం జోలికి పోకుండా ఈసారి మన తెలుగు సాహిత్యంలోని ఇలాంటి కొన్ని చమత్కార పద్యాలను చెప్పాలన్నదే ఈ గల్పిక ఉద్దేశం. చిత్తగించండి.

1.కొండమీద నెమలి కోరిన పాలిచ్చు
పశువు శిశువు తోడ మాటలాడు
వేదములను చదివి పెద్దయిన బాపడు
కాకి మాంసము తిన గంటి కృష్ణ!

నెమలి పాలివ్వడం, శిశువు పశువు మాటలు, వేదాలు చదివిన బాపడు కాకి మాంసం తినడం - అంతా విడ్డూరంగా ఉంది గదూ!

కొండమీద నెమలి, కోరిన పాలిచ్చు పశువు, శిశువు తోడ మాటలాడు వేదములను చదివి పెద్దైన బాపడు, కాకి - మాంసం తిన గంటి కృష్ణ - ఇలా కామాలు పెట్టుకుంటూ చదువుకుంటే విడ్డూరం విరుగుడయిపోతుంది గదా!

2. తిట్టు కవిత్వానికి తెలుగు కవులు పెట్టింది పేరు. వట్టిగా తిట్టుకుంటే మనం చెప్పుకునేందుకు ఏముంటుంది? తిట్టులో కూడా గుట్టుగా చమత్కారముంటేనే గదా ఆ'కారం' ఘాటుగా ఉన్నా రుచికరంగా ఉండేది. గిట్టని ఇద్దర్ని గూర్చి మూడోవాడు తిట్టిన పద్యం ఇది:

అతడు నందికేశ్వరావతారమతండు (అంటే ఎద్దు)
పుత్రకుండు భోగి భూషణునకు (కుక్క)
శౌరి మూడవ 'అవతార'మతండు (అంటే పంది)
క్షాత్తు నౌకరి నౌకరు ఘనులు గారె!

3. తెలుగు లిపి చాలా చిలిపిది. నోటికే కాదు చేతికీ కొంత శ్రమ పెట్టేది. 'య-మ, వ-మ, ర-ల, న-స; ద-డ' వీటి మధ్య రాతపోలికలు చాలా ఎక్కువ. 'య-రలవమదనస' ఈ ఎనిమిది అక్షరాలను చక్కగా రాయడం నేర్చుకుంటే చాలుట, తెలుగక్షరాలు ముత్యాల్లాగా పేర్చవచ్చని ఓ కవిగారు చమత్కారంగా చెప్పుకొచ్చిన పద్యం ఇది:

యరలవమదనస యనుచును
పరువడి నీ యేను లిపులు భయనయ తతులన్
నిరతముగ వ్రాయుచుండిన
వర కరుణా వాని వ్రాలు వ్రటువలమరున్!

4 ప్రబంధ సాహిత్యమంటే 'చంటి' 'వంటి' మీదా చెప్పిన కవిత్వమనే ఒక అపప్రథ ముందు నుంచీ ఉన్నదే. దానికి విరుద్ధంగా వాడాల నరసింహం అని ఓ కవివరుడు 'పంటి'మీద చెప్పిన పద్యం - పన్ను పోగొట్టుకున్న ఆయనకు బాధగా ఉన్నా.. చదువుకునే మనకు చమత్కారంగానే ఉంటుంది.

మోమును చిన్నబోవగను ముగ్ధలు చూచి హసించు చుండ నెం
తోమది చింత నొందగను దిన్నని బల్కుల దుస్సిపోవగన్
గోమల దంత చేలమంది గుందుచు వ్రాలగ బూర్వజన్మ ప్రా
ద్ధామము బాసిపోతివే! రదంబ! కదంబ పరిత్యజంబవై!

5.ఇంట్లో కట్టుకున్న ఇల్లాలు లేకపోయినా సర్దుకుపోవచ్చు గానీ. కాఫీలో చక్కెర లేకపోతే తట్టుకోవటం కష్టంట. కాఫీగత కవి ప్రాణి అల్లిన చమత్కార పద్యం ఇది.

పంచ దార లేక బ్రతుకంగ వచ్చును
పంచదార లేక బ్రతుకుటెట్లు?
కలియుగమ్మునందు కాఫీ గతప్రాణి
పంచదారకేల పట్టువిడుపు!

6. వేళకు రావు. వచ్చినా స్టేజీలో ఆగవు. ఆగినా అంటుకోనీయవు. ఏమిటో చెప్పుకోండి చూద్దాం. ఆర్టీసీ బస్సు. తుస్సు.. ఆమాత్రం తెలీదా మాకు' అని కస్సు బుస్సు మనకండి సారూ! మనకు లాంటి అనుభవమే ఓ కవిగారికి కలిగింది. కసిగా కలం తీసి ఈ పద్యం దూసారు

"వేళకు రాదు వచ్చినను వెళ్ళెడు తొందర స్టేజి చెంతకున్
మైలున ముందు వెన్కనొ సుమారుగా నిలుచును పాంథుడేగినన్
కేలును బట్టనీదు గిరిగ్రిరున దుల్బుక పోవుచుండ మా
పాలెము నందు బస్సు తొలిప్రాయపు దుడ్కను బోలి ఎప్పుడున్ (దుడ్క=దూడ)

7. ఒక కవిగారు తెలిసిన వాడుగదా అని సాహెబుగారికి చేబదులుగా వెయ్యి రూపాయలు ఇచ్చాడుట. నెలరోజుల్లో తిరిగిస్తానన్న పెద్ద మనిషి అయిపూ అజా లేడు. కనబడినప్పుడు ఒకసారి ఇప్పుడే ఇస్తాను, రేపుటెల్లుండిలో తీర్చేస్తాను అనటమో.. గట్టిగా నిలదీస్తే 'ఇస్తాంలేవయ్యా' అని దబాయించటమో.. చేస్తుండటంతో వళ్ళు మండి ఈ పద్యం చెప్పాడుట:

'అభీ' చ శబ్దం పక్షాంతరాణాం
'కల్', 'పర్సుం' శబ్దం మాసాంతరాణాం
'దేంగే', దిలాయేంగే' వర్షాంతరాణాం
దేఖో 'ఖుదాహై' చ యుగాంతరాణాం

ఇప్పుడే ఇస్తానంటే రెండువారాల్లో పని, రేపుటెల్లుండిలో ఇస్తానంటే నెలదాకా ఆగాలనీ, ఇస్తాం. ఇప్పింస్తాం' అంటే ఏడాదిలో ఎప్పుడైనా అనీ, చూడు. పైన దేవుడున్నాడు' అంటే మాత్రం ఈ యుగంలోపల ఎప్పటికైనా సరే అప్పు చెల్లిస్తానని ఆ సాహెబుగారి 'కోడ్' భాష అని అప్పిచ్చినవాడి మొత్తుకోలు.

8. ప్రతి పక్షంలో ఉన్నప్పుడు మద్యపాన నిషేధం, ప్రభుత్వంలోకి రాగానే మద్యం మీది అమ్మకాలు గుర్తువచ్చే పార్టీలు ప్రస్తుతం మనల్ని ఏలుతున్నవి. తాగుడు వల్ల చెడు జరుగుతుందని నమ్మేవారెంత మందున్నారో. మంచి జరుగుతుందని మనసారా భావించే వాళ్ళూ అంతే ముందున్నారు. ప్రపంచం అంతా కథే నడుస్తుంది.

భక్తి మది బుట్టు నఘముల బారగొట్టు
విమతులకు గుట్టు శేషత్వ విధికి పట్టు

దాహమును పోగొట్టు మనసు మోదముగ బెట్టు
దాసవిధికెల్ల తలకట్టు తణ్ణీ(కల్లు) బొట్టు - అని పిపాసి వాదన.

గుట్టు వెలిబెట్టు దేహమిట్టట్టు బెట్టు
కులము ఛీ కొట్టు దేహబాధలకు బెట్టు
వరుస చెడగొట్టు పలుమార్లు వర్లబెట్టు
వెనుక కలబెట్టు చెడగొట్టు వెణ్ణె(సారాయి) బొట్టు

అని మద్యదోషి నిరసన. రెండింటిలోని చమత్కారాన్ని మాత్రమే ఆస్వాదించి వదిలేస్తే మనకు వంటికి ఇంటికి మంచిది.

# 17

# మరో దండి యాత్రకి

**"నారాయణ నారాయణ! అల్లా అల్లా!**

**మా పాలిట తండ్రీ! నీ పిల్లలమేమెల్లా!"**

"బావుంది బాపూజీ! చల్లంగా భజన చేసుకుంటూ స్వర్గంలో కూర్చున్నావా! ఇక్కడ మీ పిల్లలం.. మా ప్రారబ్దం ఎలా కాలిందో పట్టించుకోవా? నువ్వు మమ్మల్ని వదిలిపోయి అప్పుడే ఆరు దశాబ్దాలు దాటిపోయాయి తెలుసా?"

"నేను వదిలివస్తే మాత్రమేమి నాయనా! నా వారసులేగదా రాజ్యమేలుతున్నారు!"

"వట్టి పేరులోనే నీ ముద్ర మహాత్మా! అదీ నిజంగా నీ నుంచి సంక్రమించింది కాదు. వారు నీ వారసులా? 'దేశమే నా ఇల్లు. ప్రజలంతా నా వాళ్ళు' అనుకున్నావు నీవు. 'నా ఇల్లే నాకు దేశం కన్నా మిన్న, కన్న బిడ్డలకన్నా మాకెవరూ ఎక్కువ కాదు' అనుకుంటున్నారు వీళ్ళు."

"'నా జీవితమే నా సందేశం' అని అక్కడికీ ఆత్మకథలో చెప్పి వచ్చావే, అప్పుడే ఆ నీతులన్నీ మరుపుకొచ్చాయా?!' చెప్పిందే చేయడం చేసేదే చెప్పడం ప్రజాజీవితంలో ఉన్న వాళ్ళందరికీ మరీ ముఖ్యం. అన్నమాట పాటించడం మానేసారా?!"

"చెప్పింది చేయకపోవడం చేసేది చెప్పకపోవడమే ప్రస్తుతం మా దగ్గర నడుస్తున్న రాజకీయ తంత్రం బాపూజీ! 'చెడు చూడకు. చెడు వినకు. చెడు అనకు' అని నువ్వా మూడు కోతుల మోడలు ఎందుకు చెప్పావో గానీ ఆ సూత్రం మాత్రం మా వాళ్ళిప్పుడు తు.చ తప్పకుండా పాటిస్తున్నారు. చెడ్డపనులెన్ని జరుగుతున్నా చూడటం మానేసారు. చెడుమాటలు ఎన్ని ఎవరంటున్నా చీమకుట్టినట్లున్నా ఉండటంలేదు ఎవరికీ. చెడ్డపనులు చేసేవారిని గురించైనా చెడ్డమాటలు అనటం తప్పనుకుంటున్నారు. ఇక్కడ సర్కారుని, జనాలనీ, మీడియాని నువ్వే ఒకసారొచ్చి చూసిపోవాలి"

"హే రామ్! సత్యంతో నేను చేసిన ప్రయోగాలన్నీ చివరికి ఇలాంటి కుక్కమూతి పిందెల్ని పుట్టించాయా?!"

"నిన్ను మించిన మహర్షులిప్పుడు ఇక్కడ అసత్యంతో భారీ ప్రయోగాలు చేస్తున్నారు బాపూజీ! న్యాయదేవత కళ్ళకేకాదు చెవులుకూ పట్టీలు కట్టేస్తున్నారు. ప్రజాప్రతినిధులు ప్రకటించే ఆస్తులు అప్పుల వివరాలు హాస్యనవలలకన్నా ఎక్కువగా నవ్వు పుట్టిస్తున్నాయి. రాజ్యాంగం మీదేమిటి చివరికి దేవుడిమీద కూడా ప్రమాణం చేసి బొంకటానికెవరూ జంకటంలేదు"

"రామ రామ! మరి నా అహింసావ్రతం?"

"హ..హి..హి కనీసం టీవీ కెమేరాల ముందైనా కోపాన్ని దాచుకునే ప్రయత్నం ఎవరూ చేయడంలేదు. అడ్డగోలు సంపాదన కడ్డొచ్చేవాడు ఎవడైనా సరే ఆఖరికి సి.బి.ఐ వాడికైనా సరే గిట్టనివాళ్ళతో చుట్టరికాలంటగట్టేస్తున్నారు. సజీవదహనాలు యాసిడ్ దాడులు, కక్షసాధింపు హత్యలు ఇప్పుడు రోజు వారి పత్రికల్లో వచ్చే మామూలు వార్తలు"

"ఆపు నాయనా! వినలేకపోతున్నాను. ఇదా నేను కోరుకున్న సుపరిపాలన?! ఇలాంటి స్వరాజ్యం కోసమేనా మేమారోజుల్లో తెల్లవాడితో లాఠీదెబ్బలు తిన్నది?"

"మరే స్వరాజ్యమయితే వచ్చిందిగానీ దాని అర్ధమే పూర్తిగా మారిపోయింది మహాత్మా! స్వరాజ్యమంటే 'స్వంతానికి చేసుకునే పరిపాలన' అనే అర్ధం స్థిరపడిపోయింది. యంత్రాల మీద ఆధారపడొద్దని గదా ఆ రోజుల్లో నువు బోధించింది. ఇప్పుడు రొమాన్సుకూడా రోబోల సాయంలేకుండా నడవని రోజులొచ్చేసాయి"

"పాపం శమించుగాక. నేరాన్ని ద్వేషించు నాయనా. నేరగాళ్ళనికాదు. క్షమాగుణాన్ని మించిన సద్గుణం మరొకటి లేదు. మరచావా?"

"మామూలు మనిషిని. నా సంగతికేంటిగానీ గాంధీజీ మీరన్న ఆ ముక్కను మాత్రం మా దొరలు బాగా వంటబట్టించుకున్నారు. తెలుసా! కరుడు గట్టిన కసాయి కసబ్‌లు, అఫ్జల్‌గురూలు కారాగారాలలో కులాసాగా కాలం గడుపుతున్నారు. దేశ ప్రధానినే దారుణంగా పొట్టన బెట్టుకున్న వాళ్ళకి ఏ శిక్ష వేయాలో ఎన్నేళ్ళు గడిచినా తేల్చుకోలేనంత క్షమాగుణం సర్కారు వారు అలవర్చుకున్నారు. ఎంత అక్రమంగా అర్జించినా గవర్నమెంటువారికి ఇంత సుంకం స్వచ్ఛందంగా చెల్లిస్తే చాలు. సత్యహరిశ్చంద్రులన్న ధ్రువపత్రాలు జారీచేస్తున్నారు. ఏలినవారి క్షమాగుణం మీది భరోసాతోనే ఎన్నెన్నో అక్రమాలు బహిరంగంగానే జరుగుతున్నాయి. క్షమాభిక్ష దొరకంది మాత్రం పాపం ఆంగ్లపాఠశాలలో తెలుగుమాట్లాడే బుడతలకు, బడుద్దాయిల ప్రేమను కూడా అంగీకరించలేని ఆడపిల్లలకు, కాటికి కాళ్ళు చాపుకుని చావు కెదురుచూసే పేద ముసలి తల్లితండ్రులకు! అసలు ఈ దారుణాల కంతటికీ నువ్వేకదా కారణం బాపూజీ!"

"మధ్యలో నేను చేసిందేముంది నాయనా? దేశస్వాతంత్ర్యం కోసం దీక్షలు, నిరసనలూ చేయటమేనా నేను చేసిన నేరం?"

"ఆ నిరసనలూ దీక్షలే ఇప్పుడు స్వప్రయోజనాలకోసం మా నాయకులు పావులుగా వాడుకుంటున్నారు మహాత్మా! ధర్నాలనీ, హర్తాళ్ళనీ నువ్వే దుర్ముహూర్తంలో ఆరంభించావోగానీ అవే ఇప్పుడు ప్రజల జీవితంలోని శాంతి భద్రతలకు పెద్ద అవరోధమయి కూర్చున్నాయి. ప్రగతి పథానికి పెద్ద అవరోధమయ్యాయి"

"అంటే ఇప్పుడు భారతదేశంలో అభివృద్ధి అనేదే జరగడం లేదా?"

"ఎందుకు జరగడంలేదు మహాత్మా! కేవలం పదకొండు లక్షల పెట్టుబడిలో ఆరేళ్ళకే డెబ్బై ఎనిమిది కోట్లు అడ్వాన్సు ఆదాయం పన్ను కట్టగలిగేటంతటి అభివృద్ధి జరుగుతున్నది ఇప్పుడు ఇక్కడ. ప్రపంచం మొత్తం ఆర్ధిక మాంద్యంతో అల్లల్లాడిపోతున్నా తట్ట సిమెంటు కూడా తయారుకాకముందే కంపెనీ షేర్లను మూడొందల రెట్లు ఆదాయానికి అమ్ముకోగలిగేటంతటి అభివృద్ధి సాధిస్తున్నాము మేమిప్పుడు ఇక్కడ తెలుసా! ఏటేటా విడుదలయే ఫోర్బ్స్ ప్రపంచ ధనికుల జాబితాలో మొదటి పదిమందిలో మనవాళ్ళ పేర్లు ఉండకుండా ఉండనే ఉండవు"

"మరింకేమిటి నాయనా నీ బాధ?"

"కానీ ఆ సంపదంతా ఇక్కడ ఉండటం లేదు స్వామీ! ఎక్కడో స్విట్జర్లాండులో మెట్రో బస్సులు తిప్పుకోడానికి వడ్డీలకు తిరుగుతున్నది. ఆరోజుల్లో నువ్వొక్కడివే హాఫ్‌నేకెడ్ పకీరువి. ఇప్పుడు గజగజానికి గజం గుడ్డ కూడా మొలకు చుట్టుకోడానికి నోచుకోని నీ వారసులే ఏ సిమెంటు తూముల్లో చూసినా. నువ్వు నిరసన దీక్షలో తప్ప చేపట్టని నిరాహార దీక్ష ఇప్పుడు సామాన్యుడు మూడుపూటలా క్రమం తప్పకుండా పాటించే పరిస్థితి. నిన్ను మరిచిపోయి నీ టోపీని మాత్రం జనం మీద పెట్టటానికి మా బాగా

వాడుకునే గడుసు యువతరం రాజకీయాల్లో ఇప్పుడు వీరంగం వేస్తుంది. కల్లుమానమని నువు చెవినిల్లు కట్టుకుని పోరావుగదా! ఆ అబ్కారీ ఆదాయమే మా సర్కారులన్నింటికీ సంక్షేమ పథకాలకు అవసరమయే ఇంధనం ఇప్పుడు. ఇదివరకయితే నువ్వు ఏదో నాలుగురోడ్ల కూడళ్ళ దగ్గర నిలబెట్టిన విగ్రహాలలో నన్నా కాస్త గంభీరంగా ఉండేవాడివి. మా మాజీ నేతలకీ, మహానేతలకే విగ్రహావిష్కరణలకి అంగుళం భూమి దొరకటం లేదిప్పుడు. అయిదొందలు, వంద నోట్లమీద రుద్దిపారేసి గమ్మున మడిచి జేబుల్లో దోపేసుకోడానికి మాత్రమే ప్రస్తుతం నీ ఫేస్ వాల్యు పనికొచ్చేది."

"ఇంతకీ నువ్వనేది ఏంటో ఒక్క ముక్కలో చెప్పరాదా నాయనా?"

"అనేందుకేముంది స్వామీ! నీ బొమ్మ సాక్షిగా జరుగుతున్న అవినీతికి, అక్రమాలకి నీదే బాధ్యత. అప్పుడు నిన్ను చంపిన వాడొక్కడే గాడ్సే. ఇప్పుడు క్షణం క్షణం నిన్ను చంపుతున్న గాడ్సేలు ఎందరో. గాడ్సేల గెలుపే నన్ను బాధిస్తున్నది.

"గాడ్సేలు ఎప్పుడూ గెలవకూడదు. ఏదీ అందుకో నా చేతికర్ర! పదండి. మరో దండియాత్రకు!"